శిథిలం
రూ॥90/-
పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

అగ్గలయ్యగుట్టపై 'గగ్గలయ్యగది' మిస్టరీ
ఢిల్లీ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం
మద్దతుధరల చట్టబద్ధతపై మోదీ దిగివచ్చేనా!
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 213 | బుధవారం | 22-01-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

## దాపరికంలేని ట్రంప్ సామ్రాజ్యవాద ఆధిపత్యం

భారత ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి

దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని పటిష్టం చేయాలి

సిపిఐ పిలుపు

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ సహకారాన్ని, సమానత్వాన్ని బలి పెట్టి రాబోయే కాలంలో అమెరికా ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనే సామ్రాజ్యవాద ధోరణికి డోనాల్డ్ ట్రంప్ ప్రసంగం ఒక తార్కాణంగా నిలిచిందని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) విమర్శించింది. అమెరికా 47వ అధ్యక్షుడుగా సోమవారంనాడు అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ తొలి ప్రసంగం తీరుపై సిపిఐ మండిపడింది. ఈ మేరకు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారంనాడు పత్రికా ప్రకటన విడుదల చేసింది. ''ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవ ప్రసంగంలో ప్రపంచ రాజకీయాలను సమస్యల్లో పడేసేరీతిలో బాహాటంగా సామ్రాజ్యవాద ఆధిపత్య ధోరణి ప్రదర్శించారు. అంతర్జాతీయ సహకారం, సమానత్వాలను మూల్యంగా చెల్లించి అమెరికా ఆధిపత్యాన్ని పటిష్టంగా పదిలపరచుకునే సామ్రాజ్యవాద భవిష్యత్ ఆలోచనలను ఆయన ఎలాంటి దాపరికం లేకుండా ప్రకటించారు. ట్రంప్ తన వాక్పటిమతో ఏకపక్షవాదాన్ని ప్రోత్సహించారు. దేశాలమధ్య పరస్పర గౌరవం, సార్వభౌమాధికారం, అంతర్జాతీయ చట్టం వంటి సూత్రాలను అణగదొక్కారు. ఆయన ప్రసంగం, ఆలోచనలు ప్రపంచ స్థిరత్వానికి ముప్పు. టారిఫ్‌లు వంటి రక్షణవాద ఆర్థిక విధానాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరువాయి 2లో

# ప్రపంచ ఆరోగ్యసంస్థ, పారిస్ ఒప్పందాలకు బైబై

ట్రంప్ తొలి నిర్ణయాలు; బైడెన్ జారీ చేసిన 78 ఉత్తర్వులు రద్దు



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడి హోదాలో జో బైడెన్ జారీచేసిన 78 రకాల ప్రభుత్వ ఉత్తర్వులను డోనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. బైడెన్ ఉత్తర్వులు చెల్లబోవని, ఆయన ఉత్తర్వులను తిరగదోడతాననీ, వాటిని రద్దుచేస్తాననీ ఎన్నికల్లో గెలిచినప్పటినుండీ ట్రంప్ ప్రకటనలు చేస్తూ వచ్చారు. అందుకు తగ్గట్టుగానే సోమవారంనాడు 47వ అధ్యక్షుడుగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయన ఎడాపెడా అనేక ఫైళ్ళపై సంతకాలు చేసేశారు. ఇకమీదట ఫెడరల్ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోం కాకుండా తప్పనిసరిగా కార్యాలయాలకు వచ్చి విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. రాబోయే వందరోజుల్లో చేపట్టే కార్యక్రమాలను ప్రకటించారు. ట్రంప్ ముందుగా చెప్పిన ప్రకారమే గల్ఫ్ ఆఫ్ మెక్సికోకు గల్ఫ్ ఆఫ్ ఆమెరికాగా నామకరణం చేశారు. పనామాను స్వాధీనం చేసుకుంటామని, వ్యూహాత్మకంగా, అమెరికా భద్రతకు సంబంధించి గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం కూడా ఎంతో ముఖ్యమైన విషయమని ఆయన పునరుద్ఘాటించారు. వాతావరణ సమస్యలపై పారిస్ వేదికగా జరిగిన కాప్ సదస్సులో కుదిరిన ఒప్పందాల తరువాయి 2లో

## మళ్ళీ టెర్రరిస్టు దేశాల జాబితాలోకి క్యూబా

డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చీరాగానే మరోసారి క్యూబాపై రుచుకుపడ్డారు. క్యూబాను తిరిగి టెర్రరిస్టు విదేశాల జాబితాలో చేర్చారు. జోబైడెన్ పదవీ విరమణ చేయడానికి ఆరు రోజులు ముందుగా క్యూబాపై టెర్రరిస్టు దేశం ముద్రను తొలగించాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజులు కూడా పూర్తికాకముందే ట్రంప్ ఆ ఉత్తర్వును రద్దుచేశారు. బైడెన్ నిర్ణయానికి ప్రతిగా క్యూబా ప్రభుత్వం కూడా 553 మంది ఖైదీలను విడుదలకు ఏర్పాట్లు చేసింది. కానీ ట్రంప్ అధికారం చేపట్టిరోజునే బైడెన్ తీసుకున్న 78 నిర్ణయాలను, సంబంధిత ఉత్తర్వులను రద్దుచేశారు. ప్రస్తుతం ఉత్తరకొరియా, ఇరాన్, సిరియా, క్యూబా సహా పలు దేశాలు అమెరికా ఆంక్షలు విధించిన ఉగ్రవాద దేశాల జాబితాలో ఉన్నాయి. బరాక్ ఒబామా కూడా 2015లో పదవీ విరమణ చేసేముందు క్యూబాపై ఆంక్షలు ఎత్తివేశారు. కానీ ట్రంప్ 2017లో మొదటి విడత అధికారంలోకి వచ్చిన వెంటనే క్యూబాపై ఆంక్షలు పునరుద్ధరించారు. బైడెన్ కూడా పదవి నుండి వైదొలగే ముందు క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయగా తిరిగి ట్రంప్ వచ్చి ఆ ఆంక్షలు పునరుద్ధరించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి పక్కలో బల్లెంగా మారిన కమ్యూనిస్టు దేశం కూబాపై అనేక దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక ఆంక్షలు కొనసాగిస్తున్నది. క్యూబా ప్రభుత్వంపై టెర్రరిస్టుదేశంగా ముద్రవేసింది.



# ఛత్తీస్‌గఢ్ - ఒడిషా సరిహద్దుల్లో రణరంగం

## 27 మంది మావోయిస్టులు హతం

- నక్సల్స్, భద్రతా దళాల మధ్య భారీగా ఎదురుకాల్పులు
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి, మరి కొందరు
- చలపతి తలపై రూ.కోటి రివార్డు

ప్రజాపక్షం/భద్రాచలం/రాయ్‌పూర్/భువనేశ్వర్

ఛత్తీస్‌గఢ్‌-ఒడిషా రాష్ట్రాల సరిహద్దుల్లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో జవాన్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. దీనిని సైనికుల విజయంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశంలో నక్సలిజం లేకుండా చేసేందుకు భద్రతా బలగాల ఉమ్మడి కృషి సత్ఫలితాలు ఇస్తున్నాయని, 2026 మార్చి ఆఖరి నాటికి దేశంలో నక్సలిజం అంతం చేస్తామని, ఇందుకు వరుస సంఘటనలే అన్నారు. 2025లో ఇప్పటి వరకు 40 మంది మావోయిస్టులు చనిపోగా, గత ఏడాది 219 మంది చనిపోయినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌-ఒడిషా రాష్ట్రాల సరిహద్దుల్లోని గరియాబాంద్, నౌపాడ జిల్లా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు జయరామ్ అలియాస్ చలపతి, అలయాస్ ప్రతాప్‌రెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నట్లు తెలుస్తోంది. చలపతి తలపై ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్ర ప్రభుత్వాల రూ.1 కోటి రివార్డు ఉంది. ఆయనది చిత్తూరు జిల్లా బంగారుపాలెం. 2011 మల్కనగిరి కలెక్టర్ వినిత్‌ను చలపతి కిడ్నాప్ చేశాడు. చలపతితో పాటు మరి కొంతమంది కీలకనేతలు ఉన్నట్లు భావిస్తున్నారు. గరియాబాంద్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డిఆర్‌జి, తరువాయి 2లో

# రాష్ట్రంలో పెట్టుబడులకు యూనిలివర్ సంసిద్ధత

బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సుముఖత

కామారెడ్డి జిల్లాలో పామ్ ఆయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకారం

దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతినిధిబృందంతో ఒప్పందం




ప్రజాపక్షం/హైదరాబాద్

వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసింది. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలివర్ తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు యూని లివర్ అంగీకరించింది. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో రెండో రోజు మంగళవారం వివిధ సదస్సులు, సమావేశాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాల్గొన్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబుతో పాటు పరిశ్రమల శాఖ అధికారుల బృందం అమెజాన్, యుని లివర్, స్కై రూట్ ఏరో స్పేస్, సిఫీ టెక్నాలజీస్ తదితర దిగ్గజ కంపెనీల సిఈఓలతో, కంపెనీల ప్రతినిధులతో వేర్వేరుగా చర్చలు జరిపారు. తెలంగాణలో వ్యాపార అవకాశాలు, పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను వారు తరువాయి 2లో

## స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

తెలంగాణలో రూ.500 కోట్ల పెట్టుబడితో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో స్కైరూట్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక రంగంలోని కంపెనీ స్కైరూట్ ఏరో స్పేస్‌తో దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం తరువాయి 2లో

# సినీరంగంపై ఐటి దాడులు



ప్రజాపక్షం/హైదరాబాద్

సినీ నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డిసి) చైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాపై మంగళవారం ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. దీంతో పాటు దిల్‌రాజు సోదరుడు శిరీష్, కూతురు హన్షిత రెడ్డి ఇళ్లలో తనిఖీలు జరిపారు. ఈ క్రమంలో విచారణలో భాగంగా ఆయన భార్య తేజస్వినిని అధికారులు బ్యాంకుకు తీసుకెళ్లారు. ఎస్‌విసి సంస్థ బ్యాలెన్స్ షీట్లు, ఐటిఆర్ వివరాలను ఐటి అధికారులు పరిశీలించారు. దిల్ రాజుకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థలోనూ తనిఖీలు జరిపారు. అటు మైత్రీ మూవీ మేకర్స్ కార్యాలయం, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవి శంకర్ నివాసాలు, మ్యాంగో మీడియా సంస్థ, సత్య రంగయ్య ఫైనాన్స్, నిర్మాత అభిషేక్ అగర్వాల్తో పాటు ఇతర ఫైనాన్స్ కంపెనీలలోనూ ఐటీ రైడ్స్ కొనసాగించారు. ఇలా ఏక కాలంలో ఎనిమిది చోట్ల 65 బృందాలు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీలలో తనిఖీలు తరువాయి 2లో



## ప్రపంచానికే మార్గం చూపిన లెనిన్

మార్క్సిజం దిగ్గజానికి సిపిఐ ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

మార్క్సిజం దిగ్గజం ఐ.వి.లెనిన్‌కు సిపిఐ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య, రమావత్ అంజయ్య నాయక్, ఆల్‌ఇండియా దళిత హక్కుల ఉద్యమం జాతీయ కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, శ్రీరాములు, దశరథ్, అంజయ్య, నరసింహ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ ప్రపంచానికే మార్గం చూపిన మహా నేత లెనిన్ అని కొనియాడారు. మార్క్సిజం వెలుగులో లెనిన్ బాటలో ప్రపంచం మొత్తం ప్రయాణించాల్సిన అవసరముందని తెలిపారు.



## కాళేశ్వరం కార్పొరేషన్‌కు నిధులెలావచ్చాయి?

రామకృష్ణారావును ప్రశ్నించిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరంప్రాజెక్ట్ విషయంలో ఆర్థిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావును జస్టిస్ పి.సిఘోష్ విచారించింది. హైదరాబాద్‌లోని బుర్గుల రామకృష్ణ భవన్‌లోని కాళేశ్వరం కమిషన్ కార్యాలయంలో జస్టిస్ పి.సి.ఘోష్ మంగళవారం జరిగిన బహిరంగ విచారణకు రామకృష్ణారావు హాజరయ్యారు. అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా రామకృష్ణను తరువాయి 12లో

# 2 ఎర్రజెండా గుడిసెల్లో ఏళ్లు




24న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ కాలనీలో ఆవిర్భావ వేడుకలు

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

నిలువ నీడ లేని తాడిత పీడిత ప్రజల పక్షాన సిపిఐ పోరాటం చేస్తోంది. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిర్వహించిన పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారు. భూ పోరాటం ఒక చారిత్రక ఘట్టం. అయితే ఇటీవల కాలంలో గత రెండు సంవత్సరాల క్రితం సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇండ్లు లేని పేదల కష్టాలను తీర్చడం కోసం భూ పోరాటాలు నిర్వహించింది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు వేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 280 సర్వే నంబర్‌లో ఉన్న ఎర్ర చెరువులో జనవరి 25, 2022న గుడిసెలు వేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సుమారు లక్ష జనాభా కలిగి ఉండగా, కూలీ పని చేసుకొని బతుకువెళ్లదీస్తున్న నిరుపేదలైన 1200 కుటుంబాలు ఇల్లు లేక ఇబ్బందులు పడుతుండడంతో వారికి సిపిఐ అండగా నిలిచింది. గతంలో భూపాలపల్లి తరువాయి 12లో

## 71 శాతం వాటా ఇవ్వాల్సిందే

కృష్ణా జలాల్లో తెలంగాణ కోటాపై కృష్ణానది యాజమాన్య బోర్డుకు తేల్చిచెప్పిన అధికారులు

అంతవరకూ చెరిసగం కేటాయించాలని విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణా జలాలలో తెలంగాణకు 71 శాతం వాటా ఇవ్వాల్సిందేనని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు కృష్ణా నది యాజమాన్య బోర్డుకు తేల్చిచెప్పారు. 71 శాతం ఖరారు చేసే వరకూ ఇరు రాష్ట్రాలకు చెరిసగం (50 శాతం) చొప్పున వాటా ఇవ్వాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని జలసౌధలో మంగళవారం కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశమైంది. బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ తరువాయి 12లో

# గాజా శిథిలాల్లో ఇంకా 10 వేల మృతదేహాలు!



**గాజా :** గాజాలో ఈ నెల 19వ తేదీ ఆదివారం నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత కొంత ప్రశాంత వాతావరణం ఏర్పడింది. బాంబు పేలుళ్ళు, కాల్పుల శబ్దాలస్థానంలో ప్రజల కేరింతలు, ఆనందోత్సాహాలు కనిపిస్తున్నాయి. కానీ గాజా యావత్తూ శ్మశానంలా కనిపిస్తున్నది. ప్రతి వీధిలోనూ ఇళ్ళనీ ధ్వంసమై, శిథిలమైపోయాయి. ఆసుపత్రులు నాశనమయ్యాయి. ఐతే పౌర సహాయ బృందాలు సహాయ కార్యక్రమాలను పునరుద్ధరించాయి. గాజా శిథిలాల్లో ఇంకా 10,000 మృతదేహాలు ఉండి ఉంటాయని తాము భయపడుతున్నట్లు గాజా సివిల్ డిఫెన్స్ ఏజన్సీ అధికార ప్రతినిధి మహ్మద్ బాసెల్ మంగళవారంనాడు చెప్పారు. రాబోయే 100 రోజుల్లో ఈ మృతదేహాలను వెలికి తీయగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుల్‌డోజర్లతోసహా అవసరమైన ఇతర సామాగ్రి కూడా కొరతగా ఉందని ఆయన చెప్పారు. గాజాలో ఇప్పటివరకూ 47,035 మంది పాలస్తీనియన్లు మరణించారనీ, మరో 1,11,091 మంది గాయపడ్డారనీ పాలస్తీనా ప్రభుత్వం అంచనాలు తప్పు అని లాన్సెట్ పరిశోధనా నివేదిక ఇటీవల వెల్లడించింది. ఈ మృతులసంఖ్య 64,000 వరకూ ఉండవచ్చునని లాన్సెట్ అధ్యయనం అంచనావేసింది. గాజాలో 20 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, వారికి ఇళ్ళు లేవని, ఉద్యోగాలు లేవని, ఒక్క దమ్మిడీ ఆదాయం కూడా లేదనీ, వారంతా పూర్తిగా ఐక్యరాజ్యసమితి సరఫరా చేస్తున్న మానవతా సహాయంపైనే ఆధారపడి తిని జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి సహాయబృందాలు చెప్పాయి.

ఇదిలా ఉండగా, గడచిన 48 గంటలుగా గాజాలోకి అంతర్జాతీయ మానవతా సహాయంలో భాగంగా రోజుకు 600 లారీలలో ఆహారం, నీరు, ఇంధనం వస్తూ ఉండటంతో ప్రజలో ఒక భరోసా ఏర్పడింది. 15 నెలల క్రితం ఇళ్లు వదిలి పారిపోయిన నిరాశ్రయులైన 19.50 లక్షలమంది ప్రజలలో ఎక్కువ మంది శిథిలమైన తమ ఇళ్ళ దగ్గరకు తిరిగి రావడం ప్రారంభించారు. ఇంకా సహాయ కార్యక్రమాలు కూడా మళ్ళీ ప్రారంభం అవుతున్నాయి. శిథిలాలను తవ్వి తీస్తున్నారు. 42 మిలియన్ టన్నుల బూడిద గాజాలో పేరుకుపోయింది. ఈ బూడిదను తొలగించడానికి అనేక సంవత్సరాలు పడుతుంది. ఒప్పందంలో భాగంగా మూడోదశలో పలు సంవత్సరాలపాటు గాజా పునర్నిర్మాణ కార్యక్రమం కొనసాగుతుంది.

**25న మరో నలుగురు మహిళా బందీల విడుదల**

కాల్పుల విరమణ ఒప్పందం మంగళవారంనాటికి మూడోరోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్ సైన్యాలు గాజాలోని పలు ప్రాంతాల నుండి వెనక్కు వెళ్ళిపోవడం ప్రారంభమైంది. మొదటి విడతగా ఇజ్రాయెల్–హమాస్ ఇరువైపుల నుండీ బందీలను, ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. హమాస్ ముగ్గురు మహిళా బందీలను తొలి విడతగా విడుదల చేసింది. 734 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. రెండో విడత బందీలు–ఖైదీల పరస్పర మార్పిడి కార్యక్రమం తిరిగి ఈనెల 25వ తేదీన శనివారంనాడు జరుగుతుంది. ఆరోజున మరో నలుగురు మహిళా బందీలను విడుదల చేస్తామని హమాస్ మంగళవారంనాడు ప్రకటించింది. హమాస్ వద్ద ఇంకా 94 మంది బందీలున్నారనీ, వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని బందీల బంధువులు డిమాండ్ చేస్తున్నారు. కానీ ఒప్పందం ప్రకారం మరో 30 మంది బందీలను మాత్రమే హమాస్ విడుదల చేస్తుంది. ఇజ్రాయెల్ మాత్రం మొత్తం 2000 మంది ఖైదీలను మూడు విడతల్లో ఆరు వారాల వ్యవధిలో విడుదల చేస్తుంది. ఇదిలాఉండగా హమాస్ సైనిక సామర్థ్యాన్ని సంపూర్ణంగా నాశనం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ప్రకటించారు.

# అఫ్ఘానిస్థాన్ నుండి ఇద్దరు అమెరికన్ ఖైదీల విడుదల



**కాబూల్ :** అఫ్ఘానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఇద్దరు అమెరికన్ ఖైదీలను విడుదల చేసింది.ట్రంప్ ప్రమాణ ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమెరికా–అఫ్ఘానిస్థాన్‌ల మధ్య సంబంధాల్లో కొత్త శకం ప్రారంభం అవుతుందని తాలిబన్లు ఆశాభావంతో ఉన్నారు.ఖతార్ మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఒక అఫ్ఘాన్ ఫైటర్‌ను విడుదల చేసినందుకు ప్రతిగా ఇద్దరు అమెరికన్ ఖైదీలను విడుదల చేసినట్లు తాలిబన్ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మొంగళవారంనాడు ప్రకటించారు. ఖైదీల పరస్పర మార్పిడి ఒప్పందం గత ఏడాదిలోనే కుదిరినప్పటికీ జో బైడెన్ సోమవారంనాడు పదవీకాలం ఆఖరిరోజున ట్రంప్‌కు ఈ బాధ్యతలు అప్పగించిన సందర్భంగా ఈ విడుదల జరిగింది. అఫ్ఘానిస్థాన్‌కు చెందిన ఫైటర్ ఖాన్ మహ్మద్‌ను విడుదల చేసినందుకు ప్రతిగా కాబూల్‌లో ఖైదీలుగా ఉన్న ఇద్దరు అమెరికన్‌లను తాలిబన్లు విడుదల చేశారు. తూర్పు అఫ్ఘానిస్థాన్ రాష్ట్రం నాన్‌గర్హార్‌లో రెండు దశాబ్దాలక్రితం అరెస్టు చేసిన ఖాన్ మహ్మద్‌ను కాలిఫోర్నియా జైలులో ఉంచారు. రియాన్ కార్బెన్‌ను తాలిబన్లు 2022లో అరెస్టు చేసి ఖైదు చేశారు. ఆయనను విడుదల చేసినట్లు కార్బెన్ కుటుంబ సభ్యులు ధృవీకరించారు. మరో అమెరికన్ మెక్ కెంటీని కూడా విడుదల చేశారు. కాగా అఫ్ఘానిస్థాన్‌లో ఇంకా మరో ఇద్దరు అమెరికన్లు జైలుశిక్ష అనుభవిస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది.

# ఇండోనేసియాలో వరదలు :17 మంది మృతి






**జకర్తా :** ఇండోనేసియాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా17 మంది మరణించారు. మరో ఎనిమిదిమంది జాడతెలియకుండా పోయారు. వరదలవల్ల మట్టిపెళ్ళలు విరిగిపడ్డాయి. టన్నులకొద్దీ బరువుగల భారీ బురదమట్టి పెళ్ళలు కొండ చరియల నుండి విరిగి పడటంతో అనేక మంది అందులో కూరుకుపోయి మరణించారు. జావా లోని కొండప్రాంత గ్రామంలో మంగళవారంనాడు ఈ విషాద సంఘటన జరిగింది. సోమవారంనాడు ఇండోనేసియాలో ఎడతెగని వర్షాలు కురిశాయి. దీంతో సెంట్రల్ జావా రాష్ట్రం పెకలోంగన్ రెజెన్సీలోని తొమ్మిది గ్రామాల్లో ఉప్పొంగిన నదులు వరద బీభత్సం సృష్టించాయి. సహాయ బృందాలు మంగళవారంనాడు బురద మట్టి నుండి శవాలను వెలికి తీశారు. ఈ గ్రామాలలో వాహనాలు, ఇళ్ళల్లో వస్తువులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఇండోనేసియాలో 17,000 దీవులు ఉన్నాయి. ఈ దీవుల్లో అక్టోబరు నుండి మార్చి వరకు వరదలు, భారీ వర్షాలు సంభవిస్తూ ఉంటాయి.

**తైవాన్‌లో భూకంపం**

తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై ఈ తీవ్రత 6.0గా నమోదైంది. ఈ ఘటనలో ఎవరూ మరణించలేదు. 27 మంది గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భూకంపం వచ్చింది. కుప్పకూలిపోయిన ఇళ్ళనుండి ఆరు నెలల వయసుగల ఒక పసిబిడ్డతోసహా అనేకమందిని అగ్నిమాపకదళ సిబ్బంది కాపాడారు. కాగా చియాయిలోని ఒక ప్రింటింగ్ ఫ్యాక్టరీలో ఈ భూకంపం వల్ల పెద్ద అగ్నిప్రమాదం సంభవించింది. గత ఏడాది ఏప్రిల్‌లో తూర్పు తీరంలో వచ్చిన భూకంపంవల్ల 13 మంది మరణించారు. 1,000 మంది గాయపడ్డారు.

# టర్కీ స్కై రిజార్ట్ దగ్ధం 66 మంది మృతి!



**అంకారా :** టర్కీ వాయువ్యప్రాంత బోలూ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కర్తల్ కయ స్కై రిజార్ మంటల్లో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 66 మంది మరణించారన్నది తాజా సమాచారం. 51 మంది గాయపడ్డారు. కొందరు సజీవదహనంకాగా, మరికొందరు కిటికీల్లోంచి కిందకు దూకడంవల్ల మరణించారు. మరో 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. పూర్తిగా చెక్కతో తయారు చేసిన 161 గదులుగల 12 అంతస్తుల ఈ కార్తల్ హోటల్‌లో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు మంటలు చెలరేగాయని ఆ దేశ హోంశాఖ తెలిపింది. ఈ ఘటన జరిగిన సమయంలో హోటల్‌లో 234 మంది ఉన్నారు. మంటలను చూసి ముందుగా మేల్కొన్న కొంతమంది మిగిలినవారి తలుపులు తట్టి అప్రమత్తం చేసి బయటకు తీసుకువచ్చేందుకు సహాయం చేశారు. మంటలు చెలరేగడానికిగల కారణాలు తెలుసుకునేందుకు ఆరుగురు ప్రాసిక్యూటర్లను ప్రభుత్వం దర్యాప్తుకోసం నియమించింది. ఇస్తాంబుల్‌కు 300 కి.మీ దూరంలో కొరోగ్లూ పర్వతాల్లో ఈ స్కై హోటల్ ఎంతో ప్రసిద్ధి చెందింది.

# లెబనాన్ సైన్యానికి 62 మిలియన్ డాలర్ల ఇయు సహాయం



**నక్వారా :** లెబనాన్ సైన్యానికి యూరోపియన్ యూనియన్ 62 మిలియన్ (60 మిలియన్ యూరోలు) డాలర్లు ఆర్థిక సహాయం చేస్తుంది. యూరోపియన్ యూనియన్ మంగళవారంనాడు ఈ ప్రకటన చేసింది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న లెబనాన్‌లో ఇజ్రాయెల్–హిజ్బొల్లామధ్య ఒప్పందం అమలుకు ఈ సహాయం దోహదం చేస్తుంది. యూరోపియన్ యూనియన్ విదేశాంగవిధాన ప్రధానాధిపతి కాజా కల్లాస్ ఈ విషయం చెప్పారు. అంత్యత సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వహిస్తున్న లెబనాన్ సైన్యానికి ఈ కీలక తరుణంలో తమ సహాయం, మద్దతు చాలా అవసరం అనీ, పశ్చిమ ఆసియా ప్రాంతంలో లెబనాన్ అంతర్గతంగా స్థిరత్వం సాధించడానికి ఈ సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

ప్రపంచం

# మొదటిసారి కోర్టుకు వెళ్ళిన యోల్



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఎట్టకేలకు మంగళవారంనాడు మార్షల్ లా కేసు విచారణ నిమిత్తం కోర్టుకు హాజరయ్యారు. తన అరెస్టు అక్రమం అని ఆయన వాదించారు. ఈ విధంగా దక్షిణ కొరియాలో దేశాధ్యక్షుడు పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా పదవీచ్యుతుడై కోర్టుబోనులో నిందితుడుగా నిలబడం ఇదే మొదటిసారి. గతనెలలో పార్లమెంటు తీర్మానం ద్వారా ఆయన పదవీచ్యుతుడయ్యారు. ఆయనను శాశ్వతంగా పదవికి, రాజకీయాలకు దూరం చేయాలా?వద్దా? అనే విషయాన్ని న్యాయస్థానం నిర్దేశిస్తుంది. మార్షల్ లా విధించినందుకు తనను అరెస్టు చేయడం సరైన చర్య కాదని, ఇది న్యాయ సమ్మతం కాదని యూన్ సుక్ యోల్ కోర్టులో వాదించారు. కోర్టు బయట వేలమంది ఆయన అనుచరులు గుమిగూడటంతో పోలీసులు ఒక కంచుకోటలా ఏర్పడి భద్రతవలయం సృష్టించారు.

## యూనిలివర్ సంసిద్ధత

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. యూనిలివర్ సిఈఓ హీన్ షూమేకర్, ఆ కంపెనీ చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. యూనిలీవర్ భారతదేశంలో హిందూస్తాన్ లివర్ పేరిట వ్యాపార వ్యవహారాలు నిర్వహిస్తోంది. ఈ చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ వారధిగా ఉంటుందని, అనుకూల వాతావరణంతో పాటు తూర్పు పడమరన ఉన్న మిగతా రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉంటుందని సిఎం అన్నారు. తెలంగాణాలో పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, సులభతర వ్యాపార విధానాలు అదనపు బలంగా ఉంటాయని సిఎం చెప్పారు. 'తెలంగాణ రైజింగ్–2050' విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళిక ప్రపంచంలో అత్యుత్తమంగా అందరినీ ఆకర్షిస్తుందన్నారు. దేశంలో యూనిలీవర్ తయారీ కేంద్రాలున్నప్పటికీ ఈ కంపెనీ తెలంగాణాలో విస్తరించలేదని, దేశంలో అత్యధికంగా విస్తరణ అవకాశాలున్న వాటిపై దృష్టి సారించి, అటువంటి రంగాల్లోనే పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కంపెనీ ప్రతినిధులతో తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన యూని లీవర్ సిఈఓ తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రీ ఫైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని, కామారెడ్డి జిల్లాలో తగిన స్థలాన్ని కేటాయిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. యూని లీవర్ బృందం బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేయడానికి కొత్త తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. యూని లీవర్ ఉత్పత్తులు ఎక్కువగా ద్రవ రూపంలో సీసాలలో అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం ఈ బాటిల్ క్యాప్ లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసే యూనిట్ వీటి కొరతను తీర్చనుంది.ఇదిలా ఉండగా, స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 55వ వార్షిక సదస్సు మూడు రోజుల పాటు జరగనుంది. ఈసారి సమావేశాల్లో 'ఇండస్ట్రీస్ ఇన్ ఇంటిలిజెంట్ ఏజ్ అనే థీమ్‌ను వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఎంచుకుంది. శాస్త్ర సాంకేతిక అధునాతన పరిజ్ఞానానికి అనుగుణంగా పారిశ్రామిక వ్యూహాల మార్పు, పెరుగుతున్న ఇంధన అవసరాలు సమకూర్చుకోవాలనే ఇతివృత్తంతోనే రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులతో పాటు ఆయా రంగాలు, పరిశ్రమలకు చెందిన నిపుణులు, పారిశ్రామికవేత్తలు దాదాపు మూడు వేల మంది ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఇటీవల అమల్లోకి వచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇంధన ఉత్పత్తితో పాటు హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ అభివృద్ధి, ఎఐ ఆధారిత ఐటి సేవల విస్తరణ, అత్యాధునిక డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయి. ప్రధానంగా తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కాలిఫోర్నియాకు చెందిన సాంబనోవా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఎఐ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించటంలో పేరొందిన సంస్థతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ తెలంగాణ పెవిలియన్‌లో జరిగిన మొదటి సమావేశంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రపంచంలో పేరొందిన లాజిస్టిక్స్ కంపెనీల్లో ఒకటైన ఎజిలిటీ సంస్థ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరంగా పెంచేందుకు ఇస్తున్న ప్రాధాన్యతలను మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశంలో ఆయనతో చర్చించారు. అనంతరం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సారథ్యంలో వివిధ కంపెనీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రధానంగా ఐటి, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ టీమ్ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నారు. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రానికి ఈసారి భారీ పెట్టుబడులు వస్తాయనే అంచనాలున్నాయి.

## సామ్రాజ్యవాద ఆధిపత్యం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించే ఉద్దేశంతో తలపెట్టినవే. ఇలాంటి విధానాలు ప్రపంచదేశాలమధ్య అసమానతలు మరింత పెరిగిపోయేట్టు చేస్తాయి. ఈ విధానాలు యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఒక పద్ధతి ప్రకారం దోపిడీ చేయడమే.ట్రంప్ పాలనా యంత్రాంగం వాతావరణ మార్పులను తిరస్కరించి, పర్యావరణ రక్షణలను వెనక్కు మళ్ళించడం యావత్ పర్యావరణ వ్యవస్థను ప్రమాదంలో పడేయడమే. ముఖ్యంగా సాంస్కృతికంగా చిన్నచూపు చూసే, యూరప్, ఉత్తర అమెరికా వెలుపల ఉండే తక్కువ ఆదాయాలున్న దేశాలలో ఉండే అనారోగ్యపీడిత ప్రజలకు దీనివల్ల తీవ్ర నష్టం కలుగుతుంది. దీనికి అదనంగా స్త్రీ పురుష సమానత్వాన్ని లేకుండా చేయడం, కాలంచెల్లిన కృతయుగంనాటి ఆలోచనలను శాశ్వతీకరించడం సామాజిక న్యాయానికి గొడ్డలిపెట్టులా మారుతుంది.ట్రంప్ ప్రసంగం వలసవాద ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసింది వారిలో కొత్త భయాలకు, చీలికలకు ఆజ్యంపోసింది, ఈ విధమైన విధానాలు విదేశీయులంటే ఏహ్యాభావం కలిగించి తీవ్ర సమస్యలు తెస్తా, వలస ప్రజల హక్కులను ఈ విధానాలు హరిస్తాయి, భిన్నత్వాన్ని, అందరినీ కలుపుకుని వెళ్ళే సమ్మిళితతత్వాన్ని లేకుండా చేస్తాయి. లాటిన్ అమెరికా, ప్రత్యేకించి క్యూబా దేశంపట్ల కయ్యానికి కాలుదువ్వే దుందుడుకు వైఖరి సామ్రాజ్యవాద జోక్యానికి సంకేతంగా కనిపిస్తున్నది, ప్రపంచంలో వివిధ దేశాల స్వయంనిర్ణయాధికారానికి పెద్ద బెదిరింపుగా కనిపిస్తున్నది.ఈ పూర్వరంగంలో భారత ప్రభుత్వం అమెరికా పాలనాయంత్రాంగంతో ఆదాన ప్రదానాలు జరిపేటప్పుడు జాతీయ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పునరుద్ఘాటించాలి, దేశ బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని రక్షించుకునే వాదనలు చేయాలి, ప్రపంచ సమానత్వానికి కట్టుబడాలి. భారత దేశం తప్పనిసరిగా విదేశీజోక్యాన్ని, వెలుపలి నుండి వచ్చే ఒత్తిడులను తిరస్కరించాలి. ఆమెరికా విధానాలలో తీవ్రమైన మార్పులు సంభవించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం దేశీయ ప్రాధాన్యలకు భరోసా కలిగేలా ప్రాధాన్యతలు పాటించాలి, ఈ విషయంలో ఎలాంటి రాజీపడకుండా వ్యవహరించాలి. అదేవిధంగా అమెరికాలో కొత్తగా వచ్చిన పాలకులు, పాలనాయంత్రాంగంపట్ల భారత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా భారత కమ్యూనిస్టుపార్టీ పిలుపు ఇస్తున్నది, భారత ప్రభుత్వం అమెరికా ఒత్తిడులకు లొంగిపోకుండా ఉండేవిధంగా దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావ ఉద్యమాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## రణరంగం (మొదటి పేజీ తరువాయి)

కోబ్రా బలగాలతో పాటు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తగా ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజాము నుండి ప్రారంభమైన ఎదురుకాల్పులు మంగళవారం మధ్యాహ్నం వరకు సుమారు 30 గంటలపాటు సాగాయి. మొదటిరోజు రాత్రి ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందినట్లు గుర్తించిన భద్రతా బలగాలు మరుసటి రోజు 12 మంది మృతదేహాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. అంతే కాకుండా సిద్దిపేట జిల్లా కొహెడకు చెందిన కట్టం రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్, నల్లగొండ జిల్లా చుండూరు మండలం పల్లెలల గ్రామానికి చెందిన మరో మావోయిస్టు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తో పాటు, అధునాతన తుపాకులు మందుగుండు సామాగ్రి, ఐఇడి బాంబులు స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వారిని గుర్తించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గరియాబాండ్ జిల్లా ఎస్‌పి నిఖిల్ రహేజా తెలిపారు.

**కొయ్యూరు తరహానేనా**

1999లో కరీంనగర్ జిల్లా కొయ్యూరులో జరిగిన ఎన్‌కౌంటర్‌తో ప్రస్తుత ఘటనకు విప్లవోద్యమ విశ్లేషకులు ముడిపెడుతున్నారు. అప్పటి డిసెంబర్ 2న జరిగిన ఎదురు కాల్పుల్లో పీపుల్స్ వార్ కేంద్ర కమిటీకి చెందిన ఇద్దరు సభ్యులను, మరో నాయకుడు చనిపోయారు. ఆనాటి ఘటనలో సెంట్రల్ ప్రొవిజనల్ కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యాం, కేంద్ర కమిటీ సభ్యుడు, ఆనాటి రాష్ట్ర కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి అలియాస్ మహేష్, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి శీలం నరేష్ అలియాస్ మురళీ మృతి చెందారు. కేంద్ర కమిటి స్థాయి నాయకులను కోల్పోయిన ఘటనల్లో కొయ్యూరు తర్వాత గరియాబాండ్ ఎన్‌కౌంటర్ ఉదంతం కావచ్చని భావిస్తున్నారు.

## స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్కైరూట్ కంపెనీ దాదాపు రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఒప్పందం పట్ల తన ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందన్నారు. తెలంగాణకు చెందిన యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించటంతో పాటు, రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు అభినందించారు. స్కైరూట్ కంపెనీతో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెపుతుందని సిఎం అన్నారు. త్వరలోనే హైదరాబాద్ ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం తమకు సంతోషంగా ఉందని స్కైరూట్ కోఫౌండర్ పవన్‌కుమార్ చందన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్, హైదరాబాద్ రైజింగ్ లక్ష్య సాధనలో భాగస్వాములమౌతామని చెప్పారు.

## ఐటి దాడులు (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చిన భారీ సినిమాల పెట్టుబడులు, ఆదాయంపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. భారీ బడ్జెట్లు, కలెక్షన్లు, తదితర అంశాలపై ఐటీ అధికారులు ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇవాళ్టి ఉదయం నుంచి ఇన్కమ్ ట్యాక్స్ సోదాలు నగరంలో వేడి పుట్టిస్తున్నాయి.

**లాకర్లను తెరిపించారు దిల్‌రాజ్ భార్య...**

ఐటీ అధికారులు సోదాలపై తేజస్విని స్పందించారు. సినిమా నిర్మాణాలకు సంబంధించి తమ ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. సోదాల్లో భాగంగా ఐటీ అధికారులు అడిగిన డాక్యుమెంట్లు, ఇతర రికార్డులను వారికి అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే బ్యాంకు వివరాలు కూడా ఇచ్చామన్నారు. అలాగే అధికారులు తనను బ్యాంక్‌కు తీసుకెళ్లి లాకర్లు ఓపెన్ చేయించారని ఆమె తెలిపారు. దాంతో బ్యాంకు లాకర్లు ఓపెన్ చేసి చూపించినట్లు తేజస్విని చెప్పారు.

## 22 మందికి నయబ్ తహసీల్దార్లుగా పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోన్ ఐదు పరిధిలో 22 మందికి నయబ్ తహసిల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు సిసిఎల్ఎ నవీన్ మిట్టల్ ప్రొసిడింగ్స్‌ను జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లు/అడాక్ నయబ్ తహసిల్దార్లను నయాబ్ తహసిల్దార్లుగా పదోన్నతి కల్పించారు. కాగా పదోన్నతులు పొందిన వారిలో జనగాం,నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలకు చెందిన వారు ఉన్నారు.

## పారిస్ ఒప్పందాలకు బైబై

(మొదటి పేజీ తరువాయి)

నుండి ట్రంప్ రెండోసారి బయటకు వచ్చారు. దీనివల్ల భూగోళ ఉష్ణోగ్రతలు అనుకున్న ప్రమాణాలకంటే 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే చాలా తీవ్రస్థాయిలో పెరిగిపోతాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరికలు చేశారు. ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని వారు హితవు చెప్పారు. అదేవిధంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) కు అమెరికా 18 శాతం మేరకు నిధులు సమకూరుస్తూ ఉంటుంది. ఈ బడ్జెట్ కేటాయింపులలో తీవ్ర అసమానతలు ఉన్నాయని, మిగిలినవారు తమ బాధ్యత నిర్వహించడంలేదని ట్రంప్ ఎప్పటినుండో గుర్రుగా ఉన్నారు. అగ్రదేశం చైనా కంటే తమ దేశమే చాలా ఎక్కువగా ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఏటా నిధులు సమకూరుస్తోందని, ఇది చాలా అన్యాయపూరితంగా, సమానత్వం లేకుండా కొనసాగుతోందని ట్రంప్ విమర్శించారు. అమెరికా ప్రభుత్వమే అతిపెద్ద దాతగా ఉండటం ట్రంప్‌కు నచ్చలేదు. అందుకే డబ్ల్యుహెచ్ఓ నుండి ఆయన వైదొలగారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధానాధిపతి డాక్టర్ టెడ్రోస్ ఘెబ్రెసస్ స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భావానికి గల కారకులలో అమెరికా కూడా ఒకటని ఆయన గుర్తుచేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంతవరకూ నిర్వహించిన కార్యకలాపాలలో అమెరికా భాగస్వామ్యం ఎంతో ఉందన్న విషయాన్ని మరచిపోకూడదన్నారు.

**1,600 మంది విడుదలకు రంగం సిద్ధం**

2021 జనవరి 6వ తేదీన క్యాపిటల్ హిల్ భవనంలో జో బైడెన్ ఎన్నికను ఆమోదిస్తూ కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహిస్తుండగా ట్రంప్ అనుచరులు వేలాదిమంది ఆ భవంతిపై దాడి చేశారు. అమెరికా ప్రజాస్వామ్య చరిత్రలో మాయనిమచ్చగా మిగిలిపోయిన ఈ ఘటనచూసి ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది. దీంతో ట్రంప్‌తోపాటు 1,600 మంది ఆయన అనుచరులను ఫెడరల్ పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. వీరిలో 1,200 మంది అమెరికా వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి రాజధాని వాషింగ్టన్‌కు ఈ ర్యాలీ నిమిత్తం ఆరోజు వచ్చిన వారే. ఐతే ఆనాటి దాడిలో 100 మంది పోలీసులు గాయపడ్డారు. గత ఏడాది నవంబరులో అధ్యక్షుడుగా గెలిచిన తర్వాత క్యాపిటల్ హిల్‌పై దాడి ఘటనలో కేసులు రద్దుచేస్తామని ట్రంప్ ప్రకటించారు. అనుకున్న విధంగానే ఆయన ఫెడరల్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 1,600 మంది ట్రంప్ అనుచరులు జైళ్ళనుండి విడుదలయ్యే అవకాశం ఉంది. వీరిలో నేరాభియోగాలపై 250 మందికి శిక్షలు పడ్డాయి. అల్లర్లకు పాల్పడ్డారని 1000 మందికి శిక్ష పడింది. అదేవిధంగా న్యాయమూర్తుల ఎదుట పెండింగ్‌లో ఉన్న సంబంధిత 450 కేసులను కూడా రద్దు చేయాలని అటార్నీ జనరల్‌కు ట్రంప్ ఆదేశించారు.

**టిక్‌టాక్‌కు 75 రోజులు గడువు**

చైనా యాప్ టిక్‌టాక్‌కు ట్రంప్ 75 రోజులు గడువు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ తనకు ఫోన్ చేసి టిక్ టాక్ గురించే అడుగుతున్నారని ట్రంప్ ప్రమాణ స్వీకారం అనంతర ఓవెల్ కార్యాలయంలో అన్నారు. టిక్‌టాక్‌కు అమెరికాలో 175 మిలియన్ల యూజర్లు ఉన్నారు. టిక్ టాక్ గనుక అమెరికాలో తన వ్యాపార కార్యకలాపాలు సాగించాలంటే 50 శాతం వాటాను అమెరికాకు చెందిన కంపెనీకి విక్రయించాలని, ఈ క్రతువు 75 రోజుల్లో పూర్తికావాలని టిక్‌టాక్ సిఇఓ షో జీ చ్యూకు తెలియజేశారు. ఆయన ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

**మరణశిక్షపై సంతకం**

అక్రమ డ్రగ్స్ ముఠాలను అదుపు చేసేందుకు వీలుగా అమెరికా రాష్ట్రాలలో కఠిన శిక్షలు అమలు చేసేందుకు మరణశిక్ష ఉత్తర్వులపై డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో వివిధ రాష్ట్రాలు నేరస్థులను అదుపు చేసేందుకు కఠిన శిక్షలు అమలు చేసే అవకాశం ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం 2021లో మాజీ అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్ ఈ మరణశిక్షలపై నిషేధం విధించారు. ట్రంప్ 2017లో అధికారంలో ఉన్నకాలంలో డ్రగ్స్ మాఫియాకు చెందిన 13 మందికి ఉరిశిక్షలు అమలు చేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని, నేరగాళ్ళను తరిమికొడతామని ట్రంప్ విస్తృత ప్రచారం చేశారు. అందుకు అనుగుణంగానే ఆయన ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

**'ఐ యామ్ బ్యాక్ బేబీ'..!**

**ప్రపంచ పతాక శీర్షికల్లో ట్రంప్**

సోమవారంనాడు యావత్ ప్రపంచ మీడియా దృష్టి అంతా వైట్‌హౌస్ మీదే ఉంది. డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ మీడియాను హైజాక్ చేశారు. చిన్న,పెద్ద,మధ్యతరహా అనే తేడా లేకుండా జగమంతా మీడియాలో ట్రంప్ మయంగా మారింది. ప్రపంచదేశాల్లో ఏ మూల చూసినా పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ట్రంప్ ముచ్చట్లే కనిపించాయి. ఆయన నిర్ణయాల గురించే అందరూ ప్రధానంగా చర్చించారు. అమెరికా ఫస్ట్, అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదాలు, అక్రమ వలసల నియంత్రణ, గ్రీన్‌లాండ్, పనామాల ఆక్రమణ వంటి విషయాలే ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. ట్రంప్ యాటిట్యూడ్‌కు తగినట్లుగానే పత్రికలు విభిన్నరకాల పతాకశీర్షికలు రాశాయి. ''జగడాల మారి ట్రంప్ మళ్ళీ వచ్చాడు'', 'ఇక స్వర్ణయుగం ప్రారంభం', 'ఐ యామ్ బ్యాక్ బేబీ', 'ఇక బలమైన ప్రభావం తప్పదు'....ఇలా ప్రధాన కార్పొరేట్ పత్రికలు విభిన్న శీర్షికలు, విశ్లేషణలతో పత్రికలను నింపేశాయి.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎవరూ ఆందోళన చెందొద్దు

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ఎవరూ ఆందోళన చెంద వద్దు అని మంత్రి రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. బుధవారం నుండి గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతాయని, రేషన్ కార్డులు రానివారు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని మంత్రి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి, రాని వారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు మంత్రి సూచించారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు అన్నారు. గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారా? అని బిఆర్ఎస్ నేతలను మంత్రి ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న రూ.10వేలను రూ.12వేలకు పెంచడం జరిగిందన్నారు. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. రైతులకు 2 లక్షలలోపు రైతు రుణమాఫీ చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికాలంలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చామని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇప్పటికీ అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెలలోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇళ్లపై జరుగుతున్న తప్పుడు సమాచారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అర్హులందరికీ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ..

# దేశవ్యాపితంగా మిలిటెంట్ పోరాటాలు

కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాపితంగా మిలిటెంట్ పోరాటాలకు సంసిద్ధం కావాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఉద్యమాలకు నిరసన కార్యక్రమాలు చేసి కేంద్ర కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న న్యూఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అధ్యక్షుడు వి.నాగేశ్వర్‌రావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకుడు ఎం.బి.విజయ్‌కుమార్ యాదవ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ బిజెపి 3వసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మరింత దూకుడుగా కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోజు రోజకూ పెరుగుతున్న పేదరికాన్ని కార్మికులు భరించలేని స్థితిలో పోరాటం తప్ప వేరే మార్గం లేదని గుర్తించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ యూనిట్లలలో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ, ప్రభుత్వ ఆస్తుల అతి చౌకగా అమ్మకాలను నిరసిస్తూ ఇప్పటికే దేశంలో కార్మికులు అనేకసార్లు సమ్మెలు చేసినా, మరోవైపు రైతు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు నెలల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నా కేంద్ర ప్రభుత్వ కనీసం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈనెల 29న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమై ఉమ్మడి కార్మిక సంఘాల కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన తెలిపారు.



కర్ణాటక బెళగావిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో ప్రియాంకగాంధీని కలిసిన తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

## రేషన్‌కార్డులు.. పింఛన్లు, ఇళ్లు వచ్చే వరకూ పోరాటం చేయాలి

హైదరాబాద్ ఎంఎల్‌ఎలకు కెటిఆర్ సూచన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ఏడాది కాలంగా సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు ఇచ్చే వరకూ పేదల పక్షాన బిఆర్‌ఎస్ పోరాటం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలతో కెటిఆర్ మంగళవారం సమావేశమయ్యారు. హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలను స్థానిక ఎంఎల్‌ఎలు కెటిఆర్ దృష్టికి తీసుకొచ్చారు. కెటిఆర్ మాట్లాడుతూ మెట్రో రైలు, సివరేజీ ప్రాజెక్టులు, ఐటి వృద్ధి, ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు నగర రూపురేఖలను మార్చి దేశానికే గర్వకారణంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కాపాడాలనే సోయి కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆరోపించారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఏడాది కాలంగా హైదరాబాద్‌లోని పేదలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కూడా రేవంత్ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని, అనేకచోట్ల కబ్జాలకు గురయ్యాయని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రజలను ఉద్యమాల్లో భాగస్వాములను చేయడమే కర్తవ్యం

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాల్లో భాగస్వాములను చేయడమే తమ కర్తవ్యమని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు అన్నారు. పార్టీ మహాసభల్లో సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సమాయత్తమవుతామన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్న సిపిఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి రూపొందించిన ఎర్రజెండా పాటల సీడిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ మహాసభల సందేశాన్ని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ప్రముఖులు, రచయితలు పాటలు రాశారన్నారు. సిపిఐ(ఎం)కు ప్రజల పట్ల అంకితభావాన్ని, సోషలిజం పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఈ పాటలను రాశారని చెప్పారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నర్సింహ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, టి.జ్యోతి, డి.జి.నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, హైదరాబాద్ కార్యదర్శి ఎన్.మారన్న తదితరులు పాల్గన్నారు.



## తెలంగాణ మహిళా కమిషన్‌కు వేణుస్వామి బహిరంగ క్షమాపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హీరో నాగచైతన్యపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు జ్యోతిష్కుడు వేణుస్వామి పేర్కొన్నారు. గతంలో నాగచైతన్య, శోభితలు కూడా ఎక్కువ కాలం కలిసి ఉండరని, ఇద్దరూ మళ్లీ విడాకులు తీసుకుంటారని వేణుస్వామి జోష్యం చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఉదంతంపై వేణు స్వామి వ్యాఖ్యలపై ఉమెన్ కమిషన్‌కి గతంలోనే ఫిలిం జర్నలిస్ట్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో వేణు స్వామికి తెలంగాణ ఉమెన్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఉమెన్ కమిషన్ నోటీసులను సవాలు చేస్తూ వేణుస్వామి హైకోర్టును ఆశ్రయించడంతో ..ఉమెన్ కమిషన్ ముందు హాజరు కావాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేణుస్వామికి మరొకసారి ఉమెన్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. దీంతో మంగళవారం వేణుస్వామి ఉమెన్ కమిషన్ కార్యాలయంకు హాజరై తన వ్యాఖ్యలను ఉపసరించుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఉమెన్ కమిషన్‌కు వేణుస్వామి క్షమాపణలు కోరారు. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కావొద్దని వేణు స్వామిని ఉమెన్ కమిషన్ హెచ్చరించింది.

# గణతంత్ర వేడుకలకు అప్రమత్తమైన పోలీసులు

కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో అసాంఘిక శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని కేంద్ర నిఘా సంస్థలు ఆయా రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికల ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్ర నిఘా విభాగంతో పాటు శాంతి భద్రతల పోలీసులను డిజిపి డాక్టర్ జితేందర్ పలు సూచనలు జారీచేశారు. ఈ సూచనలలో భాగంగానే రాష్ట్ర పోలీసులు వారివారి పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీలోని సైదాబాద్‌లో మంగళవారం సాయంత్రం స్థానిక పోలీసులతో పాటు సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. పాతబస్తీలో ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వుదళాలను దింపారు. ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా పెంచారు. గత ఏడాది నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పలువురు అనుమానితులను అరెస్టు చేసిన సందర్భంగా హైదరాబాద్‌లో మకాం పెట్టిన విషయం బహిర్గతమైంది. రాష్ట్రంలో గత పన్నెండేళ్ల నుంచి ఉగ్రకార్యక్రమాలు పూర్తిగా అణచివేయడంలో పోలీసులు సత్ఫలితాలు సాధించారనే చెప్పాలి. గణతంత్ర వేడుకలను ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు లక్ష్యంగా చేసుకనే అవకాశం ఉందనే అనుమానంతో పర్యాటక ప్రాంతాలు, రద్దీ ప్రాంతాలపై పోలీసులు మరింత దృష్టిసారించారు. ప్రార్థనా మందిరాల వద్ద కూడా ముందు జాగ్రత్త చర్యగా డాగ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టారు. గతంలో ఉగ్రవాద భావజాలంపట్ల ఆకర్షితులైన యువకులపై కూడా పోలీసులు దృష్టిసారించారు. అధికారికంగా ప్రభుత్వం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఈ ప్రాంతంలో కూడా గట్టి నిఘా పెట్టారు. జనవరి 26న ఈ గ్రౌండ్‌లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ మెటల్ డిటెక్టర్‌తో పూర్తిగా తనిఖీ చేసిన తరువాతనే పంపిస్తామని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా గతంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెట్టుకున్న వారి జాబితాను పరిశీలిస్తున్నారు. పాతబస్తీలో కనిపించకుండా పోయి అజ్ఞాతంలో ఉన్న వారి పేర్లను సేకరిస్తున్నారు.

## 'జైబాపు-జై భీమ్-జైసంవిధాన్' సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అధ్యక్షుడిగా మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ బాధ్యతలు స్వీకరించి 100 సంవత్సరాలైన సందర్భంగా 'జైబాపుజై భీమ్ జైసంవిధాన్' సదస్సు ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే అధ్యక్షతన కర్ణాటక రాష్ట్రం బెలగావిలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. కాంగ్రెస్ చరిత్రే దేశ చరిత్ర అని, సమాజంలోని అన్ని వర్గాల వారికి ప్రాతినిథ్యం లభిస్తుందని గాంధీజీ అన్నారని వారు గుర్తుచేశారు. మహాత్మా గాంధీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ తర్వాతే మనకు రాజ్యాంగం వచ్చిందని, రాజ్యాంగం దేశ ప్రజలందరికీ పవిత్రమైనదన్నారు. మహాత్మా గాంధీ, బిఆర్.అంబేద్కర్‌ల కృషిని గుర్తుచేసుకోవడంతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్న సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులు అక్కడ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌ది పెద్ద అవినీతి చరిత్ర

కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్‌ది పెద్ద అవినీతి చరిత్ర, కుటుంబ పాలన అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ తన ఏడాది పాలనలో రుణమాఫీ, పేపర్ లీకేజీ లేకుండా ఉద్యోగాలు, రైతులు పండించిన సన్నాలకు రూ.500ల బోనస్ ఇలా అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు. అధికారంలోకి రాగానే మహిళాలకు ఉచిత రవాణ సదుపాయాన్ని కల్పించామని, విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులలో నైపుణ్యశిక్షణను పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీని తీసుకొచ్చామని, 300 ఫీట్ రేడియల్ రోడ్డు వేయబోతున్నామని, ప్రపంచంతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించామని వివరించారు.

## సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ పద్మారావుగౌడ్‌కు గుండెపోటు

డెహ్రాడూన్ పర్యటనలో ఉండగా తీవ్ర అస్వస్థత

వెంటనే స్టంట్ వేసిన వైద్యులు – ప్రాణాపాయం లేదని వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ, బిఆర్‌ఎస్ సీనియర్ నేత పద్మారావుగౌడ్‌కు గుండెపోటు వచ్చింది. ప్రస్తుతం తన కుటుంబంతో సహా ఆయన డెహ్రాడూన్ పర్యటనలో ఉన్నారు. ఈ సమయంలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గుండెపోటు వచ్చిందని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పద్మారావు గౌడ్‌ను పరీక్షించిన వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. తమ అభిమాన నేతకు గుండెపోటు వచ్చిందని తెలియడంతో పద్మారావుగౌడ్ అభిమానులు, బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనకు గురి అయ్యారు. పద్మారావుగౌడ్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో ఎంఎల్‌ఎ కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలిసిన బిఆర్‌ఎస్ నేతలు ఆయన ఇంటికి తరలి వెళ్లారు. పద్మారావు గౌడ్ హెల్త్ కండీషన్‌పై బిఆర్‌ఎస్ అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది.

# అగ్గలయ్యగుట్టపై 'గగ్గలయ్యగది' మిస్టరీ

కనుగొన్న డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి





**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ చెరువులలో భద్రకాళి చెరువు తలమానికం. అగ్గలయ్య గుట్ట, భద్రకాళిగుట్ట, భైరవగుట్ట, పద్మాక్షి గుట్టల నడుమ ప్రకృతి సౌందర్యంతో, చారిత్రక వైభవంతో అలరారుతున్నది. శిలాయుగం నాటి మానవులకు ఆశ్రయమిచ్చింది. రాష్ట్రకూట రాజులను, చాళుక్య ప్రభువులను ఆకర్షించింది. తొలి కాకతీయులకు రాజధానియై రాజ్యానికంతటికీ సాగునీరు, తాగునీరు అందించింది. భారతదేశంలో కేవలం ఈ ఒక్క చెరువుకే దారి తీసే స్వాగత తోరణాలు నిర్మించబడినాయని చరిత్ర పరిశోధకుడు, డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి చెబుతున్నారు. భద్రకాళి చెరువుకు ఆనుకొని ఉన్న పరిసరాలు గుట్టలపై వెలుగులోకి రాని చరిత్రను విశేషంగా పరిశోధిస్తూ పరిశోధకుడు ఎప్పటికప్పుడు విలువైన చరిత్రను వెలుగులోకి తెస్తున్నారు. ఈ క్రమంలో పరిశోధకుడు మరోసారి సందర్శించి అనేక నూతన చారిత్రక అంశాలను గుర్తించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు భద్రకాళి చెరువు మత్తడిపై హనుమద్గిరి తటాకాంజనేయ స్వామి దేవాలయం ఎదురుగా పక్కపక్కనే ఉన్న రెండు శిలల మధ్య నుండి చెరువు మత్తడివైపుకు వెళ్లే మార్గం ఉంది. ఈ రెండు ఎత్తైన శిలల శిఖరాగ్రంలో 10వ శతాబ్దం నాటి తూర్పు, ఉత్తర ముఖంగా చెక్కిన రెండు వినాయక శిల్పాలు ఉన్నాయి. అగ్గలయ్య గుట్ట భైరవగుట్ట మధ్యలో నుండి వెళ్లే దోవ చివరకు చెరువుకు ఆనుకొని శిథిల దేవాలయ ఆనవాళ్లు, పడి ఉన్న ఒక శివలింగం, ఆలయ స్థంబాలు ఉన్నాయి. చెరువు నిండితే నీటిలో మునిగే ఒక శిలకు ఒక వినాయక శిల్పం ఉంది. ఇక్కడే ఒక శిలకు సౌష్టవంగ,శిల్పకళతో ఉట్టిపడే కాకతీయుల నాటి భైరవ శిల్పం పూజలు అందుకుంటున్నది.

**రహస్య గగ్గలయ్య గది :**
చెరువుకు అభిముఖంగా సమీపంలో ఉన్న భైరవ శిల్పం మీదుగా ఇరవై అడుగుల ఎత్తులో ఒక నిర్మాణం ఉంది. సుమారుగా పది అడుగుల ఎత్తులో పది అడుగుల వెడల్పు, నలభై అడుగుల పొడవులో ఉన్న ఒక పడగ రాయి కింద, తొలిచిన భారీ శిలలతో ఒక శత్రుదుర్భేద్యమైన నిర్మాణం ఉంది. ఒక్కొక్క శిల కొన్ని టన్నుల బరువు ఉంటుంది. ఈ శిలలను కదిలించడం గానీ, నిలబెట్టడంగానీ అసామాన్య విషయం. ముఖద్వారంగా ఉన్న శిలలు పడిపోయాయి. లోపల ప్రస్తుతం రెండు గదులు కనిపిస్తున్నాయి. ఒక గది నుండి మరో గదిలోకి వెళ్ళడానికి, గది వెనుక వైపు వెళ్లడానికి రెండు అడుగుల వెడల్పు, మూడు అడుగుల ఎత్తులో మహా ఇరుకైన రాతి ద్వారాలు ఉన్నాయి. గది వెనుక ఒక రోలు ఉంది. రాతి గోడలకు ఒకప్పుడు వేసిన డంగు సున్నం పొర ఊడిపోయింది. లోపల ఎటువంటి విగ్రహాలు కానీ, దేవాలయ ఛాయలు కానీ లేవు. వెలుతురు వచ్చే మార్గం లేదు. ముందు గదిలో ఒక మూల దిగువన చిన్న రంధ్రం ఉంది. ఈ రంధ్రం వెలుపలి వైపు, గదిపై భాగంలో ఎరువు రంగుతో వేసిన అస్పష్టంగా ఉన్న ఒక చిత్రం ఉంది. స్థానికులైన వారిని అడిగితే దానిని గగ్గలయ్యగది అన్నారు. అగ్గలయ్యగుట్ట పై నుండి కిందకు దిగి,చెరువు అంచున ప్రమాదకర కొండ వాలు నుండి పాదాలు పట్టేంత సందుతో రెండు పక్కపక్కనే రెండు దారులు ఉన్నాయి . ఈ దారి ఇరుకైన శిలల మధ్య గుండా సాగి చెరువులోకి వెళుతుంది. ఈ తోవ సమీపంలోనే గగ్గలయ్యగది ఉన్నది. ఈ కారణంగా ఇది సైనిక స్థావరం లేదా ఆయుధ కర్మాగారం గాని అయి ఉండవచ్చు లేదా యుద్ధ ఖైదీలను బంధించి ఉండవచ్చును. ఈ గది కిందనే భైరవ శిల్పం ఉంది. ఈ గది ఇప్పటివరకు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉంది. దారి పొడవునా చిట్టడవి తుమ్మలు, ముళ్ళ పొదలతో నిండి ఉంది.

**పరిశోధిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం**
భైరవగుట్ట, అగ్గలయ్యగుట్టలను కలుపుతూ సుమారుగా 30 అడుగుల ఎత్తులో చెరువుకట్ట ఉంది. కట్ట చివరలో భైరవగుట్టకు ఆనుకొని ఎత్తు తక్కువగా ఉన్న పడగ రాయి కింద ఇటుకలతో నిర్మించిన మరొక గది ఉంది. ఈ గదిలో సన్యాసులు ఆవాసంగా చేసుకుని ఉండవచ్చునని తెలిపారు. కట్ట దిగువన అడుగు భాగంలో నిరంతరంగా భద్రకాళి చెరువు నుండి బయటకు వచ్చే భూగర్భ జల రవాణా జరగడానికి రాతి నిర్మాణం ఉంది. ఈ నిర్మాణాన్ని మరమ్మతు చేయవలసి ఉంది. ఇక్కడే చెరువు కట్ట తెగిపోకుండా ఉండడానికి, కట్ట దిగువన నీటి ఒత్తిడిని తగ్గించడానికి పొడవైన తొలిచిన శిలలను వరుసగా పాతి పెట్టారు. పురావస్తు శాఖ బృందం పరిశోధిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని పరిశోధకుడు తెలిపారు. భద్రకాళి చెరువు దేవాలయం నుండి పడవ మార్గాన్ని ఏర్పాటు చేసి వరుసగా హనుమద్‌గిరి వెనుక ఉన్న రాష్ట్రకూటుల నాటి శిల్ప సంపద, ఐలాండ్‌గుట్ట, గగ్గలయ్యగది, భైరవ శిల్పంను చూసుకొని భైరవగుట్ట దిగువన ఉన్న సిద్ధేశ్వర ఆలయానికి చేరుకునేలా పర్యాటక శాఖ అభివృద్ధి చేయవలసి ఉంది.

## 'భూ భారతి చట్టం-2025' అమలుపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ''తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం 2025''అమలుపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. ఎటువంటి లోపాలు, కొత్త సమస్యలకు అవకాశం ఇవ్వకుండా ఉండేలా అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. వీటి అమలు విషయంలో ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశాలపై ఉన్నతాధికారులకు స్పష్టత ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే 'ఎనర్జీ పాలసీ, భూ భారతి చట్టాల'పైన ఉన్నతాధికారులతో హైదరాబాద్, సచివాలయంలో మంగళవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పలు శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచిఘోష్, పలు శాఖల ముఖ్య కార్యదర్శులు నవీన్‌మిట్టల్, సందీప్‌కుమార్ సుల్తానియా, దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేష్ కుమార్, యోగితారాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్ తదితరులు హాజరయ్యారు. 'తెలంగాణ భూభారతి చట్టం'పైన రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించి, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని ఆయన వివరించారు. సమర్థవంతమైన వ్యవసాయ భూపరిపాలన విధానాన్ని భూభారతి చట్టం ప్రోత్సహిస్తుందన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా భూభారతిని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చామని, ప్రజల నుండి స్వీకరించిన సూచనల మేరకు ఈ చట్టాన్ని రూపొందించామని నవీన్‌మిట్టల్ వివరించారు. 'యూజర్ ఫ్రెండ్లీ' పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందించినట్టు నవీన్ మిట్టల్ వివరించారు.

అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025' ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు. సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందిస్తున్నామని వివరించారు. తద్వారా వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయమైన, సరసమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడమే ఈ విధానం లక్ష్యమని సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము
**రహదారులు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIT No. 29//EE/PAtoEE/D2/SBD/2024-25/12/ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 18.01.2025

**పని పేరు: 1.** రంగారెడ్డి జిల్లా, ఎల్‌బినగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ ప్రధాన ప్రవేశ గేటు వెడల్పు చేయడం. **అంచనా విలువ:** రూ.3,86,098.00, **ఇఎండి:** రూ.3,861.00, **2.** గౌరవ శ్రీ జస్టిస్ నగేష్ భీమపాకంకు ఆనుకొని ఉన్న హైదరాబాద్, జూబ్లీహిల్స్, న్యాయవిహార్ కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న సర్వెంట్ క్వార్టర్‌లో తగిన పౌర మరియు పారిశుద్ధ్య మరమ్మతు పనులు (టర్న్‌కీ) 5వ పిలుపు. **అంచనా విలువ:** రూ.62907.00, **ఇఎండి:** రూ.629.00, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 18.01.2025న సా.06.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 23.01.2025న మ.2.00గం.ల వరకు, **బిడ్ ప్రారంభ తేది మరియు సమయం:** 23.01.2025న మ.02.15 గం.ల నుండి, **ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) పేరు మరియు చిరునామా:** శ్రీ ఎ.వి. విశ్వకుమార్ బిటెక్, ఐ/సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.eprocurement.gov.in తెలంగాణలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 9392-PP/CL/ADVT/1/2024-25, Date: 21-01-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 29/EE-30/SDZ/GHMC/2024-25, తేది: 21.01.2025 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రచురించబడినది. వివరాలను @ https://tender.eprocurement.gov.in లాగిన్ చేయడం ద్వారా చూడవచ్చు. ఈవెంట్ల తేదీ క్రింద వివరించబడింది:

| NIT.No. | పని పేరు | అంచనా విలువ లక్షలలో | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
| --- | --- | --- | --- | --- |
| NIT No. 29/EE-30/SDZ/GHMC /2024-25, తేది: 21.01.2025 | 1. SWG పైప్‌లైన్ వేయడం మరియు నిర్వహణ/ మరమ్మతులు-1 పని, 2.VDCC రోడ్ - 2 పనులు, 3. ప్రహరీ గోడ మరమ్మతులు - 1 పని, 4. RCC డ్రెయిన్ నిర్మాణం - 1 పని, 5. ప్రస్తుతమున్న శిథిలమైన మూత్రశాలలను కూల్చివేయుట మరియు కొత్త మూత్రశాలలను నిర్మించడం -1 పని, 6. సంపుల నిర్మాణం, నీరు తోడేందుకు స్థిరమైన పంపుసెట్ల బిగింపు - 1 పని, 7. స్టోర్ రూమ్ నిర్మాణం - 1 పని, 8. ఇండోర్ జిమ్ పరికరాలు - 1 పని. | 131.10 | 24.01.2025 12.00 PM / 01.02.2025 12.00 PM | ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్: 7331181426 / 9849906750 |

సంప్రదించవలసిన అధికారి చిరునామా శ్రీ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.

DIPR R.O. No. : 9438-PP/CL/ADVT/1/2024-25, Date: 21-01-2025

ప్రజాపక్షం
బుధవారం, జనవరి 22

# స్వర్ణయుగమా? దుర్దశనా??

అమెరికా సంయుక్త రాష్ట్రాల 47వ అధ్యక్షునిగా రిపబ్లికన్ డోనాల్డ్ ట్రంప్ సోమవారం పదవీ ప్రమాణం చేసిన తదుపరి ప్రసంగంలో ''ఈ క్షణంలోనే అమెరికాలో స్వర్ణయుగం'' ప్రారంభమైందంటూ ఈ రోజును ''విముక్తి దినం''గా ప్రకటించారు. అటువంటి సాహసం ఆయనకే చెల్లు. అధికారం చేబట్టిన తొలిరోజు సంతకం చేయటానికి సిద్ధం చేసిన 100 ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల్లో ''అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తా'' అనే తమ ఆలోచనకు అనుగుణమైన ఆదేశాలతోపాటు ప్రపంచాన్ని ప్రమాదపు అంచుకు తీసుకెళ్లేవి కూడా ఉన్నాయి. అమెరికాలో నేరాలను అరికట్టటం, అమెరికాలోకి నేరస్థుల ప్రవేశానికి అడ్డుకట్టవేయటం, చట్టబద్ధమైన వలసలను మాత్రమే అనుమతించి, అక్రమంగా దేశంలో నివసిస్తున్న పదుల లక్షలమంది వలసదారులను గుర్తించి వారి స్వదేశాలకు తిరిగి పంపటం, సరిహద్దుల భద్రతను పటిష్టపరుస్తూ దక్షిణ సరిహద్దు (మెక్సికో) వద్ద జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించి అక్కడ సైన్యం పహారాను పెంపు చేయటం, దేశంలో క్రూడ్ ఆయిలు ఉత్పత్తిని గణనీయంగా పెంచటం (డ్రిల్ బేబీ డ్రిల్), శాంతి భద్రతలను పటిష్టవంతం చేయటం, ద్రవ్యోల్బణం అరికట్టటం, ధరలు తగ్గించటం, అమెరికాను వస్తూత్పత్తి కేంద్రంగా రూపొందించటంలో మాన్యుఫాక్చరింగ్ రంగం దోపిడీని నియంత్రించటం, ఆటో మొబైల్ లేదా ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలును ఎంచుకునే స్వేచ్ఛను ప్రజలకివ్వటం వగైరా అమెరికాను మెరుగైన సమాజంగా తీర్చిదిద్దటానికి ఉద్దేశించినవి. ప్రజలకు సంపదను, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను తమ 2.0 ప్రభుత్వం ప్రసాదిస్తుందనటం అనుమానంతో చూడాల్సిన అంశాలు. అమెరికన్‌ల ఆదాయాలు పెంపుదల ట్రంప్ ఎజండాలో భాగం కనుక సామాన్య ప్రజల సంగతెలా ఉన్నా సంపన్నుల, కుబేరుల ఆదాయాల పెంపుదల మాత్రం ఖాయం.

> పారిస్ ఒప్పందం, డబ్ల్యుహెచ్‌ఒల నుండి అమెరికా నిష్క్రమణ నిర్ణయాలు రెండూ – ట్రంప్ 'స్వర్ణయుగానికి' భాష్యం చెబుతున్నాయి. క్యూబాపై మళ్లీ టెర్రరిస్టు ముద్ర ట్రంప్ 'స్వేచ్ఛ'ను పరిహసిస్తున్నది.

అమెరికా వరుస తుపానులకు గురైందనే బాధ వ్యక్తం చేస్తూనే, భూగోళ ఉష్ణాన్ని అదుపులో ఉంచే, పర్యావరణను పరిరక్షించేందుకు ప్రపంచ దేశాల సమష్టి కృషికి వేదికగా ఉన్న పారిస్ ఒప్పందం నుండి అమెరికా వైదొలుగుతున్నట్లు ప్రకటించటం అత్యంత నిర్లక్ష్యపూరిత, అమానవీయ నిర్ణయం. వాతావరణంలో మార్పులతో ఇప్పటికే భూగోళంపై కరువులు, అకాల వర్షాలు, కుండపోత వర్షాలు, వరదలతో ప్రజలు అల్లల్లాడుతున్నారు. ఇందుకు అమెరికా మినహాయింపు కాదు. ట్రంప్ తొలి పదవీకాలంలోనే ఆ ఒడంబడికను తిరస్కరించాడు. తర్వాత జో బైడన్ ప్రభుత్వం భాగస్వామి అయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నుంచి అమెరికా వైదొలుగుతున్న ప్రకటన కూడా బాధ్యతారహితమైంది. ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్–19 మహమ్మారి ఆరంభకాలంలోనే ట్రంప్ దాన్ని సామాన్య అంటువ్యాధిగా భావించి వైద్యసేవలను నిర్లక్ష్యం చేయటంతో అమెరికాలో అనేక లక్షలమంది ఆ వ్యాధితో మృత్యువాతపడ్డారు. పారిస్ ఒప్పందం, డబ్ల్యుహెచ్‌ఒల నుండి అమెరికా నిష్క్రమణ నిర్ణయాలు రెండూ – ట్రంప్ 'స్వర్ణయుగానికి' భాష్యం చెబుతున్నాయి. క్యూబాపై మళ్లీ టెర్రరిస్టు ముద్ర ట్రంప్ 'స్వేచ్ఛ'ను పరిహసిస్తున్నది.

పనామా కాల్వ యాజమాన్యం స్వాధీనం, కెనడాను 51వ రాష్ట్రంగా అమెరికాలో కలిపివేసుకోవటం, గ్రీన్‌లాండ్‌పై కన్ను వంటివి ట్రంప్ విస్తరణ కాంక్షలో భాగాలు. ఆర్థికరంగంలో నయా ఉదారవాదం, సరళీకరణ విధానాలను ప్రపంచంపై విధించిన అమెరికా, ఇప్పుడు తమ పరిశ్రమలు, ఉత్పత్తులు, మార్కెట్‌ను కాపాడుకునే ఆత్మరక్షణవాదం (ప్రొటెక్షనిజం)లో పడటం నేటి ప్రపంచ మార్కెట్ వ్యవస్థలో దాని బలహీనతకు నిదర్శనం. తమపై ఆర్థికభారం తగ్గించుకునేందుకై నాటో దేశాలు తమ రక్షణ బడ్జెట్‌లను పెంచాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. చైనాను వాణిజ్యంలో ప్రథమ శత్రువుగా పరిగణిస్తున్నారు. ట్రంప్ గొప్పలకు పోతున్నట్లు కొన్ని యుద్ధాలు ముగించవచ్చు – కాని మరెన్నో ఉద్రిక్తతలకు, ఆయుధాల నవీకరణకు కారణమవుతాడు. లేకుంటే అత్యంత శక్తివంతమైన మిలటరీ – ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ అధ్యక్షునికి చుక్కలు చూపుతుంది. ట్రంప్ అధ్యక్షకాలం ప్రపంచంలోని మితవాద శక్తులకు ప్రోత్సాహకారి. అందులో మన దేశ పాలకులు మరీ మురిసిపోతున్నారు.

# ఢిల్లీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం



సురవరం సుధాకర రెడ్డి
సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి

ఢిల్లీ ఎన్నికలు మరొక రెండు వారాలలో జరుగనున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలు, దాడులు ప్రారంభమయ్యాయి. బిజెపికి నరేంద్రమోదీకి ఇది ప్రతిష్ట సమస్య. ఆమ్ ఆద్మీ పార్టీకి, అరవింద్ కేజ్రీవాల్‌కు రాజకీయంగా జీవన్మరణ సమస్య. కాంగ్రెస్‌కు ఉనికి సమస్య. బహుశా ప్రధాన పోటీ బిజెపిఆమ్ ఆద్మీ పార్టీల మధ్య జరగవచ్చు. కాంగ్రెస్ మూడ వ స్థానంలో వుండవచ్చు. కానీ ఆ పార్టీ చీల్చే ఓట్లను బట్టి ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపోటములు నిర్ణయించబడుతాయి. అసాధారణంగా ఉచితాలను మూడు పార్టీలు ఓటర్ల మీద గుమ్మరిస్తున్నాయి. ఇవి ఉచితాలా? సంక్షేమ కార్యక్రమాలా? ప్రజలే నిర్ణయించుకోవాలి. ఉచితాల మీద మండిపడ్డ మోదీ, ఈ మధ్య ఉచితాలతో ఇతర పార్టీల తో పోటీ పడుతున్నాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఆదాయం బాగానే ఉంటుంది. ఉచితాలకు నిధులు సమకూరవచ్చు.

కానీ కాలుష్యం నుండి ఢిల్లీని రక్షిస్తామని ఏ పార్టీ వాగ్దానం చేయడం లేదు. ఢిల్లీకి స్వంత వాతావరణం లేదు. పంజాబ్, హర్యానాలతో పంటల కోత తర్వాత చెత్తను తగలబెడ్తే ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుంది. లక్షల వాహనాలతో కాలుష్యం పెరుగుతుంది. ఉత్తర ప్రదేశ్‌లో గాలి ధూళి, రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్లు ఢిల్లీ మీద ప్రభావం చూపుతాయి.

ఢిల్లీ ఎన్నికలలో ఆప్ కాంగ్రెస్‌ల మధ్య ఎన్నికల ఒప్పందం కుదరకుండా పోవటానికి కారణం కాంగ్రెస్. హర్యానా శాసనసభ ఎన్నికలలో ఆప్‌తో ఎన్నికల అవగాహనకు నిరాకరించడం ద్వారా కాంగ్రెస్ ఈ పరిస్థితిని చేజేతులా తెచ్చుకుంది.

రాహుల్‌గాంధీ అవగాహన చేసుకోమని చెప్పినప్పటికీ, హరియానా కాంగ్రెస్ జాట్ నాయకుడు చెడగొట్టాడు. ఆప్ 10 సీట్లు అడిగింది. కాంగ్రెస్ ఐదు సీట్లిస్తానంది. కాంగ్రెస్‌ను ముఖ్యమైన నియోజకవర్గాలను అడిగిందనే సాకుతో ఒప్పందం కుదరలేదు. కాంగ్రెస్ అవమానకరమైన ఓటమి పొందింది.

మహారాష్ట్ర ఎన్నికలలో ఎన్‌సిపి, శివసేనలను ఒత్తిడి చేసి కాంగ్రెస్ ఎక్కువ సీట్లు తీసుకుంది. కూటమి పార్లమెంట్ ఎన్నికలలో మెజారిటీ సంపాదించినా, శాసనసభ ఎన్నికలలో తీవ్రంగా దెబ్బతిన్నది. హర్యానా, మహారాష్ట్రలలో ఓటమి తర్వాత విభిన్న కారణాలతో అసంతృప్తిగా వున్న ఇండియా కూటమి పగుళ్ళిచ్చింది. నాయకత్వం తనకే దక్కాలనుకునే మమతా బెనర్జీ, ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ వరుస ఓటములతో అసంతృప్తి చెందిన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్, కశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లాలతో పాటు ఎన్‌సిపి నాయకుడు శరద్‌పవార్, శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే కూడా దూరమౌతున్న సూచనలు పంపించారు. డి.ఎం.కె., జార్ఖండ్ ముక్తి మోర్చా, వామపక్షాలు మాత్రం ప్రస్తుతానికి ఏమి మాట్లాడలేదు. ఇండియా కూటమి విచ్ఛినమైతే దేశం బిజెపి మోదీ నియంతృత్వ పాలనను, మరింత తీవ్రమైన నిరంకుశ, రాజ్యాంగ విరుద్ధ పాలనను ఎదుర్కోవలసి వస్తుంది. ఇదొక విషాదకర రాజకీయ పరిణామం. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను మినహాయించిన ప్రతిపక్షాల కూటమి సాధ్యం కాదు. ఇతరుల నాయకత్వాన్ని కాంగ్రెస్ అంగీకరించదు.

దళిత నాయకుడు మల్లిఖార్జున ఖర్గే ఒక ముఖోటా అని, రాహుల్ గాంధీ నిజమైన నాయకుడని బిజెపి ఆరోపిస్తున్నది. రాహుల్ గాంధీ ప్రజలను ఆకర్షించే ప్రచార నాయకుడే గాని, కాంగ్రెస్ పార్టీ నిర్మాణంపై ఆయనకు పట్టులేదు. మధ్యప్రదేశ్‌లో రాహుల్ ప్రతిపాదించిన జ్యోతిరాదిత్య సింధియాను పిసిసి అధ్యక్షుడిగా చేసేందుకు కమలనాథ్ అంగీకరించ లేదు. జ్యోతిరాదిత్య పార్టీ ఫిరాయించడం తో, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చేజారింది. రాజస్థాన్‌లో సచిన్‌పైలట్ తిరుగుబాటును అణిచివేసినా, కాంగ్రెస్ బలహీనపడింది. రాహుల్ సచిన్‌కు మద్దతిస్తున్న విషయం తెలిసిందే. చిన్న రాష్ట్రం హరియానాలో కూడా రాహుల్ మాట చెల్లలేదు. రాహుల్ కాంగ్రెస్‌లో మరొక ముఖోటా.





దేశంలో హిందుత్వ శక్తులు మరింత పేట్రేగిపోతున్నాయి. ప్రతి మసీదు క్రింద దేవాలయాలను వెతకవద్దని తన సంఘీయులకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సలహా ఇచ్చినా, మతోన్మాద భూతాన్ని సీసాలోంచి బయటకు తీసిన తర్వాత దానిని మళ్లీ సీసాలో బంధించడం సాధ్యం కాదు. మోదీ కొంతమేరకు స్వతంత్రుడైనట్లు కనపడుతుంది. కంగనా రనౌత్ దేశానికి స్వాతంత్ర్యం 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే వచ్చిందని ప్రకటిస్తే, మోహన్ భాగవత్ అయోధ్యలో రామ మందిరం కట్టిన తర్వాతే వచ్చిందని మరొక వింత ప్రకటన చేసాడు. రాబోయే రోజులు గడ్డు రోజులు కావచ్చు. కాంగ్రెస్ వైట్ టీ షర్టుల ఉద్యమం వల్ల ఒరిగేదేమీ లేదు. నిరుద్యోగం మీద, ధరల పెరుగుదల మీద, కార్పోరేట్ల దోపిడి మీద పోరాటాలలో ప్రజలను సమీకరించ గలిగితే మళ్ళీ ప్రజల విశ్వాసాన్ని పొంది, ఇండియా కూటమిని పునర్ నిర్మించవచ్చు. బిజెపిని సమర్థవంతంగా ఎదిరించవచ్చు.

# మానవాళికి వ్యతిరేకంగా ట్రంప్ నిరంకుశ నిర్ణయం



డాక్టర్ సోమ మర్ల
రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఐసిఎఆర్, న్యూఢిల్లీ

ప్రమాణ స్వీకారం పూర్తయిన వెన్వెంటనే ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగే ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ నిర్ణయాన్ని వివరిస్తూ ఐక్యరాజ్యసమితికి వెంటనే లేఖ కూడా పంపించారు.

ఇది అత్యంత దురదృష్టకర నిర్ణయం. ప్రత్యేకించి భూతాప హెచ్చరిక పరిమితి 1.5డిగ్రీలను తొలిసారిగా దాటిన 2024లోనే ఇది జరిగింది. భూమండలం మీద జీవుల ఉనికికనే సవాలు చేస్తున్న భూతాపాన్ని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నిరోధించేందుకు తీసుకుంటున్న అన్ని రకాల చర్యలపై తాజా నిర్ణయం ప్రభావం చూపుతుంది.

భూగోళ ఉష్ణోగ్రతలు పారిశ్రామిక పూర్వ స్థాయికి మించి 2024లో తొలిసారిగా ఒక క్యాలెండర్ సంవత్సరంలో 1.5 సెంటిగ్రేడ్లు దాటింది. భూతాపం, పర్యవసానంగా మునుపెన్నడూ లేని రీతిలో భారతదేశం, ఐరోపాలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరగడం, కాలిఫోర్నియాలో కాణాగ్ని, చిన్న చిన్న దీవుల ముంపు సర్వసాధారణంగా మారాయి.

భూతాప కారకాలను పరిమితం చేసేందుకు అంతర్జాతీయ సహకారాన్ని ఉద్దేశించి 2015లో ప్యారిస్ అగ్రిమెంట్ జరిగింది. యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్(యుఎన్‌ఎఫ్‌సిసి)ని ఇది బలోపేతం చేస్తుంది. నాటు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న అమెరికాదేశం సహా 195దేశాలు దీనిని అంగీకరించాయి. శిలాజ ఇంధనాల వినియోగమే వాతావరణ మార్పునకు కారణమని ప్రతి ఒక్కరూ ప్రాథమికంగా అంగీకరిస్తారు. గడిచిన వందేళ్ళలో పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిదారులు శిలాజ ఇంధనాలను వినియోగిస్తున్నారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలులోకి వచ్చిన 2016 తరువాత ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనం ద్వారా 72 శాతం బొగ్గుపులుసు కాలుష్యానికిసుమారు 57 చమురు, సహజవాయువు, బొగ్గు, సిమెంట్ ఉత్పత్తిదారులే ప్రత్యక్ష కారణమని కార్బన్ మేజర్ డాటాబేస్ (2024) తెలిపింది. శిలాజ ఇంధనాలను థర్మల్ విద్యుత్ కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, ఉక్కు, ఎరువులు, సిమెంట్ పరిశ్రమలు, వ్యవసాయ, మిలిటరీ వ్యవస్థలు వినియోగిస్తున్నాయి. శక్తివంతమైన పశ్చిమ దేశాలు, పెద్ద పెట్టుబడిదారులు హానికరమైన హైడ్రో కార్బన్‌ల వినియోగించటాన్ని నిర్మూలించకుండా, ప్రెసిడెంట్ ట్రంప్ మాదిరిగా వాతావరణ మార్పును తిరస్కరిస్తూ, వాతావరణ మార్పునకు శిలాజ ఇంధనాలు కారణం కాదని వాదిస్తాయి. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం భూతాపాన్ని , వాతావరణ మార్పును తిరస్కరిస్తుంటారు. ట్రంప్ తమ అధ్యక్ష పదవి తొలి టరంలో ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుండి వైదొలిగారు. పైగా భారీ ఆయిల్ డ్రిల్లింగ్, ఫ్రేకింగ్ (గట్టి రాళ్ళను, పర్వతాలను బద్ధలుకొట్టి చమురు, సహజవాయువును తీసే ప్రక్రియ), అమెరికా అంతటా కొత్త చమురు పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహిస్తున్నారు. మరోసారి తన పాత చర్యలను పునరుద్ఘాటిస్తున్నారు.

ప్రపంచ జనాభాలో నాలుగు శాతమే ఉన్న అమెరికా ప్రపంచంలో విడుదలయ్యే హరిత గృహ వాయువులో బొగ్గుపులుసు 16 శాతం విడుదలకు కారణమవుతుంది. భూతాపానికి అత్యధిక కారణమవుతున్న దేశాలలో ఒకటిగా నిలిచింది.

తాజాగా సోమవారం సాయంత్రం జాతీయ ఇంధన అత్యయిక స్థితిని ప్రకటిస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై ట్రంప్ సంతకం చేశారు. తద్వారా పైప్‌లైన్‌లు సహా ఇంధన ప్రాజెక్టులు, విద్యుత్ ప్లాంట్‌లు, అలస్కా సహా ఇతర ప్రాంతాలలో చమురు డ్రిల్లింగ్‌కు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు మరోసారి పగ్గాలు చేపట్టిన అధ్యక్షుడికి అవకాశం కల్పిస్తుంది. చమురు నిక్షేపాలు కలిగిన అమెరికా రాష్ట్రాలలో చమురు డ్రిలింగ్‌ను నిషేధిస్తూ మాజీ అధ్యక్షుడు బైడెన్ ఇటీవల ఇచ్చిన ఆదేశం తిరిగి మొదటికే వచ్చి ఆగింది.

అయితే, శిలాజ ఇంధనాల అతి పెద్ద ఉత్పత్తిదారు అమెరికానే. ఇప్పటికే అక్కడ గతంలో లేనంతగా చమురు పారుతుంది. 2016 నుంచి అమెరికన్ చమురు ఉత్పత్తి 70 శాతం పెరిగి, ప్రపంచంలోనే అమెరికాను భారీ ఉత్పిత్తిదారు, ఎగుమతిదారుగా నిలిపింది.

అదే విధంగా 2016లో దాదాపు ఉత్పత్తి జరగని స్థాయి నుంచి ద్రవరూప సహజ వాయువు(ఎల్‌ఎన్‌జి) ఎగుమతులలో కూడా అమెరికా అంతర్జాతీయ అగ్రగామిని మారింది. రష్యా–ఉక్రేన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై ఇంధన ఆంక్షల ఫలితంగా అమెరికా భారీ ఎత్తున ద్రవ రూప సహజ వాయువును ఐరోపాకు సరఫరా చేస్తోంది. గతంలో రష్యా నుంచి కొనుగోలు చేసిన ధరలతో పోల్చినప్పుడు ఐరోపా దేశాలు బలవంతంగా అమెరికా నుంచి అత్యధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది.

పరిశుద్ధ ఇంధనం కోసం బిలియన్‌లు ఖర్చు చేసేందుకు ఉద్దేశిం చి గత అధ్యక్షుడు బైడెన్ సంతకం చేసిన 'గ్రీన్ న్యూ డీల్'కు కూడా ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టంలో భాగంగా అధ్యక్షుడు ముగింపు పలుకుతారని పరిపాలనా వర్గాలు చెబుతున్నాయి.

**అనంతర పరిణామాలు**

ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడం వాతావరణ మార్పులో భాగంగా ఉద్గారాల విడుదలపై పరిమితి విధింపుపై అంతర్జాతీయ ప్రయత్నాలకు మరింత విఘాతం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగడానికి దారి తీయడమే కాకుండా, అభివృద్ధి చెందుతున్న దుర్బల దేశాలకు సహాయం చేసేందుకు ఉద్దేశించిన హరిత వాతావరణ నిధిపై ప్రభావం చూపుతుంది. ఈ నిధికి ప్రస్తుతం అమెరికా 3 బిలియన్ డాలర్ల సహాయం అందిస్తుంది. తాజా నిర్ణయంతో వాతావరణ మార్పు పరిశోధన ప్రాజెక్టులకు నిధులు తగ్గిపోతాయి. ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలగడమంటే అది మానవాళికి వ్యతిరేకమైన నిరంకుశ నిర్ణయం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రపంచాన్ని చరమాంకానికి తీసుకుపోయి, భవిష్యత్తులో భూగోళంపై జీవరాశుల మనుగడకు ముగింపు పలుకుతాయి. అంతే కాకుండా హరిత ఉద్గారాల విడుదల తగ్గింపునకు చేసుకున్న ప్యారిస్ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాలన్నీ మానవాళికి వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న ఏకపక్ష చర్యను వ్యతిరేకించేందుకు, భూమండలాన్ని కాపాడే వాతావరణ చర్యలను కొనసాగించేందుకు ఒక్కటిగా ముందుకు రావాలి.

# మద్దతుధరల చట్టబద్ధతపై మోదీ దిగివచ్చేనా!



ఎం. కోటేశ్వరరావు

నవంబరు 26వ తేదీ నుంచి రైతు ల సమస్యలపై నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా రాజకీయ రహిత సంస్థ కన్వీనర్ జగత్‌సింగ్ దల్లేవాల్ జనవరి 18వ తేదీ అర్ధరాత్రి వైద్య చికిత్సకు అంగీకరించారు, ఆ మేరకు ప్రభుత్వ వైద్యులు తగిన చర్యలను ప్రారంభించారు. ఫిబ్రవరి 14వ తేదీ న చండీఘర్‌లో రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించిన తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయ రహిత), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులతో కేంద్ర అధికారులు చర్చలు జరిపా రు. ఏడు పదుల వయస్సున్న దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తున్న పూర్వరంగంలో ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు పోవాలని చర్చలు జరపటం, బిజెపికి కీలకమైన ఢిల్లీ ఎన్నికలు, దల్లేవాల్‌కు మద్దతుగా మరో 121 మంది నిరవధిక దీక్షలకు పూనుకోవటం, కేంద్ర ప్రభుత్వంపై రోజురోజుకూ వత్తిడి పెరుగుతున్న తరుణంలో కేంద్రం ఈ మేరకు దిగివచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ రైతుల గురించి మాట్లాడరు, రైతు ప్రతినిధుల తో మాట్లాడేందుకు సమయం లేదంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. కోట్లాది మంది రైతుల గురించి చర్చించేందుకు సమయం లేదనటాన్ని బట్టి ఎవరి ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టం అయింది. బడ్జెట్‌పై చర్చలంటూ రైతు ప్రతినిధులను మినహా మిగిలిన వారందరినీ కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించి చర్చలను జరిపింది. వీటన్నింటినీ చూసినపుడు వచ్చే నెలలో జరిగే చర్చల్లో ఒరిగేదేమిటి అన్నది పెద్ద ప్రశ్న. ఈనెల 31న పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇతర సమస్యలతో పాటు రైతుల గురించి ప్రతిపక్షాలు నిలదీసే అవకాశం ఉంది. కనీస మద్దతు ధరలకు చట్టబద్దత, గతంలో రైతు ఉద్యమం సందర్భంగా మరణించిన వారికి పరిహారం, లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు న్యాయం, 2013 భూసేకరణ పరిహార చట్ట పునరుద్దరణ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్, రైతుల రుణమాఫీ వంటి అంశాలపై రైతులు ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే.

కనీస మద్దతు ధరలకు చట్టబద్దత, ఇతర అంశాల గురించి పరిశీలించేందుకు 2022 జులైలో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇంతవరకు అది ఏమి చేసిందో ఎవరికీ తెలియదు, వారు నివేదిక సమర్పించరు, ప్రభుత్వమూ అడగదు, అంతా ఒక నాటకం గా మారింది. ఈ లోగా 2021లో క్షమాపణలు చెప్పి మరీ వెనక్కు తీసుకున్న మూడు సాగు చట్టాలను మరో రూపంలో ముందుకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోంది. దేశంలో భూ కమతాలు పద్నాలుగు కోట్లకు పైగా ఉన్నాయి. వాటిలో 88శాతం రెండున్నర ఎకరాల లోపు కలిగిన రైతులే ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదంటూ వారందరినీ కార్పొరేట్లకు అప్పగించి తన బాధ్యతను వదిలించుకొనేందుకు కేంద్రం చూస్తున్నది. ఒకసారి అది జరిగితే రాష్ట్రాలు కూడా అదేబాట పడతాయి. పరిశ్రమలు, వాణిజ్యాలకు అనేక రక్షణలు, రాయితీలు ఉన్నాయి. వాటి మాదిరిగానే తమకూ కల్పించాలని రైతులు కోరటం గొంతెమ్మ కోర్కె కాదు. కనీస మద్దతు ధరను ఒక్క హక్కుగా చట్టబద్దం చేయాలని కోరుతున్నారు.

పారిశ్రామిక ఉత్పత్తులకు, ఎగుమతులకు, దిగుమతులకూ రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం రైతులను ఎందుకు విస్మరిస్తున్నది, పోనీ వ్యవసాయం ఉపాధి కల్పించటం లేదా పరిశ్రమలు, సేవా రంగాల కంటే ఎక్కువ 44శాతం మందికి కల్పిస్తున్నది. సంఘటితంగా పోరాడే స్థితిలో వారు లేకపోవటం తప్ప మరొకటి కనిపించటం లేదు. మనకు అవసరమైన వంట నూనెల్లో 60శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం, దానికి ఎన్నో రాయితీలు ఇస్తున్నది ప్రభుత్వం కానీ ఇక్కడ నూనె గింజలు పండించేవారికి ధరల గురించి ఒక హామీ ఇవ్వటానికి ముందుకు రావటం లేదు. మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలివేస్తున్నది. గతేడాది సోయా, ఆవ రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువే పొందారు.

మరోవైపున బియ్యం, గోధుమలు, ఉల్లి, పంచదార వంటి వాటి ఎగుమతుల మీద నిషేధం పెట్టి మార్కెట్‌లో రైతులకు అన్యాయం చేశారు. వినియోగదారులకు మేలు చేయటం అంటే రైతుల నోట్లో మట్టికొట్టటం కాదు కదా! ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే తక్కువకు రైతుల నుంచి చెరకును మిల్లులు కొనుగోలు చేయకూడదు(అది గిట్టుబాటు కావటం లేదు). అదే మాదిరి ఇతర పంటలకు ప్రభుత్వం ఎందుకు హామీ ఇవ్వటానికి నిరాకరిస్తున్నది ? కనీస వేతన చట్టాన్ని అమలు జరపకపోతే కార్మికులు కోర్టులకు ఎక్కే హక్కు ఉంది, కానీ రైతులకు కనీస మద్దతు ధరలకు అలాంటి అవకాశం లేదు. దాదాపు పదిహేను కోట్ల మంది రైతులు ఉండగా వారిలో తొమ్మిది కోట్ల మందికి ఏటా ఆరు వేల రూపాయలు ఇచ్చి అదే మహాభాగ్యం అని చెబుతున్నది.

రద్దు చేసిన మూడు సాగు చట్టాలను మూడు సంవత్సరాల తరువాత కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన మరో రూపంలో ముందుకు తీసుకురావటం ఆందోళన కలిగించే అంశం. నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పాలసీ(నాంప్)ని 2024 నవంబరు 25న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) ఆధ్వర్యాన డిసెంబరు 23న దేశమంతటా నిరసన తెలిపారు. నాంప్‌ను అనేక మంది నిపుణులు విమర్శించారు. దాని మీద అభిప్రాయాలు తెలిపేందుకు కేవలం పదిహేను రోజులు మాత్రమే కేంద్రం గడువు ఇచ్చింది. ఇప్పుడున్న మార్కెటింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని కాదు, దాన్ని సంస్కరించకూడదని ఎవరూ చెప్పటం లేదు. అయితే ఆ పేరుతో ఇప్పుడున్న దానికంటే ప్రమాదకరమైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయద్రవ్య పెట్టుబడి సంస్థలు సూచించిన పద్ధతిలో సమూల మార్పులు ప్రతిపాదించటం ఆందోళనకరం. దాని ప్రకారం దేశమంతటిని అనుసంధానించే ఒకే మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారు. ఇదంతా చిన్న రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాల కంటే కార్పొరేట్లకే ప్రాధాన్యత ఇచ్చే వ్యవహారం. రైతులు ముడి సరకును సరఫరా చేసేవారిగా మాత్రమే ఉంటారు. వాటి నుంచి ఉత్పత్తు లు తయారు చేయటం, వాణిజ్యం, ఎగుమతి అంతా కార్పొరేట్లదే. ఈ క్రమంలో తేలే మిగులులో రైతుల వాటా గురించి ఎక్కడా స్పష్టత లేదు. అంతే కాదు కనీస మద్దతు ధరలకు ఎలాంటి హామీ ప్రస్తావన కూడా లేదు. అలాంటి ఉద్దేశ్యం ఉంటే ఈ పాటికి కేంద్ర ప్రభుత్వం దాని గురించి ఒక స్పష్టత ఇచ్చి ఉండేది. రైతాంగానికి గరిష్ట ప్రయోజనం, డిజిటల్, పారదర్శకత, జాతీయ మార్కెట్ సమాచారం వంటి పదజాలం ఎంతగా వల్లించినా వాటిని వినియోగించుకొనే అవకాశం ఎంత మంది రైతులకు ఉంటుందన్నది ప్రశ్న. ఇప్పుడు అనేక నియంత్రణలు ఉన్నా వాటిని ఖాతరు చేయకపోవటం, దొడ్డిదారిన ఉల్లంఘిస్తున్న కంపెనీలపై అసలు ఎలాంటి నియంత్రణలు ఉండకూడదని ఈ ప్రతిపాదనల్లో ఉన్నది. వ్యవసాయ ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటి కీ ఈ విధానంతో రాష్ట్రాల హక్కులు, నియంత్రణలకు నీళ్లొదులుకోవాల్సిందే. అమల్లోకి వచ్చిన తరువాత గానీ ఇతర మంచి చెడ్డలు వెల్లడి కావు.

ఫిబ్రవరి 14వ తేదీన కేంద్రం, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం, రైతు సంఘాల ప్రతినిధుల మధ్య జరిగే చర్చల అజెండా ఏమిటో తెలియ దు. ఎవరెవరు పాల్గొనేదీ ఇంకా స్పష్టం కాలేదు. ఒకటి మాత్రం స్పష్టం, ఇది ఒక రోజులో తేలే వ్యవహారం కాదు. (ఇంకా ముందుగా చర్చలను రైతులు కోరుతున్నారు. దల్లేవాల్‌కు సంఘీభావంగా ప్రారంభించిన ఆమరణ నిరశనను 121మంది రైతులు విరమించారు) కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని 2012లోనే సిఎంగా ఉండగా నరేంద్రమోదీ కమిటీ నాటి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీని గురించి తాజా పార్లమెంటరీ కమిటీ కూడా సిఫార్సు చేసినా మోదీ మొరాయిస్తున్నారు. పార్లమెంటరీ కమిటీ సిఫార్సును అమలు చేయాలంటూ కేంద్రానికి సూచించాలని రైతు సంఘాల నేతలు సుప్రీం కోర్టును కోరారు. వ్యవసాయ గ్రాంట్లపై ఏర్పాటైన కమిటీ 2024–25 నివేదికను గతేడాది డిసెంబరు 20న పార్లమెంటుకు సమర్పించింది. దీన్ని కేంద్రం ఆమోదిస్తే అమలుకు ఉపక్రమించాలి, తిరస్కరిస్తే కారణాన్ని చెప్పాల్సి ఉంటుంది. పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం ఏడాదికి ఇస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన మొత్తం రు. ఆరువేలను పన్నెండు వేలకు పెంచాలి. (దాన్ని చూసి కొంతమంది అమలు జరగనున్నట్లు ప్రచారం చేశారు) ఈ ప్రోత్సాహకాన్ని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు కూడా ఇవ్వాలి. కనీస మద్దతు ధరల చట్టబద్దతకు ఒక రోడ్ మాప్‌ను సాధ్యమైనంత త్వరలో ప్రకటించాలి. వ్యవసాయ కార్మికులకు కనీస జీవన వేతనాల నిమిత్తం జాతీయ కమిషన్ ఏర్పాటు. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణాల రద్దు పథకాన్ని ప్రవేశ పెట్టాలి. వ్యవసాయ శాఖ పేరులో వ్యవసాయ కార్మికుల పేరును కూడా చేర్చాలి.

> **పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సులు**
>
> ప్రస్తుతం ఏడాదికి ఇస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన మొత్తం రూ.ఆరువేలను పన్నెండు వేలకు పెంచాలి.(దాన్ని చూసి కొంత మంది అమలు జరగనున్నట్లు ప్రచారం చేశారు) ఈ ప్రోత్సాహకాన్ని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు కూడా ఇవ్వాలి. కనీస మద్దతు ధరల చట్టబద్దతకు ఒక రోడ్ మాప్‌ను సాధ్యమైనంత త్వరలో ప్రకటించాలి. వ్యవసాయ కార్మికులకు కనీస జీవన వేతనాల నిమిత్తం జాతీయ కమిషన్ ఏర్పాటు. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణాల రద్దు పథకాన్ని ప్రవేశ పెట్టాలి. వ్యవసాయ శాఖ పేరులో వ్యవసాయ కార్మికుల పేరును కూడా చేర్చాలి.

కనీస మద్దతు ధరలకు **అనుకూల వాదనల సారం** ఇలా ఉంది. రైతులకు ధరల మీద ఒక చట్టబద్దత ఉంటుంది. మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ ఉంటుంది. మధ్యవర్తుల దోపిడీ నిరోధంగా ఉంటుంది. ఉత్పత్తి ఖర్చులను భరించేందుకు, ఆర్థిక పరమైన భద్రత ను మెరుగుపరచుకొనేందుకు స్థిరమైన రాబడికి వీలు కలిగిస్తుంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచుతుంది. ఆహార భద్రత, కొరతలను తీరుస్తుంది, దారిద్ర్య తగ్గింపుకు తోడ్పడుతుంది. రైతాంగ జీవనాన్ని మెరుగుపరుస్తుంది. మార్కెట్ ఒడిదుడుకులను తగ్గిస్తుంది.

**వ్యతిరేకించే వారేమంటారంటే..** మార్కెట్లో అసమతుల్యతకు దారితీస్తుంది, కొన్ని పంటలను అవసరాలకు మించి ప్రోత్సహిస్తుంది. సరఫరాఅవసరాల తీరు తెన్నులను విచ్ఛిన్నం చేస్తుంది. ప్రభుత్వాల మీద భారం మోపుతుంది, మిగులును కొని నిల్వచేయాల్సిన అవసరాన్ని పెంచుతుంది. వనరుల కేటాయింపులో అసమర్ధతకు దారి తీస్తుంది. పంటల వైవిధ్యానికి బదులు కొన్ని పంటలనే ప్రోత్సహిస్తుంది. అవినీతిని ప్రోత్సహిస్తుంది. మధ్యవర్తులు అవకాశంగా తీసుకొని రైతులకు లబ్దిని తగ్గిస్తారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలను అడ్డుకుంటుంది, ప్రతిదానికీ ప్రభుత్వంమీద ఆధారపడాల్సి ఉంటుంది. మార్కెట్ వ్యవస్థలో పోటీని తగ్గిస్తుంది. రైతులు కొత్త పద్ధతులవైపు చూడకుండా కనీస మద్దతు ధరల మీద ఆధారపడతారు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారరు.



# ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి

**ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ :** మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ప్రతి పక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడం, వ్యాపారానికి అనువైన వాతావరణం, న్యాయమైన పన్ను వ్యవస్థ కలిగి ఉండడం, కార్మికుల ఆదాయం పెరగడమే నిజమైన అభివృద్ధి ఆయన ఉద్ఘాటించారు. 'మోదీ జీ భారత్ అభివృద్ధి చెందడం నిజం: అయితే మీ కృషి ఎవరి లాభం కోసం? దేశ ఆర్థిక వ్యవస్థ చక్రం మీ చెమట, రక్తంతో తిరుగుతోంది, కానీ మీరు న్యాయమైన వాటాను పొందుతున్నారా? ఒక్కసారి ఆలోచించండి' అని మంగళవారం రాహుల్‌గాంధీ హిందీలో పోస్టు చేశారు. 60 ఏళ్లల్లో ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా అత్యల్ప స్థాయికి పడిపోయిందని, ప్రజలు ఉపాధి కోసం ఇబ్బంది పడుతుండడమే ఇందుకు కారణ మని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొ న్నారు. వ్యవసాయ రంగంలో తప్పుడు విధానాలు రైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితిని మరింత దిగజార్చాయని, వారు తమ జీవితాలను గడపలేక పోతున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కార్మికుల వాస్తవ ఆదాయం స్తబ్దుగా ఉండడం గానీ, లేదా తగ్గడంగానీ జరిగిందన్నారు. హానికర మైన జిఎస్‌టి, ఆదాయపు పన్ను పేదలు, మధ్యత రగతికి జీవితాన్ని కష్టతరం చేశాయని, అయితే కార్పొరేట్లకు మాత్రం రుణాలు మాఫీ అయ్యా యని కాంగ్రెస్ అగ్రనేత విమర్శించారు. ఆకాశా న్నంటుతున్న ద్రవ్యోల్బణం కారణంగా, ఇప్పుడు పేదలు మాత్రమే కాకుండా జీతాలు పొందే తరగ తుల వారు కూడా వారి అవసరాల కోసం రుణాలు తీసుకోవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ప్రజల హక్కులను కాపా డుతూ రాహుల్‌గాంధీ ఆదివారం 'వైట్ టీషర్టు ఉద్యమం' ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదలకు వెన్నుచూపు తోంది ఆయన ఆరోపించారు. 'మీరు ఆర్థిక న్యాయంపై నమ్మకం ఉంటే, పెరుగుతున్న సంపద అసమానతలను వ్యతిరేకిస్తే, సామాజిక సమా నత్వం కోసం పోరాడితే, అన్ని రకాల వివక్షతను తిరస్కరించినట్లయితే, మన దేశంలో శాంతి, స్థిరత్వం కోసం పోరాడితే, తెల్లటి టీషర్టులు ధరించి ఉద్యమంలో చేరండి' అని గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో వాయిస్ ఓవర్‌లో పేర్కొ న్నారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తోంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ప్రైవేట్ పెట్టుబ డులు, స్తబ్దత వేతనాలు సామాన్య ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.

**పేపర్‌లీక్ యువత హక్కులను హరించడమే...**

పరీక్షా పత్రాల లీకేజీ యువత హక్కులను హరించ డానికి ఒక ఆయుధమని రాహుల్ గాంధీ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రతిరోజూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. నిరసన తెలుపుతున్న బిపిఎస్‌సి అభ్యర్థుల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని ప్రతిజ్ఞ చేశారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్‌సి) పరీక్షలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా పాట్నాలో దాదాపు నెలరోజులుగా జరుగుతున్న ఆందోళన స్థలాన్ని సందర్శించి, బాధిత విద్యార్థు లతో కొంత సమయం గడిపారు. అనంతరం నిర సన తెలుపుతున్న విద్యార్థులతో సంభాషించిన వీడియోను గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో పంచుకున్నారు. వీడియోతో పాటు బీహార్‌లో 'బిపి ఎస్‌సి పరీక్ష స్కామ్' కారణంగా నష్టపోయి పోలీ సుల లాఠీచార్జిని ఎదుర్కొన్న విద్యార్థులను ఇటీ వల కలిసినప్పుడు తాను తీవ్రమైన సమస్యలను చర్చించానని హిందీలో పోస్టు చేశారు. పేపర్ లీక్, పరీక్షా స్కామ్ చిక్కును విద్యార్థులు పూర్తి వివరంగా వెల్లడించారని ఆయన అన్నారు. 'అభ్య ర్థులకు ప్రశ్నాపత్రాలు అందినా, రాకపోయినా, అవి కచ్చితంగా సోషల్ మీడియాలో వైరల్ అవు తాయి. అభ్యర్థులు సాధారణీకరణ, స్కేలింగ్ వంటి విష వలయాలలో చిక్కుకున్నారు. తద్వారా వారి స్కోర్‌ల నుండి ఉపాధి హామీని కూడా వారు తెలుసుకోలేరు' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. గాంధీ పద్ధతిలో నిరసన తెలిపిన విద్యార్థులపై కృరంగా లాఠీచార్జ్ చేశారని, ఆ తర్వాత వారిపై బలవంతంగా కేసులు నమోదు చేశారని మండిప డ్డారు. 28 పరీక్షా కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగినప్ప టికీ దీనిని ప్రభుత్వం దానిని అంగీకరించడానికి సిద్ధంగా లేదని ఆరోపించారు. న్యాయం, పునః పరీక్ష కోరుతున్న వేలాది మంది విద్యార్థుల గొంతు ఈ వీడియో అని అన్నారు. వారి మాటలు విన్న తర్వాత, పార్లమెంటులో వారి డిమాండ్లను లేవనెత్తుతానని హామీనిచ్చానని, ఇది బీహార్ సమస్య మాత్రమే కాదు, మొత్తం దేశం సమస్య అని, ఇది ప్రతి ఆశావహ యువకుడి సమస్య అని గాంధీ అన్నారు. 'ఈ ఏకలవ్యుల బొటనవేళ్లు నరికి వేయనివ్వను' అని ప్రతిజ్ఞ చేశారు.

# ఢిల్లీలో...'పిచే ముడ్'!

● గణతంత్ర దినోత్సవ పరేడ్ రిహార్సల్స్ కారణంగా సెంట్రల్ ఢిల్లీలో 'హెవీ ట్రాఫిక్' కష్టాలు ● భద్రతా సిబ్బంది, పోలీసుల తనిఖీలతో ప్రయాణాలు ఆలస్యం-ఉద్యోగులు ఆఫీసులకు డుమ్మా ● రోడ్లపై రెండుగంటలసేపు నిలిచిపోయామని వాహనదారులు అసహనం



**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం (రిపబ్లిక్ డే) పరేడ్ రిహార్సల్స్ కారణంగా మంగళ వారం సెంట్రల్ ఢిల్లీలో వాహనాల రాకపో కలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వంద లాది వాహనదారులు రోడ్డుపైనే చిక్కుకుపో యారు. ఐటిఓ సమీపంలోని బహదూర్‌షా జాఫర్‌కు దారితీసే మార్గం, రింగ్ రోడ్డు చెంతన ఉన్న ఆర్టీరియల్ రోడ్లు, ఆశ్రమం మధ్య, ఐపి ఎస్టేట్ ఫ్లైఓవర్, మాన్‌సింగ్ రోడ్, రఫీమార్గ్, జన్‌పథ్ రోడ్, షాజహాన్ రోడ్, అక్బర్ రో, అశోకా రోడ్, కర్తవ్య పథ్ చుట్టూ ఉన్న ఇతర మార్గాలలో వాహనాల రాకపోకలపై అంత రాయం ప్రభావం పడింది. 'కర్తవ్య పథ్ దగ్గరలో హెవీ ట్రాఫిక్ ఫొటోను ఒక 'ఎక్స్'వినియోగదా రుడు పోస్టింగ్ పెట్టారు. @dtptrafficను ట్రాఫి క్‌ను మేనేజ్ చేయమని అడగడం చాలా తీవ్రస్థా యిలో పరిగణిస్తున్నారా? అని ఆ వినియోగదా రుడు 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఈ హెవీ ట్రాఫిక్ యావత్ ట్రాఫిక్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది'. ఢిల్లీ రోడ్లు కిటకిటలాడటం మూలంగా తమ పనికి తీవ్ర ఆలస్యం అయ్యిందని, అందువల్ల తాము విధులకు వెళ్లేందుకు ఇష్టపడలేదు అని కొందరు వినియోగదారులు తమ ఆవేదనను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పనికి వెళ్లలేదని అనుకోవద్దు. ఢిల్లీలో ట్రాఫిక్ పరిస్థితి భయంకరంగా ఉంది అని మరొక వినియోగదారుడు 'ఎక్స్' పోస్టింగ్‌లో తెలిపారు. ట్రాఫిక్ పోలీసులపై మోటార్‌వాహనదారులు విమర్శలు గుప్పించారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫి క్‌ను సరిగా నియంత్రించలేకపోయారని, అంతేకా కుండా ట్రాఫిక్ డైవర్షన్ల గురించి సకాలంలో సమాచారాన్ని అందించడంలో ట్రాఫిక్ పోలీసులు వైఫల్యం చెందారని నిందించారు. ఆన్‌లైన్ మ్యాప్‌ల చిత్రాలను షేర్ చేసిన ఒక వినియోగదా రుడు మాట్లాడుతూ సెంట్రల్ ఢిల్లీ వైపు వెళ్లే అన్ని మార్గాలలో ట్రాఫిక్ జామ్ అయ్యిందని, ప్రజలు తమ గమ్యస్థానాలను చేరుకునేందుకు ఒక గంటకు పైగా సమయాన్ని వెచ్చించి నిరీక్షించా ల్సిందేనని తెలియజేశారు. సెంట్రల్ ఢిల్లీలో ప్రతీ రోజూ కారులో ఆఫీస్‌కు వెళ్లే రాజ్‌కుమార్ మాట్లా డుతూ 'నా కార్యాలయానికి వెళ్లేందుకు ప్రతీ రోజూ నేను కారులో ఉదయాన్నే బయలుదేరి సకా లంలోనే చేరుకుంటున్నాను. కానీ ఈరోజు (మంగ ళవారం) ట్రాఫిక్ పరిస్థితి మాత్రం పూర్తి విరు ద్ధంగా ఉన్నది. నేను ట్రాఫిక్‌లో రెండుగంటలకు పైగానే ఇరుక్కుపోయాను. ఈ విషయాన్ని నా సీని యర్లకు తెలియజేసి ఆఫీస్‌కు చేరుకోవడానికి ఆలస్యం అవుతుంది' అని చెప్పాల్సి వచ్చింద న్నారు. 'రిపబ్లిక్ డే సందర్భాన్ని పురస్కరించుకుని భద్రతను కూడా బాగానే పెంచారు. ట్రాఫిక్ పోలీ సులు ప్రతీ చెక్‌పాయింట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అందువల్ల రద్దీ ఏర్పడింది. వాహనాల రాకపోకలపై ఈ ప్రభావం బాగా పడు తోంది' అని రాజ్‌కుమార్ తెలిపారు. సెంట్రల్ ఢిల్లీలో రోడ్ల మూసివేత కారణంగా ట్రాఫిక్ అంత రాయం గురించి జనవరి 15న ట్రాఫిక్ పోలీ సులు అడ్వైజరీ జారీ చేసినప్పటికీ ట్రాఫిక్ రద్దీ గురించి ప్రజల్లో గుసగుసలు విన్పించాయి. కర్తవ్య పథ్ పై రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్స్ నిరంతరంగా కొనసాగించడం వల్ల అంతరాయాలను తొలగించ డానికి ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేసినట్లు ఢిల్లీ పోలీస్ ప్రకటన తెలియజేసింది. జనవరి 17, 18, 20, 21వ తేదీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆ ప్రకటన తెలియజేసింది. ఈ హెవీ ట్రాఫిక్ ప్రభావం దక్షిణ ఢిల్లీలోని పలు ప్రాంతాలలో కూడా పడింది. సామాజిక మాధ్యమంలో ఒక వాహనదారులు పోస్ట్ చేస్తూ ఎంబి రోడ్డుపై రెండు గంటలకు పైగా ఏర్పడిన ట్రాఫిక్ రద్దీలో చిక్కుకు పోయామని తెలిపారు. రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్ అంతరాయాలను, సెక్యూరిటీ చెకింగ్‌లను అధిగ మించేందుకు మరికొందరు వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్‌చేసి మెట్రో రైళ్లలో వారి ఆఫీసులకు వెళ్లిపోయారు.

# రాజీవ్‌బబ్బర్‌కు 'సుప్రీం' ఆరువారాల గడువు



**న్యూఢిల్లీ :** ఓటర్ల తొలగింపు ఆరోపణలపై తమపై పెట్టిన పరువునష్టం కేసును కొట్టివేయడానికి నిరాకరించిన ఉత్త ర్వును వ్యతిరేకిస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటి షన్‌పై స్పందించేందుకు ఢిల్లీ బిజెపి నేత రాజీవ్ బబ్బర్‌కు మంగళవారం సుప్రీంకోర్టు ఆరువారాల గడువు మంజూరు చేసింది. ఫిర్యాదుదారు రాజీవ్ బబ్బర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్‌రాయ్, ఎస్‌వి ఎన్.భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ సంద ర్భంగా దీనిపై స్పందించేందుకు తమకు మరింత సమయం కావాలని కోరారు. దీనిపై స్పందించిన బెంచ్ ఆరువారాల గడువు మంజూరు చేసింది. ట్రయల్‌కోర్టులో విచారణపై గత ఏడాది సెప్టెంబరు 30న సుప్రీంకోర్టు స్టే విధిసూ రాజీవ్ బబ్బర్‌కు నోటీస్ జారీచేసింది. తాను వ్యక్తిగత హోదాలో ఫిర్యాదు చేయలేదని, ఒక రాజకీయపార్టీ అయిన బిజెపికి అధికార ప్రతినిధిగా దావావేశానని, తన వాదనకు మద్ద తుగా 2019, జనవరి 16నాటి అధికార లేఖను రికార్డ్‌లోకి తెచ్చానని బబ్బర్ తెలిపారు.రాజీవ్‌బబ్బర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్ మాట్లాడుతూ ఆరో పిత ప్రకటనలు పరువునష్టం కలిగించేవిగా ఉన్నాయని, ఓటర్ల మధ్య పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసేవిగా ఆరోప ణలు ఉన్నాయన్నారు. కాగా మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తన వాదనలు వినిపిస్తూ ఇత రుల అంచనాలో తన ప్రతిష్ఠ ఏవిధంగా దిగజారిందనే విష యాన్ని బబ్బర్ తన పిటిషన్‌లో ప్రస్తావించలేదని ధర్మాసనా నికి విన్నవించారు. ఆయన పార్లమెంట్ ఎన్నికలకు కొద్ది నెలల క్రితం ప్రశ్నార్థక ప్రకటనలు చేశారని, ఎన్నికలలో పోరాడుతున్న గౌరవనీయ రాజకీయ పార్టీలు వాటిని రాజ కీయ చర్చగా పరిగణించాలని అభిషేక్ సింఘ్వీ వాదించారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 199కింద 'బాధిత వ్యక్తులు' ఫిర్యాదుదారు లేదా రాజకీయ పార్టీకింద కవర్ చేయబడు తుందా అనేది చట్టపరమైన ప్రశ్న అని అత్యున్నత న్యాయ స్థానం తెలిపింది. బిజెపిని నిందించడం అనవసరమైన రాజ కీయ మైలేజీని పొందాలనే ప్రధాన ఉద్దేశంతో చేసిన ఈ ఆరో పణలు ప్రాథమికంగా పరువునష్టం కలిగించే విధంగాఉన్నా యని హైకోర్టు తెలిపింది. ట్రయల్‌కోర్టులో పెండింగ్‌లో ఉన్న పరువునష్టం కేసుకు వ్యతిరేకంగా ఆతిశీ, అరవింద్ కేజ్రీ వాల్, మాజీ రాజ్యసభసభ్యులు సుశీల్‌కుమార్ తదితరులపై పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఐపిసిలోని సెక్షన్ 499 (పరువు నష్టం), సెక్షన్ 500 (పరువునష్టం శిక్ష) కింద నేరాలపై ట్రయల్ కోర్టు జారీ చేసే సమన్లు ఎలాంటి జోక్యాన్ని కోరలే దని హైకోర్టు తెలిపింది. బిజెపి ప్రతినిధి రాజీవ్ బబ్బర్ ఫిర్యా దుపై తమను నిందితులుగా పిలవాలని 2019, మార్చి 15న మెజిస్ట్రేట్ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని 2020జనవరి 28న సెషన్స్ కోర్టు ఆదేశాలపై ఆప్‌నేతలు సవాల్ చేశారు.

# ఢిల్లీ అసెంబ్లీ బరిలో 699 మంది

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఫిబ్రవరి 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికల జరగ నున్నాయి. ఇప్పటికే నామినేషన్ల పర్వం ముగిసింది. ఉపసంర హణ అనంతరం మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 699 మంది బరిలో నిలిచారు. 2020లో జరిగిన ఎన్నికలతో పోల్చితే ఈ సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఐదేళ్ల క్రితం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 672 మంది పోటీ చేశారు. ప్రముఖ వ్యక్తులు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సుప్రీం అరవింద్ కేజ్రీవాల్, బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ, కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గంలో అత్య ధికంగా 23 మంది బరిలో నిలిచినట్లు ఢిల్లీ ముఖ్య ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఆ తరువాత జానక్‌పురిలో 16 మంది, రోహతస్‌నగర్, కరవాల్‌నగర్, లక్ష్మి నగర్‌లో 15 మంది చొప్పున పోటీ చేస్తున్నారు. అయితే పటేల్‌నగర్, కస్తూర్బా నగ ర్‌లో అత్యల్ప సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఐదుగురు చొప్పున మాత్రమే బరిలో ఉన్నారు. అదే 2020లో పటేల్‌నగర్ నియోజకవర్గంలో అత్య ల్పంగా నలుగురు మాత్రమే పోటీ చేశారు. కాగా, 70 నియోజ కవర్గాలకు గానూ 38 సీట్లలో 10 మంది కంటే తక్కువగా పోటీలో ఉన్నారు. తిలక్‌నగర్, మంగోలిపురి, గ్రేటర్‌కైలాష్‌లో ఆరుగురు చొప్పున, చాందిని చౌక్, రాజేంద్రనగర్, మాల వీయ నగర్‌లో ఏడుగురు చొప్పున ఎన్ని కల్లో బరిలో ఉన్నారు. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మొత్తం 70 నియోజకవర్గాల్లో తమ అభ్య ర్థులను నిలుపగా, బిజెపి 68 స్థానాల్లో పోటీ చేస్తుంది. రెండు స్థానాలను మిత్రపక్షాలైన జెడియు, లోక్‌తాంత్రిక్ జనశక్తి పార్టీకి కేటాయించింది. అదే విధంగా బిఎస్‌పి 69 స్థానాల్లో తమ అభ్యర్థులను పోటీలో నిలిపింది. వారం రోజుల పాటు సాగిన నామినేషన్ల ప్రక్రియలో 981 మంది అభ్యర్థులు 1522 నామినేషన్ పత్రాలను సమర్పించారు. స్క్రూటినీ, ఉపసంహ రణ తరువాత ఆ సంఖ్య తగ్గింది.




# శాసనకర్తలకు ప్రత్యేక ప్రవర్తన నియమావళి

**85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌లో ఓమ్ బిర్లా**



**పాట్నా :** శాసనసభల గౌరవం పరిరక్షణ నిమి త్తం రాజకీయ పార్టీలు తమ శాసనకర్త లకు ఒక ప్రవర్తన నియమావళిని నిర్దేశించా లని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా మంగళవారం పిలుపు ఇచ్చారు. పాట్నాలో 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెష న్‌లో ఓమ్ బిర్లా ప్రసంగిస్తూ, రెండు రోజుల సంప్రదింపుల అనంతరం చర్చకు ప్రధాన కేంద్రంగా శాసనసభలను చేయాలని సభాప తులు తీర్మానించారని తెలియజేశారు. 'శాసన సభల గౌరవం పరిరక్షణలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి. రాజకీయ పార్టీలు తమ శాసనకర్తల కోసం ప్రవర్తన నియమావళిని రూపొందించినప్పుడే ఇది సాధ్యం అవుతుంది' అని బిర్లా స్పష్టం చేశారు. పలు శాసనసభలలో పదే పదే అంతరాయాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. టెక్నా లజీ వినియోగం ద్వారా శాసనసభల పని తీరులో మరింత సామర్థ్యాన్ని తీసుకురావలని కూడా సభా పతులు తీర్మానించినట్లు లోక్‌సభ స్పీకర్ వెల్లడిం చారు. 1947 నుంచి ఇప్పటి వరకు జరిగిన పార్ల మెంటరీ చర్చలను రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూ ల్‌లో గుర్తించిన 22 భాషల్లో పార్లమెంట్ త్వరలో అందుబాటులోకి తీసుకురాగలదని బిర్లా ప్రకటిం చారు. శాసనసభలు కూడా 1947 నుంచి జరిగిన చర్చలను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందు కోసం పార్లమెంటరీ సెక్రటేరియల్ నుంచి సాంకే తిక సహాయం అందజేయగలమని ఆయన హామీ ఇచ్చారు. అఖిల భారత సభాపతుల సమ్మేళనం ముగింపు సెషన్‌క బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహ మ్మద్ ఖాన్, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ శాసన మండలి చైర్మన్ అవధేశ్ నారాయణ్ సింగ్ ప్రభృతులు హాజరయ్యారు.

# 'కెజి టు పిజి' ఉచిత విద్య

**యువతకు రూ.15వేల సాయం**
**బిజెపి రెండవ మ్యానిఫెస్టో రిలీజ్!**



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, బిజెపి తమ మ్యానిఫెస్టో రెండో భాగాన్ని విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే నిరుపేద విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు సంకల్ప పత్రను ఎంపి అనురాగ్ ఠాకూర్ మంగళవారం విడుదల చేశారు. యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్, స్టేట్ పిసి ఎస్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యా ర్థులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రకటించిన బిజెపి, రెండు ప్రయత్నాల వరకు రూ.15,000 అందించ నున్నట్లు వెల్లడించింది. బిఆర్ అంబేద్కర్ స్టైఫండ్ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్ నైపుణ్య కేంద్రాల్లో సాంకేతిక కోర్సులు అభ్యసించే షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రతి నెలా రూ.1,000 అందించనున్నట్లు తెలిపింది. ఆటోటాక్సీ డ్రైవర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తా మని హామీ ఇచ్చింది. డ్రైవర్లకు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిం చనున్నట్లు హామీ ఇచ్చింది. అవే ప్రయోజనాలతో గృహ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసే ప్రణాళిక ఉన్నట్లు తెలిపింది. ఆప్ ప్రభుత్వ అక్రమాలు, మోసాలపై దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేస్తుందని మాజీ కేంద్ర మంత్రి ప్రకటించారు. కాగా, బిజెపి మ్యానిఫెస్టో తొలి భాగాన్ని జనవరి 17వ తేదీన కేంద్ర మంత్రి, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విడుదల చేశారు. ప్రస్తుత సంక్షేమ పథకాలను కొనసాగిస్తా మని హామీలు ఇచ్చి, 60–70 ఏళ్ల వయసున్న సీని యర్ సిటిజన్లకు నెలకు రూ.2,500, 70ఏళ్లు పైబ డిన వారికి రూ.3,000 పెన్షన్ వంటి కొత్త పథ కాలు ప్రకటించారు. మహిళల కోసం మాతృ సురక్ష వందన పథకం కింద ప్రతి గర్భిణీకి ఆరు పోషకాహార కిట్లు, రూ.21,000 అందిస్తామని తెలిపారు.

దేంజరస్ మేనిఫెస్టో.. డేంజరస్ పార్టీ : కేజ్రీవాల్

అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి రెండు విడతలుగా విడుదల చేసిన సంకల్ప్ పాత్ర ఇటు ఢిల్లీకి, అటు దేశానికి ప్రమాదకరమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీ వాల్ హెచ్చరించారు. తాము ఉచిత విద్యను అందిస్తుంటే వాళ్లు అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత విద్యను నిలిపివేస్తారని అన్నారు. నాలుగు రోజుల క్రితం విడుదల చేసిన తొలి సంకల్ప పాత్రలో మొహల్లా క్లినిక్‌లు ఆపేస్తామని ప్రకటించారని మంగళవారంనాడిక్కడ మీడి యాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ చెప్పారు. బిజెపికి అధికారం ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను సైతం నిలిపివేస్తారని అన్నారు. 'ఇవాళ విడుదల చేసిన సంకల్ప్ పాత్రలో ప్రభుత్వ పాఠశా లల్లో విద్యను ఆపేస్తామని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య ఇస్తామంటు న్నారు. బిజెపి చాలా ప్రమాదకరమైన పార్టీ. ఆ పార్టీకి ఓటు వేస్తే మీ బడ్జెట్ తలకిందులవుతుంది. ఇక ఢిల్లీలో మీరు జీవనం సాగించలేరు' అని ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ హెచ్చరిక చేశారు. తాము 18 లక్షల మంది పేద విద్యార్థులకు ఢిల్లీలో ఉచిత విద్య అందిస్తున్నామని, బిజెపి అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్య సహాయం, ఉచిత విద్యుత్ నిలి పివేస్తారని అన్నారు.

# సాక్షాలు తారుమారు

**సిఎం మమతా బెనర్జీపై**
**వైద్యురాలి తండ్రి సంచలన ఆరోపణలు**



**కోల్‌కతా :** ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ఆసు పత్రిలో ట్రైయినీ వైదురాలిపై హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్‌రాయ్‌కు సిల్దా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ.. సోమ వారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌కు మరణ శిక్ష విధించాలంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. అందులోభాగంగా సిల్దా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. టిఎంసి ప్రభుత్వం మంగళవారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. అలాంటి వేళ.. మృతురాలు తండ్రి మంగళవారం కోల్‌కతాలో స్పందించారు. ఆ క్రమంలో సిఎం మమతా బెనర్జీపై ఆయన సం చలన ఆరోపణలు గుప్పించారు. అప్పటి కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ తోపాటు పలువురు సాక్షాలను తారుమారు చేశారని ఆరోపించారు. అందుకే ఈ కేసులో కోర్టుకు సరైన ఆధారాలను సిబిఐ అందజేయలేదన్నారు. అందుకే నిం దితుడికి కోర్టు యావజీవ ఖైదు విధించిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు వ్యవహారంలో సిఎం మమతా బెనర్జీ తొందర పడి ఏమీ చేయనవసరం లేదన్నా రు. ఇప్పటికి వరకు ఆమె చేసింది చాలన్నారు. ఇకపై ఏం చేయనవసరం లేదం టూ సిఎం మమతా బెనర్జీకి హత్యాచార మృతురాలి తండ్రి సూచించారు. అయి తే తమకు ఇంకా సిల్దా కోర్టు ఆర్డర్ కాపీని అందలేదని చెప్పారు. బుధవారం ఆ ఆర్డర్ కాపీ తమకు అందుతోందన్నారు. అనంతరం ఈ వ్యవహారంలో తాము ఏం చేయాలనేది నిర్ణయిస్తామని పేర్కొన్నారు. మరోవైపు సిల్దా తీర్పును సవాల్ చేస్తూ.. మమతా బెనర్జీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు అనుమతించింది. సిల్దా ట్రయిల్ కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్.. ఈ కేసులో నిందితుడికి మరణించే వరకు జైలులోనో ఉంచాలని తీర్పు వెలువరించారు. అలాగే రూ. 50 వేల జరిమానా సైతం విధించారు. ఈ నగదు చెల్లించని పక్షంలో మరో ఏడాది పాటు జైలు శిక్షను విధిస్తున్నట్లు కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

# పార్లమెంటులో ఎన్‌ఆర్‌ఐ ప్రాతినిధ్యం

**పార్లమెంటరీ కమిటీ సమావేశంలో డిమాండ్**

**న్యూఢిల్లీ :** పార్లమెంటులో ప్రవాస భారతీయుల ప్రాతినిధ్యం ఉండా లని మంగళవారం జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఒక డిమాండ్ ముందుకు వచ్చింది. విదేశీ వ్యవహారాలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పలు సంస్థల నుండి ఈ డిమాండ్ ముందుకు వచ్చింది. ప్రవాసభారతీయుల వేదిక ప్రయోజనాలకు సంబంధించిన భిన్నమైన సరికొత్త సమస్యలు, ప్రవాస భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నందువల్ల భారత పార్లమెంటులో ప్రవాస భారతీయుల ప్రాతినిధ్యం ఉండాలన్న డిమాండ్ ఈ సమావే శంలో ముందుకు వచ్చింది. కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హూడా ఇందుకు సంబంధించిన కొన్ని ఉదాహరణలను కూడా ఈ సమావే శంలో ప్రస్తావించారని సంబంధిత వర్గాలు తెలియజేశాయి. ఇటలీ వంటి దేశాలలోని చట్టసభలో ఇదేవిధంగా ప్రవాసీయుల సభ్యత్వా లకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని దీపేందర్ సింగ్ హూడా ఈ సమావేశంలో చెప్పారు. అందువల్ల ప్రవాస భారతీయుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి సమస్యలను సులభంగా పరిష్కరిం చేందుకు వీలుగా ఎన్‌ఆర్‌ఐ కోటా కింద పార్లమెంటులో ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ నాయకత్వానగల స్థాయీ సంఘం భారత ప్రవాసీయుల వేదికకు సంబంధించిన అనేక సమస్యలను ఈ సమావేశంలో చర్చించింది. విదేశాలలో లక్షలసం ఖ్యలో భారతీయులు నివసిస్తున్నారు. పార్లమెంటులో సభ్యత్వం పొందడానికి వారు పూర్తిగా అర్హులని, వారి సమస్యల పరిష్కారానికి వారికి సభ్యత్వం అనివార్యంగా ఉండాలని హూడా చెప్పారు. కొన్ని ప్రవాస భారతీయ గ్రూపులు కూడా గతంలో ఇదేవిధంగా డిమాండ్ చేశాయి. కానీ ఈనాటికీ కూడా ప్రవాస భారతీయులకు విదేశాల నుండి స్వదేశంలో ఓటువేసే హక్కు కూడా లభించలేదు. భారత్‌లో ఓటు హక్కు ఉపయోగించుకోవాలంటే స్వయంగా వారు దేశానికి ప్రయాణం చేసి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది, ఉన్నచోటనుండే ఎన్ ఆర్‌ఐలు ఓటుహక్కు ఉపయోగించుకునే సదుపాయం వారికి లేదు, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఎన్‌ఆర్‌ఐలు వారు ఉండే దేశంలోంచే ఓటు వేసేవిధంగా అవకాశం కల్పిస్తూ ఒక బిల్లును 2018లో పార్ల మెంటులో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు చట్టరూపం ధరించలేదు. కొత్త పార్లమెంటు కొలువు తీరడంతో ఆ తర్వాత ఆ బిల్లుకు కాలం చెల్లిపో యింది. ఎన్‌ఆర్‌ఐలను అధికారికంగా "ఓవర్సీస్ ఎలక్టోర్స్" అని పిలుస్తారు.

ఈ విషయంపై జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశం అనంతరం శశిథరూర్ పిటిఐతో మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఐలకు పార్లమెంటులో సభ్యత్వం ఇచ్చే విషయంపై ఈ సమావేశంలో చాలా వివరంగా చర్చలు జరిపామని చెప్పారు. ఈ విషయంలో తాము అనేక ప్రశ్నలు అడిగామన, వారు ఎంతో ఆసక్తికరమైన సమాధానాలు కూడా చెప్పా రన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రవాసభారతీయ సంస్థలు ఎన్నో మంచి ప్రతిపాదనలు కూడా చేశాయి. ఏ దేశంలోనైనాగానీ వారికి కావాల్సిన అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను ఎన్‌ఆర్ ఐలు పెంపొందించుకుని ఆ దేశంలో ఒదిగిపోవాల్సిన అవసరం ఉందని కేరళనుండి వచ్చిన భారత సంస్థలు చెప్పాయి. అందుకు అనుగుణంగా నైపుణ్యంగల కార్మికులను,ఉద్యోగులను వివిధ దేశా లకు వలసలు వెళ్ళేందుకు క్రమబద్ధీకరించాల్సి ఉందని ఆ సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఈ పరిస్థితుల్లో వారు అక్రమ పద్ధతులలో కూడా విదేశాలలోకి ప్రవేశించేందుకు పదే పదే విఫలయత్నాలు చేస్తు న్నారని చెప్పారు. కేరళకు చెందిన నార్కో రూట్స్ సంస్థతోపాటు పంజాబ్ ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలశాఖాధికారులు, ఢిల్లీకి చెందిన పిఐఒసిసిఐ (భారత సంతతి వాణిజ్య,పరిశ్రమల మండలి) సభ్యులు, గుజరాత్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రవాస అధ్య యనాల వేదిక సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా ప్రవా సీయుల సమస్యలకు సంబంధించిన ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే విషయం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని దీనికి ముందుగా జరిగిన ఒక సమావేశంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసిందని శశిథ రూర్ చెప్పారు. ఈ బిల్లును తయారు చేస్తున్నారని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఐతే ఈ బిల్లును తయారు చేయడంలో రాష్ట్రాలలోని ప్రభుత్వాలను కూడా సంప్రదించాలన్న విజ్ఞప్తి కూడా సమావేశం ముందుకు వచ్చిందని ఆయన అన్నారు.

# ఆస్పత్రి నుంచి సైఫ్ అలీఖాన్ డిశ్చార్జ్

**న్యూఢిల్లీ :** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కోలుకున్నారు. కొద్ది రోజుల క్రి తం తన ఇంట్లోకి చొరబడి దుండ గుడు కత్తితో దాడి చేయగా, ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పుడు ఐదు రోజుల చికిత్స అనంతరం మంగళ వారం ముంబయి లీలావతి ఆస్పత్రి నుంచి సైఫ్ అలీ ఖాన్ డిశ్చార్జ్ అయ్యారు. కా గా, వైద్యులు సైఫ్‌కు వారంపా టు బెడ్ రెస్ట్ సూచించారు. ఇన్ఫెక్షన్ చేరకుం డా ఉండేందుకు కొంతకాలం బయట వ్యక్తులకు దూరంగా ఉండాలని చెప్పినట్టు సమా చారం. ప్రస్తుతం ఆయన వెంట తల్లి, నటి షర్మిలా ఠాగూర్ ఉ న్నారు. సైఫ్ సతీమణి, నటి కరీనా కపూర్, కుమార్తె సారా అలీఖాన్ తదితరులు అంతకు ముందు ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లారు. కాగా, జనవరి 16న సైఫ్‌పై దాడి జరిగింది. నటుడి వెన్నెముకకు తీవ్రగాయమైంది. సర్జరీ చేసిన వైద్యులు వెన్నెముక నుంచి కత్తిని తొల గించారు. మరోవైపు, ఈ కేసు విష యమై ముమ్మరంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు మహ్మద్ షరీ ఫుల్ ఇస్లాం షెహజాద్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం అతడు కస్టడీలో ఉన్నాడు. ప్రాథమిక విచారణలో నింది తుడికి సంబంధించి కొన్ని కీలక విష యాలను పోలీసులు వెల్లడించారు.

**PUBLIC NOTICE**

Notice is here by given that, **K.Madhukar Reddy, S/o. Srinivas Reddy,** aged about 37 years, Resident of H-No 25-29/6/7, Flat number: 201, Sri Sai Srinivasa residency, Mayuri Nagar, Beeramguda, Hyd.

The rightful owner of the above addressed property.

While shifting the house he lost one of the original sale deed link document with number 19031/2006 registered at SRO Sangareddy.

Further we made efforts to trace the document, but it is lost beyond recovery.

Any person/s having found the above mentioned original link document in respect to the above said property will be rewarded and the same are required to intimate below.

**M. Meghanath Reddy**
**Advocate**
Ph: 9052744117
9441777494

**పబ్లిక్ నోటీస్**

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, శ్రీ **K.మధుకర్‌రెడ్డి S/o K.శ్రీనివాస్‌రెడ్డి,** వయస్సు: **37** సంవత్సరాలు, అడ్రస్: **H-No. 25-29/6/7,** ప్లాట్ నంబర్ **201,** సాయి శ్రీనివాస రెసిడెన్సీ, మయూరి నగర్, బీరంగూడ, హైదరాబాద్.

పై అడ్రస్‌లో నివసించే నా క్లైంట్ సంబంధిత ప్లాట్ యొక్క యాజమాన్య పత్రాలలో **19031/2006** నంబర్ గల **SRO** సంగారెడ్డిలో రిజిస్ట్రేషన్ అయిన దానిని ఇల్లు మారే సమయంలో పోగొట్టుకోవడం జరిగింది.

దీనికి సంబంధించి మీ సేవ ద్వారా చాలన్ నంబర్ **15201801251356005313** ఫిర్యాదు ఇచ్చి ప్రయత్నించడం జరిగింది.

ఎవరికైనా ఈ పత్రాలు దొరికినట్లు అయితే కింద తెలిపిన ఫోన్ నంబర్లకు సమాచారం ఇచ్చినచో తగిన బహుమతి ఇవ్వబడును.

**M మేఘనాథ్ రెడ్డి**
**అడ్వకేట్**
**Ph: 9052744117**
**9441777494**



## విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా గురుకులాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** విద్యార్థుల ఆత్మహత్యలకు గురుకులాలు నిలయంగా మారుతున్నాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయం మద్దిరాలలో ఆత్మహ త్యయత్నానికి పాల్పడిన విద్యార్థిని హర్షితను ప్రభుత్వ జనరల్ ఆసుప త్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవులపై ఇంటికి వెళ్లిన విద్యార్థి తిరిగి పాఠశాలకు వచ్చిన గంట వ్యవధి లోనే ఆత్మహత్యయత్నానికి పాల్పడడాన్ని ప్రిన్సిపల్ వేదింపులే కారణంగా తాము భావిస్తున్నట్లు తెలిపారు. విద్యాలయంలోని విద్యార్థులను తల్లిదం డ్రులు కలవాలంటే జైల్లో జరిగే ములాకత్‌లను తలపించేలా పాఠశాల సిబ్బంది వ్యవహరిస్తున్నారని చెప్పారు. పాఠశాలలోని సమస్యలపై ప్రశ్నిస్తే విద్యార్థులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం గురుకుల పాఠశాలల సమస్య పరిష్కారానికి చొరవ చూపా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు గద్దం నాగరాజు, జి నవీన్, ఎం మధు, కె రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉండడం సిగ్గుచేటు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** గత నాలుగు సంవత్సరాలుగా పెండిం గ్‌లో ఉన్న బిసి విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో మౌళిక వస తులను మెరుకు పర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అవుతున్న నేటికి సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉండడం సిగ్గుచేటన్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫె స్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలతో పాటు 10వేల ర్యాంకు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావే శంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు బూర వెంకటేశ్వర్లు, గోపగాని రవి, నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

## ప్రజలు గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజలు గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో మాట్లాడుతూ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలను ప్రజలు గుర్తించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వ్యాపారంలో చేరి మీ కింద ఏజెంట్లను చేర్పించి లాభాలు పొందండి అనే మాయమాటలను నమ్మవద్దన్నారు. దీని వెనుక ఆర్థికనష్టం జరిగే అవ కాశం లేకపోలేదన్నారు. గొలుసుకట్టు వ్యా పారం చేస్తూ ప్రజలను మోసం చేసిన విషయం పోలీసుల చొరవతో జిల్లా లో రెండు కేసులు నమోదు చేసి నట్లు తెలిపారు. నిత్య సరుకులు, గృహోపకరణాలు, క్రిప్టో కరెన్సీ వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైన చెప్తే అది మోసమని గ్రహించాలన్నారు. మోసపూరిత ప్రకటనలు, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, వాట్సాప్ నెంబర్ 8712672222 ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

## కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుంది



**ప్రజాపక్షం/సూర్యాపేట:** యువజన కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసిన వారికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ ఎలిమినేటి అభి నయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా కే బోల్ సీజన్55 పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌తోనే కాంగ్రెస్ పార్టీలో ఉన్నత స్థానం లభిస్తుందన్నారు. భారత యువజన కాంగ్రెస్కు మూలమైన యువశక్తిని వెలికి తీసేందుకు యంగ్ ఇండియా కే బోల్ సీజన్ 5 కార్యక్రమం గొప్ప అవకాశమన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అభినయ్‌ను అభినందించా రు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్‌సిసెల్ వైస్ చైర్మన్ చింతమళ్ల రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, యువజన కాంగ్రెస్ మాజీ పార్ల మెంట్ అధ్యక్షులు నాయకులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నియోజకవర్గ అధ్యక్షులు జావేద్ బేగ్, నాయకులు తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, పందిరి మల్లేష్, రావుల రాంబాబు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నెల్లికంటికి పలువురు పరామర్శ

**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృ మూర్తి నెల్లికంటి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,రిటైర్డ్ లెక్చ రర్ జి లింగయ్య యాదవ్,ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, చండూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం వెంకట్ రెడ్డి,కట్ట వెంకట్ రెడ్డి,మునుగోడు మునుగోడు ఎస్ఐ రవి,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్య క్షుడు మేకల ప్రమోద్ రెడ్డి,జితేందర్ రెడ్డిలు పార్వతమ్మ చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి నెలికంటి సత్యం ను పరామర్శిం చారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గురజా రామచంద్రం, యువ జన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బనైన రాము యాదవ్, సాగర్ల లింగస్వామి,అన్వర్,జిట్టగోని సైదులు పాల్గొన్నారు.



# సంక్షేమ ఫలాలు అందించడం నిరంతర ప్రక్రియ

### మొదటి రోజు గ్రామ సభలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పేదలందరికీ హామీల అమలు సంక్షే మం అభివృద్ధి ఫలాలు అందించడం నిరంతర ప్రక్రియలని ప్రభుత్వం వాటి సాధన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గణతంత్ర దినోత్సవ నుంచి అమలు చేయబో తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అర్హులందరికీ రేషన్ కార్డుల పంపిణీ నాలుగు హిస్టారికల్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని లక్ష్యంతో నాలుగు రోజులు పాటు గ్రామసభల ద్వారా అభ్యంతరాలను స్వీకరించి లబ్ధిదారుల పారదర్శక ఎంపిక కోసం ప్రభుత్వం చేపట్టిన చర్య లలో భాగంగా మంగళవారం పోచంపల్లి పట్టణం పదో వార్డు, మండలం లోని జలాల్ పురం, మెహర్ నగర్, సాయి నగర్, పెద్ద రావులపల్లి,గౌస్ కొండ, జగత్ పల్లి గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామసభలు నిర్వహించారు. మొదటిరోజు భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి జలాల్పురం మెహర్ నగర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పదో వార్డు గ్రామసభలలో పాల్గొని ప్రజల నుంచి నాలుగు హామీల లబ్ధిదారుల తుది జాబితా ఎంపికల కోసం అభ్యంతరా లను ఫిర్యాదులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ , ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ అధికారిని సునంద, ఇన్‌చార్జి ఎమ్మార్వో నాగేశ్వర రావు,డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తడక వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా రాష్ట్ర ప్రజల అభ్యున్నతికై నాలుగు సంక్షేమపథకాలను అందిచనుందని, అందులో భాగంగానే ఆ నాలుగు పథకాలకు అబ్ధిదారులను ఎంతో పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళ వారం హుజూర్‌నగర్ మండలంలోని వేపలసిం గారంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో హుజూర్‌నగర్ ఆర్‌డిఓ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనవరి 26 నుండి అమలు చేయబోయే రైతుభరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇంది రమ్మ ఇళ్ళు,నూతన రేషన్‌కార్డులు వంటి నాలుగు సంక్షేమపథకాలను గురించి ప్రజలకు తెలియజేసి,వారి అభిప్రాయాలను సేకరించడా నికి ఈ గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరి గిందని తెలిపారు. ఈ నాలుగు పథకాలకు అర్హు లైన లబ్ధిదారులకు అన్ని పథకాలను అందించ డమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలి పారు. ఈ పథకం కొరకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో నమోదు అయి ఉండి 2023/24 ఆర్థిక సంవత్సరంలో సుమా రుగా 20 రోజులు పనిచేసిన భూమిలేని వ్యవసా యకూలీల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని ఈ గ్రామంలో 93 మంది అర్హులను గుర్తించడం జరిగిందని తెలిపారు. అర్హులైన సొంతస్థలం ఉండి ఇండ్లు లేని నిరుపేదలకు 356 మందితో ఒక జాబితా, స్థలం లేని నిరుపేదలకు 226 మందితో మరొక జాబితాతో ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ తెలియజేశారు. నేడు నిర్వహించిన ప్రజాపా లన గ్రామసభలో రైతుభరోసా పథకం కొరకు రెండు దరకాస్తులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కొరకు 63 దరకాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కొరకు 134 దరకాస్తులు వచ్చాయని ఆయా దరకాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిం చిన తర్వాత అర్హులను గుర్తిసామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎమ్.నాగార్జున్ రెడ్డి,ఏవో స్వర్ణ,మౌనిక,శైలజ,నాగేందర్,ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రతి విద్యార్థినీ, విద్యార్థు లకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిం చాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హను మంత రావు అన్నారు. మంగళవారం రోజు రాజా పేట మండలం లోని నెమిలి గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి చదువు తున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిం చాలన్నారు. విద్యార్థులకు గణిత శాస్త్రంలో బోర్డు పై లెక్కలు చెప్పడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి విద్యార్థు లకు గణిత శాస్త్రం క్లాసులు కలెక్టర్ చెప్పించడం జరిగింది. ప్రతి రోజు అందించే మెనూ ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకు న్నారు. పదవ తరగతిలో భువనగిరి జిల్లా మంచి ఫలితాలు సాధించి మెరుగైన స్థానంలో నిలిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రాజపేట మండలం లోని నెమిల అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించారు. అంగన్వాడి సెంటర్‌లో ఉన్న పోషకాహార నిల్వలను, వాటి నాణ్యత, విని యోగమును పరిశీలించారు. పిల్లల చేత ప్రీ స్కూల్ యాక్టివిటీస్ చేయించి. వారితో ముచ్చటిం చారు. బాలామృతం ఎక్స్పైరీ తేదీని పరిశీలించి, బుక్ బ్యాలెన్స్ ప్రకారం నిల్వను పరిశీలించడం జరిగింది. మెనూ ప్రకారం అరోగ్య లక్ష్మి భోజనం చేస్తున్నారా అని లబ్ధి దారులను అడిగి తెలుసుకు న్నారు. అంగన్వాడి కేంద్రానికి వాష్ రూమ్ కు మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంగన్వాడి టీచర్ పద్మ పిల్లలకు అర్థం అయ్యే విధంగా విద్యని అందిస్తున్నారని ఆమెను సన్మానం చేసి అభినందించారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పార్టీలకు అతితంగా అభి వృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట పట్టణంలో శాంతియుత వాతావరణంలో ఇప్పటి మాదిరిగానే మునుముందు కూడా కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవిం చాలని కోరారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు. పదవికాలం ముగించుకున్న సందర్భంగా కౌన్సిల్ సభ్యులకు శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ కాలంలో సూర్యాపేట మున్సిపాలిటికి పెద్దఎత్తున నిధులు తీసుకవచ్చి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సూర్యాపేట పోరాటాల గడ్డ అని ఇక్కడి వ్యాపారులు కూడా పోరాటాల్లో పాల్గొన్న చరిత్ర ఉందన్నారు. ఆ చైతన్యంతోనే దళిత మహి ళను మున్సిపల్ చైర్మన్‌గా నియమించామన్నారు. గతంలో సద్దుల చెరువును మిని ట్యాంక్ బండ్‌గా నిర్మాణం చేసుకొని పుల్లారెడ్డి చెరువు వద్ద పనులు పూర్తి కాలేదన్నారు. అలాగే నల్లచెరువు వద్ద మిని ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ కార్మికులు, సిబ్బంది మెరు గైన పనితీరుతోనే మున్సిపాలిటికి జాతీయ స్థాయిలో అవా ర్డులు వచ్చాయని తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లో కొన సాగించాలన్నారు.

**వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం**

కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ప్రజా సమస్యలపై లేవనెత్తిన ప్రశ్నలతో సమావేశం వాడివే డిగా కొనసాగింది. పట్టణంలో తాగునీటి ఎద్దటి తీవ్రంగా ఉందని నీటి సరఫరా మెరుగుపర్చి ప్రతి ఇంటికి తాగునీరు అందించాని పలువురు సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకె ళ్లారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను పెంచాల న్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకె ళ్లిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డ్రైనేజీ, అంతర్గత రోడ్లు నిర్మించాలని, వీధి దీపాలు వెలిగేలా చూడా లని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరు మాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కమిషనర్ శ్రీనివా సులు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీని వాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదు



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ప్రజాపాలన గ్రామసభల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుని, ప్రతి దశను పార దర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఇటిక్యాల మండలం వేముల గ్రామంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభ నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల్లో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, లబ్దిదారుల ప్రాథ మిక జాబితాను చదివి అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు అమలుకు సంబంధించిన అన్ని రికార్డులు రిజి స్టర్లను పరిశీలించి అవి సక్రమంగా నిర్వహించ బడుతున్నాయో లేదో తనిఖీ చేశారు. ప్రతి రిజి స్టర్లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఎటువంటి లోపాలు లేకుండా సమాచారం పూర్తి స్పష్టంగా ఉండేలా చూడాలని అధికారు లను ఆదేశించారు. గ్రామ సభల్లో తీసుకున్న అభ్యంతరాలు, సర్వేలో మిస్ అయిన వారి దర ఖాస్తులను స్వీకరించడంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టా లని సూచించారు. గ్రామ సభ ప్రక్రియలో ఎలాంటి లోపం లేకుండా అన్ని వివరాలను సక్ర మంగా డేటా ఎంట్రీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడిన కలెక్టర్ అర్హులందరికి పథకాల లబ్ధి చేరేలా ప్రత్యేక అధికారులను నియమించామని, గ్రామసభలు ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రధాన వేదికగా ఉంటాయని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటేఅధికారులకు తెలియజేయా లని జాబితాలో పేరు లేకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంపీడీఓ జుబేర్ మోహినుద్దీన్, ఎఈఓ పంచాయితీ సెక్రెటరీ తది తరులు ఉన్నారు.

# గ్రామసభలో గందరగోళం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నాలుగు పథకాలు అమలు కోసం మంగళవారం నుంచి గ్రామస భల ద్వారా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉండవెల్లి బైరాపురం సేరుపల్లి అల్లంపూర్ మండలంలోని గుందిమల్ల ఊటుకూరు బుక్కాపురం సింగవరం గ్రామాల్లోనూ స్పెషల్ అధికారుల అధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు. గ్రామాల్లోని రేషన్‌కార్డు లేనోళ్లు 360 మంది ఉంటే 26 మంది పేర్లు మాత్రమమే తెలియజేశారు. అరకొర లిస్టు ప్రకటించడంతో గ్రామాల్లోని ప్రజలు అధికారులను నిలదీశారు. పది సంవ త్సరాలు నుండి పెండ్లైన రేషన్ కార్డులు లేదని గత సంవత్సరంలో పెళ్లి చేసుకున్న వారికి రేషన్ కార్డు ఇచ్చారని అనేక తారతమ్యాలు రావడం వల్ల ప్రజలు ప్రభుత్వం పై తీవ్ర సంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. రైతు భరోసా రుణమాఫీ పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ప్రభుత్వం పథకాలను అర కొర మంజూరు చేసి చేతులు దులుపుకుంటున్న విమర్శలున్నాయిఇ. జోగు లమ్మ గద్వాల జిల్లా డిప్యూటీ సిఓ నాగేంద్రం స్పెషల్ అధికారిగా గ్రామ సభలను తనిఖీలు చేశారు. ప్రభుత్వ పథకాలు అందలేదని దిగులు చెందా ల్సిన అవసరం లేదని దరఖాస్తు తీసుకుని పరిశీలన నిమిత్తం స్థాయిలో అందరికి వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని జోగులమ్మ గద్వాల జిల్లా డిప్యూటీ సీఈఓ నాగేంద్రం తెలిపారు. దరఖాస్తులు ఈ నెల చివరి నాటి వరకు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ లస్థాయి అధికారులు పద్మావతమ్మ , హరికృష్ణ, మంజుల, తిరుపతన్న, వ్యవసాయ అధికారులు నాగార్జున్ రెడ్డి, అనిత, విస్తరణ వ్యవసాయ అధి కారులు గ్రామాల్లోని పంచాయితీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మోడీ విధానాలతో వ్యవసాయ రంగం కుదేలైంది : సూర్యనారాయణ

**ప్రజాపక్షం/కోదాడ (చిలుకూరు):** కేంద్రంలో మోడీ విధానాలతో వ్యవసాయ రంగం కుదేలైందని ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కార్యవర్గ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం చిలుకూరు మండలం జెర్రి పోతులగూడెం గ్రామంలో సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 70శాతం రైతులు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో 50శాతం నిధులు మాత్రమే వ్యవసాయ రంగానికి కేటా యించడం పట్ల రైతులను విస్మరించడమేనని అన్నారు. ఢిల్లీలో కనౌరి వద్ద సరిహ ద్దుల్లో దీక్ష చేస్తున్న తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తా మని హెచ్చరించారు. కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడి ప్రభుత్వంపై ఉద్యమించడానికి కార్యకర్తలు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జెర్రి పోతులగూడెంలో ఎఐకెఎస్ నూతన శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అనంతు హనుమంతరావు, కార్యదర్శిగా చిన్నబోయిన నర్సింహరావు, సభ్యు లుగా సోమిరెడ్డి, రామిశెట్టి రామనర్సయ్య, పాపయ్య లు ఎన్నికయ్యారు. అనం తరం కౌలు రైతు సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తాటికొండ భూపాల్ రెడ్డి, కార్యదర్శిగా రణబోతు కోటిరెడ్డిలు ఎన్నికయ్యారు. రామిశెట్టి కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొడ్డా వెంకటయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు, గ్రామశాఖ కార్యదర్శి కాంపాటి వెంకటయ్య, మొక్క వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ మౌలిక సదుపాయాలకు కృషి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** 19వ వార్డులోని ప్రజలందరికీ మౌళిక సదుపా యాల కల్పనే ధ్యేయంగా, తమ పదవీకాలం ముగిసినా ప్రజలకు అందుబాటు లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికై అహర్నిశలు కృషి చేస్తామని 19 వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వవార్డు శ్రీనగర్‌కాలనీ లో అదే పేరుతో రూ.8 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టిన ఆర్చికి మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి,వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి లతో కలిసి అట్లూరి మంజుల హరిబాబు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గెలిచిన నాటి నుండి నేటి వరకు వార్డులో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. టీపీసీసీ జాయింట్ సెక్రటరీ ఎండీ.అజీజ్‌పాషా, డా.మనోహర్,కస్తాల శ్రావణ్‌కుమార్,చిల కబత్తిని సౌజన్య,గుండా ఫణికుమారి,గల్లా వెంకటేశ్వర్లు,సమ్మెట సుబ్బ రాజు,దొంతగాని జగన్,కోలశ్రీను,కోలపూడి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హత లబ్దిదారునికి లబ్ధి కలిగించడమే ప్రభుత్వ ఉద్దేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా, ఇంది రమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు గ్రామ,వార్డు సభల ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసే కార్యక్రమం మంగళ వారం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.ఈ పథకాలకు లబ్దిదారుల ఎంపికకు ఉద్దేశించి ప్రారంభమైన గ్రామసభలలో భాగంగా, మంగ ళవారం ఆమె నల్గొండ మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు (పానగల్లు)లో నిర్వ హించిన వార్డు సభకు హాజరయ్యారు. వార్డు సభ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీ లించడమే కాకుండా ఆయా పథకాల కింద లబ్ధిదారులనుండి నూతన దరఖా స్తులను స్వీకరించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత వారం క్రితం నుండి ఆయా పథకాల కింద లబ్దిదారుల ఎంపికకు నిర్వహించిన సర్వేలో అర్హత ఉన్న వారి పేర్లను జిల్లా వ్యాప్తంగా గ్రామ,వార్డు సభల్లో చదివి వినిపిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలలో ఆయా జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు వచ్చినట్లయితే నమోదు చేస్తున్నామ న్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని,ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభలలో తిరిగి ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ వెల్లడించారు.అలాగే గ్రామసభలలో దరఖా స్తులు సమర్పించలేకపోయిన వారు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీసేవ కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు. గతంలో దరఖాస్తులు ఇచ్చి,జాబితాలో పేర్లు రానివారు ఇప్పుడు దర ఖాస్తులు ఇవ్వవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఆయా పథకాలకు సంబంధించి ప్రజలకు ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే సంబంధిత ఎంపీడీవో లేదా మున్సి పల్ కమిషనర్లను సంప్రదించవచ్చని తెలిపారు. గ్రామసభలో ఆమోదం పొందిన జాబితాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ సైతం చేయిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.





## మిషన్ భగీరథ పైప్ లీక్...
## రోడ్డు పనులకు నీటి వరద అడ్డంకి

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించిన సమయంలో ఉదయం అకస్మాత్తుగా ప్రధాన సెంటర్‌లో మిషన్ భగీరథ పైపు లీకై నీళ్లు ఎగసి పడడం జరిగింది. రోడ్డుకి ఇరువైపులా అతివేగంగా నీరు ప్రవహించింది. అన్నపురెడ్డిపల్లి ప్రధాన రహదారికి ఇరు వైపులా మిషన్ భగీరథకు సంబంధించిన భారీ పరిమాణం గల పైపులను గత కొంతకాలం క్రిందట ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో కూడా గ్రామంలో పైపు లీకై నీళ్లు ఎగసి పటడం వల్ల చుక్కుపక్కల ఉన్న కొంత మందికి ప్రమాదాలు జరిగాయి. ఈ పైపుల ద్వారా ఎప్పుడు ఎటువైపు నుండి నీరు లీక్ అవుతుందో అని ఎప్పుడు ఏ ప్రమాదాలు జరుగుతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్ పనులు నిర్మాణం జరుగుతుండగా ఈ పరిణామం చోటు చేసుకోవడం వలన రోడ్డు పనులకు అంతరాయం కలిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యేంత వరకు అధికారుల పర్య వేక్షణలో ఎండి ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం



**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట మండల పరిధిలో మంగళవారం 12 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో భాగంగా రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గురించి క్షేత్రస్థాయిలో విచారణ జరపడానికి గ్రామసభలు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలో మంగళవారం జరిగిన గ్రామసభలలో చాలాచోట్ల అధికారులపై గ్రామస్తులు చాలా చోట్ల ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామం జరిగిన ప్రజా పాలన గ్రామసభలో లబ్ధిదారుల పేర్లు లీస్ట్‌లో రాక పోవడంతో అధికారులపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నులు వసూలు చేశారని సర్వే కి వచ్చిన సమయం ఇంటి పన్నులు వసూలు చేయాల్సిన అవసరం ఏముందంటూ అధికారులను నిలదీశారు. ఎంపిక పారదర్శకంగా జరగకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అల్లిపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులు గ్రామసభలో ఉన్న అధికారులతో మాట్లాడుతుండగా అధికారులు ఆ సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోవడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడే ఓపిక లేనప్పుడు గ్రామ సభ ఎందుకు ఏర్పాటు చేశారు అని మీడియా ముందు వాపోయారు.

## నిలదీసిన ప్రజలు..



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని అన్నవరం, చిన్నగోపతి, చిన్న మునగాల, గద్దలగూడెం, మెకాలకుంట, రాజ్యాతండా, రామనర్సయ్యనగర్, తీగలబంజర గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో రైతురుణమాఫీ, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాపై అధికారులను ప్రజలు నిలదీశారు. రేషన్ కార్డులు అందరికి రావడం లేదని వారు ఆరోపించారు. తీగలబంజరలో ఇంటింటి సర్వే నిర్వహించకుండా సర్వే చేశారని ప్రజలు ఆరోపించారు. రేషన్ కార్డులు గ్రామంలో నివసించని వారి పేర్లు వచ్చాయని, గ్రామంలో నివసించే వారి పేర్లు రాలేదని దీంతో తిరిగి ఇంటింటి సర్వే నిర్వహించాలని కోరుతు గ్రామసభను కొద్ది సేపు అడ్డుకున్నారు. అధికారులు ప్రజలకు సమాధానం చెప్పలేక అవస్థలు పడ్డారు. మొత్తంమీద మంగళవారం జరిగిన గ్రామసభలు రసాభాసాగా మారాయి.

## ఆర్‌టిసికి రూ.20.73కోట్ల ఆదాయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో రూ. 20.73 కోట్ల ఆదాయం లభించిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ మంగళవారం తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల తొమ్మిది నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మంజిల్లా నుండి హైదరాబాద్‌కు అదనంగా 1277 బస్సులను నడపడం జరిగిందన్నారు. పండుగ సందర్భంగా 20.80 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారని అందులో 15.97 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించారన్నారు. మొత్తం 30.96 లక్షలు కిలో మీటర్లు తిరగడం వల్ల రూ.20.73 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఖమ్మం డిపోకు రూ.4.86 కోట్లు, మధిర డిపోకు రూ.2.29 కోట్లు, సత్తుపల్లి డిపోకు రూ.3.73 కోట్లు, భద్రాచలం డిపోకు రూ.3.99 కోట్లు, కొత్తగూడెం డిపోకు రూ.2.22 కోట్లు, మణుగూరు డిపోకు రూ. 3.02 కోట్లు, ఇల్లందు డిపోకు రూ.60 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల తొమ్మిదిన ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని అన్ని డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పండుగకు ప్రత్యేక బస్సులను నడుపుటకు ప్రణాళికలు సిద్ధం చేసి విజయవంతమైనట్లు ఆయన తెలిపారు. సహకరించిన ప్రయాణికులకు, నిరంతరం విధులు నిర్వహించిన ఆర్టిసి అధికారులు, ఉద్యోగులు, డ్రైవర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ

**ప్రజాపక్షం/మణుగూరు :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు నిరంతర ప్రక్రియ అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మణుగూరు మండలం ఇప్పల సింగారం గ్రామపంచాయితి పరిధిలోని ఇప్పల సింగారం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ అధికారులు నిర్వహించిన ప్రజా గ్రామ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రామ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ప్రజాపాలన గ్రామ సభలను ఏర్పాటుచేసి ప్రతి పేద, బడుగు బలహీన కుటుంబాలకు ఈ నెల జనవరి 26 రిపబ్లిక్ డే నాడు ప్రతి పేద కుటుంబానికి అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, లీస్ట్‌లో పేరు రాని వారు ఎవరు నిరుత్సాహ పడకూడదని ఈ నియోజకవర్గంలో సంవత్సరానికి 3500 వందల ఇల్లు కోటాలో వచ్చాయని, ప్రతి ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్తగా పెళ్లి అయిన వారికి రేషన్ కార్డ్స్ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని ప్రజాపాలన గ్రామసభలో ప్రజలే అర్హులను గుర్తించాలని తెలిపారు. నా నియోజకవర్గంలో పేదవాడు అయితే చాలు పార్టీలకు అతీతంగా అన్ని పథకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎండిఓ శ్రీనివాస్ రావు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో రసాభాస

### జాబితాలో అర్హులు లేరంటూ ఆందోళన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నాలుగు పథకాలకు సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు రఘునాథపాలెం మండలంలో రసాభసగా సాగాయి. ఈనెల 26 నుంచి ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల జారీ వంటి పథకాలను ప్రారంభించనున్నది. ఈ పథకాలకు సంబంధించి అర్హుల జాబితాను ప్రకటించేందుకు ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా మంగళవారం రఘునాథపాలెం మండల పరిధిలోని చింతగుర్తి, దొనబండ, గణేశ్వరం, కెవి బంజర, కోయచలక, మంచుకొండ, మూలగూడెం, పుఠానితండా, శివాయిగూడెం, పడమటి తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి నాలుగు పథకాలకు సంబంధించి అర్హుల జాబితాను ప్రదర్శించడంతో పాటు సభలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో అర్హులకు కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు మంజూరు చేశారంటూ లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారినే అర్హులుగా ఎంపిక చేశారని వాపోయారు. మంచుకొండ గ్రామసభ కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి అర్హుల ఎంపిక సక్రమంగా జరగలేదంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సభలో కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభల వద్ద నాలుగు పథకాలకు సంబంధించి హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. మంచుకొండ గ్రామసభలో డిప్యూటీ సిఈవో నాగపద్మజ పాల్గొన్నారు. సిపి సునీల్ దత్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. గణేశ్వరం గ్రామసభలో డిఆర్‌డివో సన్యాసయ్య, చింతగుర్తి గ్రామసభలో అడిషనల్ డిఆర్‌డివో శిరీష పాల్గొన్నారు. చింతగుర్తి, గణేశ్వరం గ్రామసభలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఏఎంసి డైరెక్టర్ తమ్మిని నాగేశ్వరరావు పాల్గొన్నారు. కెవి బంజరలో ఎంపిడివో అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రదర్శించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చునన్నారు. అర్హుల జాబితాలో పేర్లు లేని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామసభలతో పాటు మండల కార్యాలయాల్లో లబ్ధిదారులు నాలుగు పథకాల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ గ్రామసభల్లో మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా అర్హుల ఎంపిక

### పథకాల అమలు నిరంతర ప్రక్రియ : సభల్లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగరంలోని ఆరవ డివిజన్‌లో, ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో నాలుగు నూతన పథకాల అమలుపై నిర్వహించిన వార్డు, గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు పథకాల అర్హుల ప్రాథమిక జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులు ఏమైనా ఉంటే చర్చ పెట్టుకోవాలన్నారు. ఇందరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల మార్గదర్శకాలను గ్రామ వాట్సప్ గ్రూపులు, న్యూస్ అధికారుల ద్వారా తెలియజేశామన్నారు. నాలుగు నూతన కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి లబ్ధిదారుల యొక్క ప్రాథమిక జాబితా గ్రామ సభల్లో పెడుతున్నామన్నారు. ఎక్కడ ఎటువంటి దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రజలకు తెలిసేలా పథకాల అమలు ఉంటుందన్నారు. జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని మళ్లీ విచారణ చేస్తామన్నారు. ప్రాథమిక జాబితాలో అర్హులు ఎవరైనా లేని పక్షంలో గ్రామసభల్లో లేదా ఎంపిడివో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న ప్రజాపాలన కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తులను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పథకాల లబ్ధి చేకూరుస్తామన్నారు. గ్రామసభ, వార్డు సభల వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబితాలో పేర్లు సరి చూసుకొనుటకు జాబితాలో పేర్లు లేని వారికి దరఖాస్తు పెట్టుకొనుటకు అధికారులు సహకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం గ్రామసభల్లో పెట్టిన జాబితా, ప్రాథమిక జాబితా మాత్రమేనని తుది జాబితా కాదని ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండాలని, పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అర్హులందరికీ పథకాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో కుమార్, ఏపిఎం శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నాలుగు ప్రతి ఒక్కరికి అందాలనే సదుద్దేశంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం మద్దుకూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని తొలుత లబ్ధిదారుల జాబితాను చదివి గ్రామసభలో వినిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పథకాల జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, జాబితాలో పేర్లు రానటువంటి వారు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులు ఎంత మంది ఉన్నా వారి పేర్లు చేర్చటానికి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. లబ్ధిదారులు వెంటనే దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియన్నారు. సభలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విద్యచందన, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, జిపి సెక్రటరీ క్రిష్ణకుమారి, ఏఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గందరగోళంగా గ్రామసభలు

### దరఖాస్తులతో బారులు తీరిన ప్రజలు..
### లబ్ధిదారుల ఎంపికల్లో అవకతవకలు...

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 4 పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ప్రారంభమైన గ్రామసభలు గందరగోళంగా జరిగాయి. పట్టణంలోని 1,2,3, 4,5,15,16,17 వార్డులలో, మండలంలోని యాతాలకుంట, చెరుకుపల్లి, గంగారం, రామానగరం, రామగోవిందాపురం, బేతుపల్లి, నారాయణపురం, తాళ్ళమడ, బుగ్గపాడు, రేగళ్ళపాడు, కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, తుం బూరు, కిష్టాపురం, సదాశివునిపాలెం, సిద్ధారం, గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల గ్రామాలలో గ్రామ సభలు జరిగాయి. గ్రామసభలలో అధికారులు లబ్ధిదారుల పేర్లను ప్రకటించిన సమయంలో పెద్ద ఎత్తున ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా జరిగిందంటూ మండిపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి, ప్రభుత్వ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రావడంతో విస్మయం వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తనకు తెల్ల రేషన్ కార్డు వద్దని లిఖితపూర్వకంగా అధికారులకు రాసి ఇవ్వడం కొసమెరుపు. అదేవిధంగా ఆంధ్రలో పెన్షన్ తీసుకుంటున్న వారికి, బ్రతుకు తెరువు కోసం తెలంగాణ రాష్ట్రం వచ్చి ముగ్గు వ్యాపారం చేస్తున్న కొందరికి రేషన్ కార్డు జాబితాలో, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు రావటం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపించింది. ఈ సందర్భంగా ప్రజలు అధికారులను గ్రామ సభలో నిలదీశారు. నిజమైన లబ్ధిదారుల పేర్లు కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు, ఆంధ్రాలో లబ్ధిదారులుగా ఉంటున్న వారిని ఏ విధంగా లబ్ధిదారుల జాబితాలో చేర్చారని మండిపడ్డారు. గ్రామసభల విషయం కూడా చివరి వరకు తెలియనివ్వకుండా అధికారులు గోడ మీద పిల్లిలా వ్యవహరించారని మండిపడ్డారు.



**ఆందోళనకారులకు డా. మట్టా భరోసా...**

గందరగోళంగా జరుగుతున్న గ్రామ సభలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై ప్రజలను శాంతింపచేశారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి న్యాయం జరుగుతుందని, నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి న్యాయం చేకూరేలా చూస్తానని, ప్రజలెవ్వరూ అధైర్య పడవద్దని మట్టా దయానంద్ హామీ ఇవ్వటంతో ప్రజలు శాంతించారు.

## పేరుకే గ్రామసభలు.. అనర్హులకు పథకాలు



సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్

**ప్రజాపక్షం/బోనకల్ :** పేరుకేనా గ్రామసభలని, అనర్హులకేనా పథకాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని రాయన్నపేట, బ్రాహ్మణపల్లిలలో నిర్వహించిన గ్రామసభలలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి పాల్గొని మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అనర్హులకే అధికారులు పెద్దపీట వేశారని ఆరోపించారు. అన్ని పథకాలలో అర్హుతా జాబితా సక్రమంగా జరగలేదని, అనర్హుల జాబితానే చదివి వినిపించారని గ్రామస్థులతో కలిసి అధికారులను ప్రశ్నించారని అన్నారు. అధికారులు ప్రకటించిన జాబితాను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీలు గ్రామ కాంగ్రెస్ కమిటీల వ్యవహరించాయని నిజమైన అర్హులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. గ్రామసభను సిపిఐ గ్రామ శాఖ పక్షాన బహిష్కరణ చేస్తున్నామని అధికారులకు తెలిపామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వల్లెబోయిన జానయ్య, శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్, మండల నాయకులు బొమ్మినేని నాగేశ్వర రావు, పారుపల్లి నరసింహరావు, వల్లెబోయిన వీర భద్రం, గుడిద కృష్ణ, గుడిద నాగేశ్వరరావు, వంగాల శివపార్వతి, మడుపల్లి వెంకటేశ్వర్లు, చావా గోపాల కృష్ణ, మరీదు ఈశ్వరమ్మ, తోటపల్లి సునీత, చాట్ల భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం

### పథకాల జాబితాను అధికారులు ఏకపక్షంగా చేశారని వాగ్వాదం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు, రైతుభరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా గ్రామ కాంగ్రెస్ నేతల అత్యుత్సాహంతో గందరగోళంగా నడిచింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పథకాలపై క్షేత్రస్థాయి సర్వే చేసి గుర్తించిన జాబితాపై రగడ చేశారు. అధికారులు పథకాల జాబితాను ఏకపక్షంగా చేశారని, సభను నడపకుండా పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అది కూడా ఆర్డీఓ నరసింహారావు, రెవెన్యూ,పంచాయతీరాజ్, పోలీస్ అధికారుల ఎదుటే అడ్డగోలుగా వ్యవహరించారు. అధికారులు తాము అర్హుల జాబితాను ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగానే లిస్టులో పేర్లు పొందుపరిచామని, అనర్హులు ఉంటే చెప్పండి విచారణ జరిపిస్తామని చెప్పినప్పటికీ వినలేదు. అంతేకాకుండా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఓట్లు మీ అధికారులు వేపించారా? వేపించింది మేము మా ఇష్టానుసారంగా జరగాలంటూ హుకుం జారీ చేశారు. ఈ నేపథ్యంలో వివాదాన్ని ఆపేందుకు అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వారి ఆపే ప్రయత్నం చేశారు. దీనితో కోపోద్రిక్తుడైన కాంగ్రెస్ నాయకుడు బోడ వెంకన్న ఎస్ఐపైనే దౌర్జన్యానికి దిగాడు. నువ్వెవరు నన్ను కూర్చోమని చెప్పడానికి, ముందు నువ్వు వెళ్లి కూర్చో అంటునే నీ భాగోతం మొత్తం నాకు తెలుసు అంటూ సంబోధించాడు. ఈ ఘటనతో కాంగ్రెస్ నేతలు అధికార దర్పాన్ని ప్రదర్శించడంలో ఎంతలా? వెంపర్లాడుతున్నారనేది స్పష్టమైందని చెప్పాలి. విధులు నిర్వహిస్తున్న అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా వాడిన భాష తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

## పేదలు, కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం

**ప్రజాపక్షం /పాల్వంచ :** పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం పునరుద్ఘాటించారు. మంగళవారం మండల పరిధి నాగారం కాలనీలో సిపిఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిపిఐది వందేళ్ల చరిత్ర అని మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడు పోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పని చేయడం అదృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. పాల్వంచ మండలంలో సిపిఐకి ఎదురులేని, ఇది ప్రజలకు అందించిన సేవల ఫలితమేనన్నారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం నాగారం కాలనీ గ్రామశాఖ 15మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా సపావట్ వెంకటరమణ, సహాక కార్యదర్శిగా సుంకర రంగారావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఐ మండల నాయకులు నిమ్మల రాంబాబు, ముత్యాల కిరణ్‌కుమార్, లాల్‌పాషా, సపావట్ వెంకటరమణ, సుంకర రంగారావు, తేజావత్ హరియా, సపావట్ హరియ, భూక్యా మంగు, భూక్యా అశోక్‌కుమార్, కృష్ణ, వినోద్‌కుమార్, చంద్రయ్య, వీరాచారి, బాలు, తేజావత్ పద్మ, వినోద్, భూక్యా బాలు, సారయ్య పాల్గొన్నారు.



## మిర్చిని ఎత్తుకెళ్లిన దొంగలు

**ప్రజాపక్షం/ తల్లాడ :** కల్లాల్లో ఉంచిన మిర్చిని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం తల్లాడలో చోటు చేసుకుంది. తల్లాడకు చెందిన రైతు, తల్లాడ మేజర్ పంచాయతీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి తల్లాడలోని కేతినేని థియేటర్ నుండి అన్నారుగూడెం వెళ్లే రహదారిలో రెండు ఎకరాలన్నర మిర్చిని సాగు చేశారు. ఈనేపథ్యంలో పంట చేతికి రావడంతో ఆదివారం కూలీలతో మిర్చిని కోసి చేను పక్కన కల్లాల్లో ఆరబోశారు. దీంతో ఆ రహదారిలో వెళ్లే దొంగలు రాత్రి వేళలో సుమారు 5బస్తాల మిర్చిని ఎత్తుకెళ్లారు. కూలీలతో మిర్చి కోసి ఆరబోసి రాత్రి సమయంలో ఇంటికి వెళ్లిన సదరు రైతు శ్రీనివాస్‌రెడ్డి తెల్లవారుజామున వచ్చి చూసే సరికి ఐదు బస్తాలు మాయమయ్యాయి. సుమారు రెండు క్వింటాళ్ల మిర్చిని చోరీ చేశారు. కేతినేని థియేటర్ రోడ్డులో వాహనాల రాకపోకలు తక్కువ ఉండటంతో ఇదే అదునుగా భావించిన దొంగలు రాత్రివేళ వచ్చి మిర్చిని చోరీ చేశారు. దీంతో రైతు శ్రీనివాస్‌రెడ్డి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**నిఘా పెంచుతాం : ఎస్ఐ కొండలరావు..**

మిర్చి చోరికి గురైన విషయం తమ దృష్టికి వచ్చిందని, మండలంలో నిఘాను, పెట్రోలింగ్ పెంచుతామని ఎస్సై కొండలరావు పేర్కొన్నారు. ఆ పరిధిలో సిసి కెమెరాలు ఉంటే పరిశీలిస్తామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కన్పిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.



# పామాయిల్ అవినీతి ఎవరి ఖాతాలో...?



### తెలియదంటున్న కాంట్రాక్టర్.. ఫోన్ ఎత్తని మేనేజర్..
### ఆయిల్ ఫెడ్ అధికారుల నిర్వాకంతో నష్టపోతున్న రైతులు..
### వ్యవసాయ శాఖ మంత్రి విజన్‌ను నీరుగారుస్తున్న అధికారులు...

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటూ రైతన్నకు భారీ లాభాలను తెచ్చిపెట్టే పామాయిల్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషికి తూట్లు పొడుస్తున్నారు టిఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు. వ్యవసాయ మంత్రిగా ఓ విజన్ ఏర్పాటు చేసుకున్న తుమ్మల తెలంగాణ రాష్ట్రం మొత్తం రైతులను రాజు చేయాలని కంకణం కట్టుకున్నారు. టిఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ అవినీతికి తెర లేపుతున్నారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని రేగళ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో సుమారు మూడు లక్షల సీడ్ లింక్స్ మొక్కలు పనికిరాకుండా పోవడం పెద్ద దుమారాన్ని లేపుతుంది. మూడు లక్షల సీడ్ లింక్స్‌ను దిగుమతి జరిపి, సుమారు 17 నెలల నుంచి వాటి సస్యరక్షణ చేపడుతున్నప్పటికీ మొక్కలలో ఎదుగు, బొదుగు లేకపోవడం, సాగుకు పనికి రాకపోవడంతో నర్సరీలో వృథాగా కనిపిస్తున్నాయి. సీడ్లింగ్స్ దిగుమతి నుండి వాటికి 17 నెలల నుంచి జరిగిన సస్యరక్షణకు అయ్యే ఖర్చు వరకు జరిగిన అవినీతిని ఎవరి ఖాతాలో వెయ్యాలో తెలపాలంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయటానికి కూడా సాహసించడం లేదు. ఇదే విషయమై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా తమకు మొక్కలకు సంబంధం లేదని తాము మొక్కలు పెంపకానికి లేబర్‌ను సప్లై చేయటం మాత్రమే తమ వంతని, టీఎస్ ఆయిల్ ఫిట్ అధికారులు చెప్పిన మాదిరిగానే వాటికి కావాల్సిన పోషకాలు, ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపడతామని అంతవరకే తమ బాధ్యతని అంతా అధికారులదేనన్నారు. ఎంతమంది లేబర్‌ని ఉపయోగించారన్న ప్రశ్నలకు కాంట్రాక్టర్ వద్ద సమాధానం లేదు. మూడు లక్షల మొక్కల ఎదుగుదలలో 17 నెలలుగా లోపం కనిపిస్తున్న అటు అధికారులు ఇటు కాంట్రాక్టర్ ఎందుకు మీన మేషాలు లెక్కించారనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సీసీ కెమెరాల పర్యవేక్షణ లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి సుమారు రెండు కోట్ల నష్టం వాటిల్లింది. ఇప్పటికే పలు పామాయిల్ తోటలలో ఆఫ్ టైప్ మొక్కలతో సతమతమవుతున్నారు రైతన్నలు. భారీ అవినీతిలో ఎవరి ప్రమేయం ఉందో గుర్తించి తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకొని రైతన్నలకు న్యాయం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వేడుకుంటున్నారు పామాయిల్ రైతులు.

# మహిళ

ఫోకస్



## గాజా మహిళ జీవితం.. నిరంతర పోరాటం

గాజాలో కాల్పుల విరమణ అమల్లైంది. సుమారు 15 నెలల యుద్ధానికి తెరపడింది. కానీ, గాజా స్ట్రిప్‌లో మహిళ బతుకులు ఎప్పుడు బాగుపడతాయో తెలియని పరిస్థితి. ఆది నుంచి అక్కడి మహిళది నిరంతర పోరాటాల జీవితమే. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకుపోయిన హమాస్ తీవ్రవాదులు చెరబట్టిన బందీల్లో ఎక్కువ మంది మహిళలే. వివస్త్రను చేసి, వాహనానికి కట్టి, చిత్రహింసలకు గురి చేసింది కూడా ఓ మహిళనే. అందుకు ప్రతీకారంగా, హమాస్ ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ జరిపిన మారణ హోమం గురించి ఎంత చెప్పినా తక్కువే. కొంత మంది మహిళలు చనిపోయి సుఖపడ్డారు! చాలా మంది బతుకుతున్నా, మానసికంగా చనిపోయారు! కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో, పిల్లల కోసం వెతుక్కునే తల్లులు కొందరు.... భర్తల రాక కోసం ఎదురుచూస్తున్న భార్యలు మరికొందరు... అసలు వాళ్లు వస్తారో? రారో తెలియని పరిస్థితి. పదిహేను నెలల్లో వారు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. అత్యాచారాలకు గురయ్యారు. ఎప్పుడు, ఎవరు, ఎక్కడి నుంచి దాడి చేస్తారో తెలియని పరిస్థితి. శరీరాన్ని వాడుకొని వదిలేస్తారో లేక ప్రాణాలు కూడా తీస్తారో అంతుచిక్కని దుస్థితి. గాజా స్ట్రిప్‌లో ప్రతి పాలస్తీనా మహిళ గుండెలో మానిపోని గాయాలు.. పూడ్చలేని అగాథాలు.. అంతులేని విషాదాలు ఎన్నో.. ఎన్నెన్నో. ప్రతి మహిళదీ ఒక కన్నీటి కథ. అడుగడుగునా ఆంక్షలు.. నిర్బంధాలు.. అణచివేతలు.. పాలస్తీనా మహిళల జీవితాల నిండా రక్తపు మరకలే. కళ్ల ముందు పిల్లలు తుపాకీ గుళ్లకు నేలకూలుతున్నా, బిగ్గరగా ఏడవడానికి కూడా నోచుకోని జీవితాలే. శవాల గుట్టల్లో తమవారు ఎవరో గుర్తుపట్టడం కూడా కష్టమైన పరిస్థితుల్లో, సామూహిక అంత్యక్రియలతో సంతృప్తి చెందాల్సిన దైన్యం. శిథిల సౌధాల కింద సజీవ సమాధి అయినవారు ఎంత మందో ఎవరికీ తెలియదు. ఆ లెక్కలు ఎప్పటికి తేలుతాయో అంతకంటే తెలియదు. అప్పటి వరకూ గాజాలో పాలస్తీనా మహిళల పరిస్థితి ఏమిటనేది ఎవరికీ పట్టదు. అత్యాచారానికి గురికావడం లేదా సొంతవారిని కోల్పోవడం.. కారణం ఏదైతేనేం కన్నీళ్లు మాత్రం గాజా మహిళల సొంతం. అందరూ బాధితులే... ఎవరు ఎవరిని ఓదారుస్తారు? ఎవరు వచ్చి ఆదుకుంటారు? మానవ హక్కుల సంరక్షణే ధ్యేయమని ప్రకటించుకుంటున్న అమెరికా, కాల్పుల విరమణ ఘనత తనదేనని గొప్పలు చెప్పుకొంటున్నది. కానీ, జరిగిన నష్టాన్ని భర్తీ చేయగలదా? హమాస్‌తో ఇజ్రాయెల్ సంధికి అంగీకరించిది... కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. గాజా వల్లకాడైంది. అక్కడి ప్రజలు జీవచ్ఛవాలయ్యారు. అత్యాచారాలు... హత్యాచారాల లెక్కలు ఎవరు తీస్తారు? పోయిన ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? గాజా మహిళల బాధలు ఎప్పటికి తీరుతాయి? దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆధిపత్య పోరాటానికి ముగింపు ఎప్పుడు? సమాధానం లేని ఎన్నో ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

## తెరపైకి మళ్లీ స్వలింగ వివాహాల అంశం..

దేశంలో స్వలింగ వివాహాలకు గుర్తింపు, చట్టబద్ధత అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఒకే లింగానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య (ఇద్దరు మహిళలు లేదా ఇద్దరు పురుషులు) వివాహాలకు చట్టబద్ధత కల్పించడానికి 2023లో సుప్రీం కోర్టు నిరాకరించింది. అప్పట్లో సుప్రీం కోర్టు ధర్మాసనం 3:2 మెజారిటీతో ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అయితే, నాటి తీర్పును పునఃపరిశీలించాలని తాజాగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. మన దేశంలో స్వలింగ జంటల వివాహాలు లేదా సహజీవనాలకు, అలాంటి పౌర సంఘాలకు గుర్తింపు లేదు. ఈ విధమైన వివాహాలను ప్రత్యేక వివాహ చట్టం (ఎస్ఎంఎ) కింద చట్టబద్ధం చేయాలన్న పిటిషనర్ వాదనతో సుప్రీం కోర్టు ధర్మాసనం విభేధించింది. ఆ చట్టం స్వలింగ వివాహాలకు వర్తించదని స్పష్టం చేసింది. ఈ విషయంపై చట్టాలు చేసే అధికారం పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఉంటుందని పేర్కొంది. భారత రాజ్యాంగం ప్రకారం, ఇద్దరు మగవారు లేదా ఇద్దరు ఆడవారు వివాహం చేసుకోవడం ప్రాథమిక హక్కు కిందకు రాదని కూడా సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు) కింద హామీ ఇచ్చినట్లుగా, లైవ్ ఇన్ పార్టనర్ల మాదిరిగానే సమాన ప్రయోజనాలు, హక్కులను అనుభవించే స్వలింగ జంటల హక్కును సమర్థించింది. ఇలావుంటే, 2024 చివరి నాటికి, స్వలింగ వివాహాలకు నెదర్లాండ్స్, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్‌తోసహా ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాలు చట్టబద్ధత కల్పించాయి. 2001లో పౌర వివాహ చట్టాన్ని సవరించడం ద్వారా స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన మొదటి దేశం నెదర్లాండ్స్. కాగా, ఆసియాలో స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన



మొదటి దేశం తైవాన్. ఇరాన్, అఫ్గానిస్థాన్, సౌదీ అరేబియా, బ్రూనై వంటి అనేక దేశాలు స్వలింగ వివాహాలను నిషేధించడమేగాక, మరణశిక్ష లేదా కఠినమైన శారీరక శిక్షతో సహా తీవ్రమైన శిక్షలు కూడా విధిస్తున్నాయి. మన దేశానికి సంబంధించినంత వరకూ అలాంటి చట్టబద్ధత లేదు. 1954, భారతదేశంలోని వివిధ మతాలు లేదా కులాల వ్యక్తుల మధ్య వివాహానికి చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కల్పించేందుకు ప్రత్యేక వివాహ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఇది పౌర వివాహాలను నియంత్రిస్తుంది, ఇక్కడ మతపరమైన అధికారులకు బదులుగా రాజ్యమే వివాహాన్ని మంజూరు చేస్తుంది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో, హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులతో సహా అన్ని రకాల మత విశ్వాసాల ప్రజలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఎస్ఎంఎ ప్రకారం రెండు పార్టీలు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్‌లను కలిగి ఉండాలి. వివాహ నోటీసును దాఖలు చేయడానికి ముందు కనీసం ఒకరు, భారతదేశంలో తక్కువలో తక్కువ 30 రోజులు నివసించినట్లయితే విదేశీయులు కూడా భారతదేశంలో తమ వివాహాన్ని నమోదు చేసుకోవచ్చు. వివాహాల నమోదు, వాటికి చట్టపరమైన గుర్తింపును మంజూరు చేయడం, వారసత్వం, సామాజిక భద్రతా ప్రయోజనాల వంటి హక్కులను అందిస్తుంది. ఈ చట్టం అందిస్తుంది. సెక్షన్ 5 ప్రకారం, పార్టీలు తప్పనిసరిగా జిల్లా వివాహ అధికారికి వ్రాతపూర్వక నోటీసును అందించాలి. అదే విధంగా సెక్షన్ 7 ప్రకారం నోటీసు ప్రచురించిన 30 రోజులలోపు వివాహంపై అభ్యంతరాలను అనుమతిస్తారు. ఎస్ఎంఎ కింద కనీస వివా హ వయస్సు మగవారికి 21 సంవత్సరాలు, ఆడవారికి 18 సంవత్సరాలు. ఈ చట్టం కింద స్వలిం గ వివాహాలకు అనుమతి ఇవ్వాలన్నది పిటిషనర్ల వాదన. సమానత్వం, మానవ హక్కులను వారు ప్రస్తావించారు. స్వలింగ జంటలు వివాహం చేసుకునే హక్కును నిరాకరించడం అనేది అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాల ప్రకారం ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తూ రెండవత రగతి స్థితిని సృష్టిస్తుందని వాదించారు. సమానత్వం, గౌరవాన్ని ప్రత్యేకంగా పేర్కొంటూ, వివా హం చేసుకునే హక్కును ప్రాథమిక హక్కుగా యూనివర్శల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (యుడిహెచ్ఆర్) సమర్థిస్తున్నది. పిటిషన్లు ఈ విషయాన్ని కూడా ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు అందరికీ ఉందని, తమకు నచ్చినట్టు జీవించడాన్ని ఎవరూ అడ్డుకోరాదని వాదించారు. కానీ, కోర్టు ఈ వాదనతో ఏకీభవించలేదు. పిటిషన్‌ను కొట్టివేసింది. తాజాగా రివ్యూ పిటిషన్‌ను కూడా తోసిపుచ్చింది.

## ఆదర్శమాత 'క్లారా'



చెస్ గురించి తెలిసిన వారికేకాదు... తెలియనివారికి కూడా గారీ కాస్పరోవ్ పేరు సుపరచితమే. ఒకప్పుడు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న అత్యంత పిన్నవయస్కుడిగా అతని పేరు రికార్డు పుస్తకాల్లో ఉండేది. అప్పుడు అతని వయసు 22 సంవత్సరాలుకాగా, భారత ఆటగాడు గుకేష్ దొమ్మరాజు 18 ఏళ్ల వయసులోనే ప్రపంచ కిరీటాన్ని దక్కించుకొని, కొత్త చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. చెస్‌లో అద్వితీయ ప్రతిభావంతుడు, ప్రపంచ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్స్‌లో ఒకడైన అనతొలి కార్పోవ్‌ను సమర్థంగా ఢీకొట్టి, అతని ఆధిపత్యానికి కళ్లెం వేసిన కాస్పరోవ్‌ను మేటి ఆటగాడిగా తీర్చిదిద్దిన ఘనత అతని తల్లి క్లారా కాస్పరోవాకు దక్కుతుంది. స్వయంగా తాను చెస్ క్రీడాకారిణి కావడంతో, కుమారుడు కాస్పరోవ్‌కు చిన్నతనంలోనే చెస్ ఎత్తులు నేర్పింది. అతనిని ప్రోత్సహించింది. దూకుడుగా పావులను కదిలించే కాస్పరోవ్ ప్రతిభను గుర్తించి, అతనికి ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. ప్రపంచ నంబర్ వన్ ఆటగాడిగా, ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టింది. తన విజయాల వెనుక తల్లి క్లారా పాత్ర కీలకమని కాస్పరోవ్ పలు సందర్భాల్లో చెప్పాడు. చెస్‌లో తల్లి వేయించిన తొలి అడుగులు అతనిని అత్యున్నత శిఖరాలకు చేర్చాయి. పిల్లల అభిరుచులను గుర్తించి, ప్రోత్సహించి, వారి అభ్యున్నతికి తోడ్పడే తల్లులే కదా 'ఆదర్శ మాత'లు. అలాంటి వారి జాబితాలో క్లారా ముందు వరుసలోనే ఉంటుంది.

## చరిత్ర సృష్టించిన ఆ ముగ్గురు..



అత్యంత అరుదైన ఈ ఫొటోలో కూర్చున్న వారు (ఎడమ నుంచి కుడికి) ఆనందీ భాయి జోషి (ఇండియా), సబట్ ఇస్లాంబ్బులి (సిరియా), మధ్యలో నిల్చున్న మహిళ కియకొ ఒకామి (జపాన్). ఈ ముగ్గురూ తమతమ దేశాల తరఫున తొలి మహిళా వైద్యులు కావడం విశేషం. మహిళలకు చదువుకో-వడం నిషేధమైన రోజుల్లో, పరిస్థితులను ఎదిరించి, ధైర్యంతో వైద్యవిద్యను అభ్యసించడం అనుకున్నంత సులభం కాదు. ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించిన ఈ ముగ్గురూ, తరతరాల మహిళలకు మార్గదర్శకులు.

## దిక్కుతోచని స్థితిలో భవననిర్మాణ కార్మికులు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ బైంసా పెయింటర్ వర్కర్స్ యూనియన్ అనుమబంధం ఎఐటియుసి బైంసా మండల పెయింటర్ బిల్డింగ్ వర్కర్స్ 2వ మహాసభలు ఎండిఒ కార్యాలయం సమీపం లో లతీఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ముఖ్యఅతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వలస కార్మికులు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. అదే విధంగా నిర్మల్ జిల్లా బైంసా, నిర్మల్‌లో జిల్లాలో ఇదే పరిస్థితి ఉంది దీనితో కార్మికులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని. బైంసా మండల పెయింటర్ బిల్డింగ్ వర్కర్స్ 02వ మహాసభలు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ఫిబ్రవరి 1, నిర్మల్ 5వ తేదీన జరుగుతాయని, జిల్లా మహాసభలు 24వ తేదీన నిర్మల్‌లో ఘనంగా జరుగునని తెలియజేశారు. బైంసా పట్టణ నియోజకవర్గ పెయింటర్ భవన నిర్మాణ కార్మికులు యూనియన్‌లో చేరి బలోపేతం చేయాలని వారి సమస్యలపై ఎఐటియుసి పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి.ప్రకాష్, జిల్లా భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.సాయన్న, కార్యదర్శి ఎస్.కుమార్, సహయ కార్యదర్శి అజయ్ ఉపాధ్యక్షుడు నజీర్, ప్రచార కార్యదర్శులు, ఆసిఫ్, తజముల్ తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమాలకు సన్నద్ధం

### రుణమాఫీ నూరుశాతం అమలుచేయాలి : ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు



**ప్రజాపక్షం/చింతకాని :** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్యమాలకు రైతులు సన్నద్ధం కావాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి చింతకాని మండలం కొదుమూరు ఎఐకేఎస్ గ్రామశాఖ సమావేశం జరిగింది. తొలుత సీనియర్ నాయకులు జనగాం వెంకటేశ్వర్లు పతాకావిష్కరణ చేశారు. ఈ సమావేశంలో భాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా 75శాతం వ్యవసాయరంగం ఉన్నప్పటికీ బడ్జెట్‌లో 50శాతం నిధులు కేటాయించడమే రైతులను విస్మరించడమేనన్నారు. దేశ సరిహద్దులో రైతు నాయకులు జగ్‌జిత్‌సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నా కనీసం కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డియాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని, ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఆశలు పెట్టుకున్నారన్నారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతుభరోసా పెట్టుబడి క్రింద ఇచ్చే సహాయం ఖరీఫ్ పూర్తయి రబీ ప్రారంభమైనా నేటికి రైతుభరోసా అందించలేదన్నారు. రైతాంగ సమస్యల కోసం నూతన ఉద్యమాలను రూపొందిస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రెండూ రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, రైతు సంఘం బలంగా ఉంటే రైతు ఉద్యమం మరింత బలపడుతుందన్నారు. అనంతరం ఎఐకెఎస్ గ్రామశాఖ నూతన అధ్యక్షుడుగా నక్కనబోయిన కృష్ణ, ప్రధా న కార్యదర్శిగా సారిక వెంకటేశ్వర్లుతో పాటు మరో 12 మందితో నూతన కమిటీని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.. ఈకార్యక్రమంలో తెలంగా ణ రైతుసంఘం జిల్లా కోశాధికారి కూచిపుడి రవి, సిపిఐ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, మాజీ సర్పంచ్ సుజాత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్లను రెగ్యులర్ చేసే వరకూ ప్రభుత్వంపై పోరాటం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఒకే శాఖ ఉద్యోగులకు వేరువేరుగా సర్వీసు రూల్స్ పెట్టి, ఆర్టిజన్లకు అన్యాయం చేయడం పట్ల పెద్దపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి తాండ్ర సదానందం ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఎస్ఇ కార్యాలయం వద్ద సోమవారం ఆర్టిజన్లు చేపట్టి న దీక్షకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఉత్పత్తి, సరఫర, పంపిణీ తదితర కీలకమైన విభాగాల్లో విద్యుత్ ఉ ద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఆర్టిజన్లను ప్రభుత్వం ధగా చేస్తోందని మండిపడ్డారు. సుమారు తెలంగాణ వ్యాప్తంగా 19,575 మంది ఆర్టిజెన్లు పనిచేస్తుండగా రెండు సర్వీస్ రూల్స్ పెట్టి విద్యుత్ ఉద్యోగులకు ఒక తీరుగా, ఆర్టిజన్లకు మరొక తీరుగా వేతనాలు చెల్లించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పర్మనెంటు ఉద్యోగులకు సౌకర్యాలు, హక్కులు, ప్రమోషన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తున్నారనన్న ఆయన ఆర్టిజన్స్ విషయంలో ఆ రూల్సు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు.ఆర్టిజన్లను విద్యుత్ ఉద్యోగుల రూల్సులో చేర్చి కన్వర్షన్ చేయాలని సదానందం డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏ డాది గడిచినా ఆర్టిజన్స్ సమస్యలను పరిష్కరించకుండా దాటేసే ధోరణి ప్రదర్శించడం సరైనది కాదని, ఇప్పటికైనా ఆర్టిజన్స్ జెఎసి నాయకత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డి మాండ్ చేశారు. ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో సిపిఐ పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆరేపల్లి మానస్ కుమార్,కల్లెపల్లి నవీన్,టివిఎసి జాక్ చైర్మన్ మల్లూరి కిషన్ రెడ్డి, కన్వీనర్ మట్ట రాజు, కో చైర్మన్లు దుర్గం విశ్వనాథ్, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లయ్య, కో కన్వీనర్లు రఘు, సందీప్, కొశాధికారి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ పోరాటానికి మార్గదర్శి లెనిన్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడిగానే కాక ప్రథమ కమ్యూనిస్టు రాజ్యం దిశగా రష్యాను నడిపించిన లెనిన్ నేటికీ ప్రపంచవ్యాప్తంగా విప్లవ పోరాట పటిమకు మార్గదర్శి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ అన్నారు. లెనిన్ 101వ వర్ధంతి సందర్భంగా ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ దోపిడి, పీడన ఉన్నా శ్రామికవర్గాల ప్రజలకు కాలాతీతంగా లెనిన్ స్ఫూర్తిదాయకంగా ఉంటారన్నారు. మార్క్స్ కేవలం ఒక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రతిపాదించగా లెనిన్ దాన్ని ఆచరణ సాధ్యం చేసిన గొప్ప విప్లవనాయకుడన్నారు. జార్‌ల చేత పీడించబడే ఒక వెనుక బడిన రాజ్యంలో సాయుధ విప్లవాన్ని విజయవంతంగా నడిపించి శ్రామికరాజ్యాన్ని స్థాపించడమే కాక త్వరలో కూలిపోతుందని కలలుగన్న శత్రువు పన్నాగాన్ని భగ్నం చేసి దాన్ని సుస్థిరం చేసిన మేధావి అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు,ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, బుచ్చిరెడ్డి, జాన్, సాయి, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

### గొప్ప విప్లవకారుడు లెనిన్ : గన్న చంద్రశేఖర్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సోషలిస్ట్ సిద్ధాంతాన్ని ఆచరించిన గొప్ప విప్లవకారుడు లెనిన్ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో లెనిన్ 101వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ మరణించి వంద సంవత్సరాలు అవుతున్న ప్రపంచంలో ఎక్కడ దోపిడి, పీడన ఉన్నంత వరకు శ్రామికవర్గాల ప్రజలకు దేశాలకు



అతీతంగా ఆయన స్ఫూర్తిదాయకంగా ఉంటారని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రష్యాచుట్టు ఉన్న 14 సామ్రాజ్యావాద దేశాల సైన్యాలు దురాక్రమిస్తూ ఆధునిక ఆయుధాల వేగన్లతో డబ్బు మూడలతో రష్యాలోని స్వదేశీ విప్లవ ద్రోహులన్ని లెచ్చగొట్టి భయంకరమైన అంతర్యుద్ధాన్ని తెరసీయగా దాన్ని రెడ్ ఆర్మీతో వార్ కమ్యూనిజంతో ఢీకొట్టి ఓడించిన ప్రజా నాయకుడు లెనిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనంతుల మల్లేశ్వరి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, ఎండి పాషా, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి, నాయకులు రెడిమల శ్రీనివాస్, దేశగాని హేమలత పాల్గొన్నారు.

### పెట్టుబడిదారీ వ్యవస్థను రూపమాపడమే నిజమైన నివాళి : కర్రె బిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి / కాజీపేట:** పెట్టుబడిదారీ వ్యవస్థను రూపమాపడమే లెనిన్‌కు నిజమైన నివాళి అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. మంగళవారం లెనిన్ వర్ధంతి కార్యక్రమాన్ని బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కర్రె బిక్షపతి మాట్లాడుతూ రష్యాలో పట్టిపీడిస్తున్న జార్ చక్రవర్తుల నిరంకుశ పాలన, నియంత పాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛగా జీవించేందుకు అంతరాలు లేని సమాజం కోసం అతికొద్ది కాలంలో ఆ దేశంలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటు చేసిన మహానేత లెనిన్ అన్నారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునగాల బిక్షపతి, యేష బోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని రావి నారాయణరెడ్డి కాలనీలో లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి మునగాల బిక్షపతి అద్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మార్క్సిజం సిద్ధాంతాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసిన వ్యక్తి లెనిన్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కారల్‌మార్క్స్, ఎంగిల్స్ రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసిన వ్యక్తి లెనిన్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి పిసుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య అన్నారు. జిల్లా కార్యాలయంలో లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, రఘురాం, హన్మాండ్లు, దేవేందర్, ఆనంద్ పాల్గొన్నారు.



## 25న సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వందేళ్ళ సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ఈనెల 25న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యవర్గ సహావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకుని స్వతంత్ర భారతావనిలో పాలకవర్గాలు అవలంభించే ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించిన, అనేక హక్కులను సాధించిన పేద, కార్మిక, కర్షక వర్గాల పక్షపాతిగా సైద్ధాంతిక ప్రాతికపదికగా పనిచేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. ఈనెల 25న శతాబ్ది ఉత్సవాలను మహబూబాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహిస్తూ, మానుకోట నియోజకవర్గంలో ప్రధమ ఎమ్మెల్యేగా పనిచేసిన తీగల సత్యనారాయణ విగ్రహావిష్కరణ, తెలంగాణ సాయుధపోరాట చిహ్నాలను ఆవిష్కరిస్తున్న సందర్భంగా జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు నెల్లూరు నాగేశ్వరావు, కురవి, మరిపెడ, డోర్నకల్ మండల కార్యదర్శులు కరణం రాజన్న,మారగాని బాలకృష్ణ, టి.రమేష్, పోలెపాక వెంకన్న, బుర్రసమ్మయ్య,బుడమ వెంకన్న, తురక రమేష్,దొంతు రామ్మూర్తి, ఆర్.రవి, నర్సింగం గురవయ్య, బొల్లం ఉప్పలయ్య,దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు, నిలుగొండ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సోన్ :** నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. మున్నూరు కాపు, రజక సంఘ భవనాల మిగులు పనులకు నిధులు మంజూరు అయిన సందర్భంగా వాటికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.850 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తనను ఆశీర్వదించిన నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్థానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి నియోజకవర్గానికి రావాల్సిన వాటా తెస్తామన్నారు. నియోజక వర్గంలో ప్రతీ మారుమూల గ్రామాలకు రోడ్డు, తాగునీరు కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, మార గంగారెడ్డి, హరీష్‌రెడ్డి, నరేష్, రాజేశ్వర్, సంతోష్, నవీన్ పాల్గొన్నారు.

## అర్హులకు రేషన్ కార్డులు

సబ్ కలెక్టర్ కిరణ్మయి




**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ మునిసిపల్ పరిధిలోని ఒకటో వార్డులో మంగళవారం ప్రజాపాలన వార్డు సభలో సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందుతాయన్నారు. వార్డులో ప్రజల నుండి రేషన్ కార్డు లేనివారి దరఖాస్తులను స్వీకరించాలని, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసాపై ప్రజల సలహాలు సూచనలు స్వీకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీర్ చావుస్, వార్డు అధికారి, సంబంధిత శాఖల అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనతో ‘సంక్షేమం’

టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/కొండాపూర్ :** రాష్ట్రంలో ప్రజాపాలనతో ప్రజలకు సంక్షేమం చేరువయిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా గ్రామ సభలు దోహదపడతాయని తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం మల్కాపూర్ గ్రామంలో గ్రామ సభను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయడం కొరకు ప్రభుత్వం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తుందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా కొత్త రేషన్ కార్డు, రైతు బరోసా , ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు చేసుకోకుండా ఉంటే ఇప్పుడు ఈ గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్ పిఎసిఎస్ చైర్మన్లు ఆకుల పవన్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నాణ్యతతో రోడ్డు పనులు

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రోడ్డు పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం 44వ డివిజన్ ఖలీల్‌వాడి, 45వ డివిజన్ వినాయక్‌నగర్, 20వ డివిజన్ ఎల్లమ్మగుట్టలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ,మేయర్ దండు నీతూకిరణ్‌లతో కలిపి హాజరై శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు 44వ డివిజన్ బైకన్ సుధ, మధు, 45వ డివిజన్ ఆకుల హేమలత, శ్రీనివాస్, 20వ డివిజన్ న్యాలం రాజు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి



**ప్రజాపక్షం/నందిపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రజాపాలన గ్రామ సభ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం నందిపేట్ మండలంలోని ఆంధ్రనగర్, చింరాజ్‌పల్లి, ఖుదావన్‌పూర్ గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ గ్రామాలలో లబ్దిదారుల ఎంపిక గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు రాలేవని ఎమ్మెల్యే దృష్టికితెచ్చారు. అక్కడే కొత్త దరఖాస్తులను తీసుకొని అర్హులైన అందరికి ఇళ్ళు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా వస్తుందని రాకేష్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఆనంద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**మాక్లూర్ :** మాక్లూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మామిడిపల్లి, చిన్నాపూర్, కల్లడి, ధర్మారం, మాందాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించినట్లు, మాక్లూర్ మండల స్పెషల్ ఆఫీసర్ ముత్తన్న తెలిపారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంగళవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో అమ్రాద్ గ్రామంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు కాకుండా అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లకు లోబడి అనర్హులకు అందజేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అనర్హులకు ఇస్తే ప్రజలు ప్రశ్నించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి గ్రామస్తులను కోరారు.

# ‘సంక్షేమానికే’ గ్రామసభలు

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల అందించడానికి గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం క్షేత్రస్థాయి గ్రామ సభలు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మెదక్ పట్టణంలో మున్సిపాలిటీ వార్డు సభలు, శివాయిపల్లి, హవేలీ ఘన్పూర్ మండలం ఔరంగాబాద్ తాండ ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 162 గ్రామ పంచాయతీలు, ప్రజాపాలన గ్రామసభ, 21 వార్డులలో వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు 16వ తేది నుండి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి విచారణ తదుపరి లబ్ధిదారుల ఎంపికకు 21వ తేదీ నుండి 24వ తేది వరకు గ్రామ పంచాయతి, మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలలో పథకాలకు గుర్తించిన లబ్ధిదారుల జాబితా గ్రామస్థులు సమక్షంలో చదివిన తదుపరి ప్రజల నుండి అభ్యంతరాలను తీసుకోనున్నట్లు తెలిపారు. సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని, ఇంకనూ ఎవరైనా ఉంటే ధరఖాస్తు చేయాలని సూచించారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు వేయి రూపాయలు మంజూరు చేయుటకు తయారు చేసిన జాబితా గ్రామసభల్లో పెట్టడం జరిగిందని, అర్హులైన వారి పేర్లు లేకపోతే దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని, పేరు రాని అర్హులు ఉంటే దరఖాస్తు ఇవ్వాలని, అందుబాటులో లేనివారు ఎంపిడిఓ కార్యాలయాల్లోని ప్రజాపాలన సహాయక కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేయొచ్చునని స్పష్టం చేశారు. నాలుగు పథకాలకు అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో ప్రజల సమక్షంలో చదవడం జరిగిందని ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో గ్రామసభ జాబితాకు ఆమోదం తెలిపినట్లు ఆయన తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలు నిరంతర. ప్రక్రియ అని అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనకు గురి కావొద్దన్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలు నిరంతరం

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పష్టం చేశారు. ఇందల్వాయి మండలం లోలం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించామని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామన్నారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకుని వారితో పాటు అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. గ్రామసభలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, మండల ప్రత్యేకాధికారి వీరాస్వామి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని నాయిడివాడ, నిర్మల్ గ్రామీణ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన వార్డు, గ్రామ సభలలో కలెక్టర్ పాలొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఆహార భద్రత(రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు,అనవసరం ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. గ్రామసభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగి పరిశీలించి,అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. కార్యక్రమాలలో ఆర్డీవో రత్నాకళ్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, తహసీల్దార్లు రాజు, సంతోష్ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో మొత్తం 9127 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ,ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఇఒ పి.రామారావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, అంబాజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు పద్మ, సలోమి కరుణ, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందించేందుకు పారదర్శకమైన లబ్ధిదారుల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల శ్రీరాంపూర్ కాలనీ 5వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమం లో అత్యంత నిరుపేద అర్హులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందుతుందని తెలిపారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లేఅవుట్లు, రైల్వే, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి, అర్హత మేరకు అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు గ్రామ పంచాయతీలలో గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించిన అనంతరం జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు.

### గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

**మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలో ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావుతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

# నిరుపేదలకే సంక్షేమం




కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాలు జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా చూస్తామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పునరుద్ఘాటించారు. ప్రజల దగ్గర నుండి సంక్షేమ పథకాలపై అభిప్రాయ సేకరణ సర్వేకు సంబంధించి జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో డిఆర్‌డిఒ దత్తారంతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కింద సాగు భూములకు మాత్రమే భరోసా మొత్తాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. రాళ్లగుట్టలు, వెంచర్లు, ప్లాట్లు లాంటి భూములను గుర్తించడం జరిగిందన్నారు. భూమిలేని నిరుపేదలు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 20రోజుల పైగా పని చేసిన కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరికి సంవత్సరానికి 12,000 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రతి ఇంటికి అధికారులు సర్వే చేయడం జరిగిందని వివరించారు. దీని ప్రకారం అర్హులైన వారిని కానీ వారిని గుర్తించడం జరిగిందన్నారు. అర్హులైన వారి జాబితాను గ్రామసభలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చదివి వినిపించడం జరుగుతుందని ఏదైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు తెలియజేయాలన్నారు. వాటిని సభలో నమోదు చేసి క్షేత్రస్థాయిలో మరోసారి అటువంటి వాటిపై సర్వే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. లబ్ధిదారుల జాబితాలో తమ పేరు లేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాబితాలో లేని వారు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుకు ప్రత్యేక సెల్ లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. గ్రామాలో సాగుకు యోగ్యం కాని వ్యవసాయ భూముల వివరాలు జాబితా గ్రామ సభ లు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

# సాగుభూమికే రైతు భరోసా

కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల, మంజూరు నిరంతర ప్రక్రియఅని, సాగుకు యోగ్యమైన భూమికే రైతు భరోసా అందుతుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈనెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు , ఆహార భద్రత (రేషన్ కార్డులు) , ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలలో అక్రమాలు జరగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పథకాలు అందేలా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం కంది మండలం చేరియాల గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. గ్రామాలలో రెవెన్యూ ,వ్యవసాయ శాఖల అధికారులు పంచాయతీ రాజ్, అధికారులతో సంయుక్త సర్వే బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేశామన్నారు. గ్రామాలో సాగుకు యోగ్యం కాని వ్యవసాయ భూముల వివరాలు జాబితా గ్రామ సభలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన రేషన్ కార్డుల కోసం గ్రామంలో వచ్చిన దరఖాస్తులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు ,ఆహార భద్రతా కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం సాగుతుందన్నారు. గ్రామ సభలో దరఖాస్తు చేసుకొని వారు మున్సిపల్ కేంద్రాలు ,మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ధరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు ప్రజా పాలన ప్రారంభమైనప్పటినుండి ఈ కేంద్రాలు నడుస్తునే ఉన్నాయని తెలిపారు. ప్రజా పాలన కేంద్రాలు నిరంతరం పనిచేస్తాయన్నారు. ఎటువంటి అపోహాలు పడకుండా ప్రజలు గ్రామ సభలు ,వార్డు సభలు, ప్రజాపాలన కేంద్రాలను వినియోగించుకోవాలని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందజేయడం కోసం గత 15 రోజులుగా అధికారులు బృందం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిల జరిగిన పరిశీలన ప్రకారం జాబితాలు రూపొందించి గ్రామ సభల ద్వారా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. గ్రామ సభలలో దరఖాస్తులు చేయవచ్చని వీలు పడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైన మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబందిత పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పని సరిగా పరిశీలించి అర్హులందరికి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ క్రాంతి వల్లూరు భోరోసా కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి , స్థానిక అధికారులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ‘మెడికల్’ నియంత్రణేది ?



జాడ లేని డ్రగ్స్ అధికారులు...

అర్హతలు లేకున్నా పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు..

గ్రామాల్లో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌లు

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** జిల్లావ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం అధికారుల నిఘా కొరవడింది. ఇష్టారీతిన ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపి,పిఎంపి)లు ఔషధాలను విక్రయిస్తున్నారు. ఆసుపత్రి కౌంటర్లలో, మెడికల్ దుకాణాలలో తనిఖీలు లేకపోవడంతో విచ్చలవిడినా నాణ్యతలేని మందులు అమ్ముతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందులను అంటగడుతూ యదేచ్ఛగా దోచుకుంటున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా అటాచ్ మెడికల్ షాప్ యజమానులు...** ఆసుపత్రులలో ఉన్న అటాచ్ మెడికల్ షాప్ నిర్వాహకులు నిబందనలను తుంగలో తొక్కుతున్నారు. మెడికల్ దుకాణాలలో వినియోగదారులకు ఫార్మాసిస్టు ద్వారానే మందులను విక్రయించాలి. దుకాణాలలో శుభ్రత పాటించాలి. గ్లాసులతో కూడిన ర్యాకులో మందులు ఉంచాలి. ఫ్రిడ్జ్, ఏసి, రిజిస్టర్, బిల్ బుక్ వంటివి దుకాణాలలో ఉంచాలి. శాంపిల్స్‌గా ఇచ్చిన మందులు విక్రయించకూడదు అని నిబంధన ఉంది. ఈ నిబంధనలో ఏ ఒక్క దానిని కూడా మెడికల్ షాప్ యజమానులు పాటించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు...** జిల్లాలో మెడికల్ షాప్ యజమానులు ప్రతి మెడికల్ షాప్ నుంచి కొంత డబ్బులు వసూలు చేసి నెలనెల సంబంధిత అధికారులకు ముట్ట జెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మెడికల్ షాప్ నిర్వాహకులు నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. ఆసుపత్రిలోకి వచ్చే అమాయక ప్రజలకు ఏవో మందులు ఇస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

**కనిపించని రిజిస్టర్ ఫార్మసిస్ట్...** డ్రగ్స్ అండ్ కాసుమోటిక్ యాక్ట్ 1940 ప్రకారం ప్రతి మెడికల్ షాప్‌లో రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ఉండాలి. బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే ఈ మెడికల్ దుకాణాలలో నిర్వహించాల్సి ఉంటుంది. మెడికల్ దుకాణాలకు అనుమతి ఇచ్చే సమయంలో ఔషధ నియంత్రణ అధికారులు ఫార్మసిస్టు ఉన్నది లేనిది పరిశీలించిన తర్వాత సదర్ మెడికల్ దుకాణానికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత ఏరియా ఇన్స్పెక్టర్ కూడా తనిఖీలు చేసిన సమయంలో ఫార్మసిస్టులు ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉన్నప్పటికీ అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు లెక్కలు ప్రకారం ప్రతి మెడికల్ దుకాణాలు ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో నడుస్తున్నట్టుగా ఉంది. కానీ చాలా చోట్ల ఫార్మసిస్టు లేరు అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**విచ్చలవిడిగా డ్రగ్స్ అమ్మకాలు...** కెమిస్ట్రీ డ్రగ్స్ టెండర్స్ విచ్చలవిడిగా డ్రగ్స్ అమ్మేస్తున్నారు. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంది.క్వాలిఫైడ్ ఫార్మసిస్టు లేకుండానే మెడికల్ షాపులు నడుపుతూ ఇష్టమొస్తున్నట్లు ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్లు ఈ వ్యవహారం నడుపుతున్న డ్రగ్స్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి నెల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముడుపులు ముడుతున్నాయి అనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా అడ్రస్ అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మెడికల్ , జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ బ్రాంచ్ ఏర్పాటు చేసుకొని ఇష్టారీతిన డ్రగ్స్ అముతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# క్రీడ



## మలేసియాపై భారత్ ఘన విజయం

అండర్–19 టీ20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. వెస్టిండీస్‌పై గెలిచి శుభారంభం చేసిన భారత్.. మంగళవారం మలేసియాతో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు విజృంభించడంతో మలేసియా.. 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌటైంది. ఇందులో 11 ఎక్స్‌ట్రాలు ఉండటం గమనార్హం. మలేసియా బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదంటే మన బౌలర్ల జోరు ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. నూర్ అలియా హైరున్ (5), హుస్నా (5) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (27*; 12 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసింది. కమలిని (4*) పరుగులు చేసింది. భారత బౌలర్ వైష్ణవి శర్మ (5/5) సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆమె తన చివరి ఓవర్‌లో నూర్ ఐన్ బింటి రోస్లాన్ (3), నూర్ ఇస్మా దానియా (0), సితి నజ్వా (0)ను పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించింది. ఆయుషి శుక్లా (3/8) అదరగొట్టింది. వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో (జనవరి 23) శ్రీలంకతో తలపడనుంది.



## భారత్‌తో తొలి టీ 20.. తుది జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్

వరుసగా టెస్టు సిరీస్ వైఫల్యాలు చవిచూసిన టీమ్‌ఇండియా.. ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే సమరానికి ముందు.. పొట్టి ఫార్మాట్ కిక్కు అందించేందుకు సై అంటోంది. నేటి నుంచే (జనవరి 22) ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 6 నుంచి ఇరుజట్ల మధ్య వన్డే సిరీస్ మొదలవనుంది. అలవోకగా సిక్సర్లు బాదే హిట్టర్లు.. బంతిని బౌండరీలు దాటించే బ్యాటర్లు.. ధనాధన్ ఇన్నింగ్స్‌లతో చెలరేగే ఆల్‌రౌండర్లు.. ఇలా ఏ రకంగా చూసుకున్నా రెండు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ పొట్టి సిరీస్ అభిమానులకు అసలు సిసలు వినోదాన్ని అందించడం ఖాయం. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఒక రోజు ముందే ఇంగ్లాండ్ తుది జట్టును ప్రకటించింది. కెరీర్‌లో మూడు టీ20లు ఆడిన ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్ ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. అతను చివరగా 2023 డిసెంబరులో వెస్టిండీస్‌తో జరిగిన టీ20లో ఆడాడు. ఆదిల్ రషీద్‌ను ఏకైక స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకున్నారు. పార్ట్ టైమ్ స్పిన్నర్లు లివింగ్‌స్టన్, జాకబ్ బేథల్‌లను కూడా తుది జట్టులోకి ఎంపిక చేశారు. మరో విషయం ఏంటంటే.. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు 24 టీ20లు జరగ్గా.. ఇంగ్లిష్ జట్టు 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. భారత గడ్డపై 11 మ్యాచ్‌లు ఆడి ఐదుసార్లు గెలిచింది.

**భారత్‌తో తొలి టీ20కి ఇంగ్లాండ్ తుది జట్టు:** బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ (వికెట్ కీపర్), జోస్ బట్లర్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

## ఫ్యామిలీ సపోర్ట్ చాలా ముఖ్యం..

### బిసిసిఐ కొత్త నిబంధనలపై స్పందించిన జోస్ బట్లర్



భారత క్రికెట్ వ్యవస్థను గాడినపెట్టేందుకు బీసీసీఐ ఇటీవల నూతన నియమావళిని తీసుకొచ్చింది. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. 10 పాయింట్లతో కూడిన నియమావళిని సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లకు బీసీసీఐ పంపించింది. ప్రతి ఒక్క ఆటగాడు దేశవాళీ క్రికెట్లో తప్పనిసరిగా ఆడటం ఈ కొత్త రూల్స్‌లో ప్రధానమైనది. విదేశాల్లో పర్యటనల సమయంలో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బసపైనా బీసీసీఐ పరిమితులు విధించింది. సుదీర్ఘ పర్యటనలో భాగస్వామి, పిల్లలు రెండు వారాలు మాత్రమే ఉండొచ్చు. తక్కువ వ్యవధి సిరీస్‌లో కేవలం వారం రోజులు మాత్రమే అనుమతి ఉంటుంది. కుటుంబ సభ్యుల ప్రయాణం గురించి కార్యదర్శితో మాట్లాడాలని, ఆటగాళ్లు తనను అడుగుతున్నారని కెప్టెన్ రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టు ప్రకటన సందర్భంగా అన్నాడు. టీ20, వన్డే సిరీస్ కోసం భారత పర్యటనకు వచ్చిన ఇంగ్లాండ కెప్టెన్ జోస్ బట్లర్ బీసీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై స్పందించాడు. అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లకు ఫ్యామిలీ సపోర్ట్ ఉండటం చాలా కీలకమని పేర్కొన్నాడు. 'ఇది (క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బస) చాలా ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. మనం ఇప్పుడు ఆధునిక ప్రపంచంలో జీవిస్తున్నాం. విదేశీ పర్యటనల్లో క్రికెటర్లు కుటుంబాలతో కలిసి ప్రయాణిస్తే బాగుంటుంది. ఫ్యామిలీతో కలిసి ఆ సమయాన్ని ఆస్వాదించాలి. ఎందుకంటే తీరిక లేని షెడ్యూల్‌తో క్రికెటర్లు ఎక్కువ కాలం ఇంటికి దూరంగా ఉంటారు. ఇది (కుటుంబ సభ్యులు వెంట రావడం) క్రికెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని నేనైతే అనుకోను. దీని గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. నా అభిప్రాయం ప్రకారం క్రికెటర్లకు ఇంటికి దూరంగా ఉన్నామనే ఫీలింగ్ కలగకుండా ఉండాలంటే వారి వెంట ఫ్యామిలీ ఉండటం చాలా ముఖ్యం. ఇది వారిని ఎమోషనల్‌గా, మానసికంగా బలంగా ఉంచుతుంది' అని బట్లర్ వివరించాడు. ఇదిలా ఉండగా.. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ మధ్య జనవరి 22న ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా)లో తొలి మ్యాచ్ జరగనుంది.

## చరణ్ 16పై సాలిడ్ బజ్!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం తర్వాత చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంపై కూడా భారీ హైప్ నెలకొనగా ఈ సినిమా షూటింగ్ సహా ఇతర అంశాలపై సాలిడ్ బజ్ తెలుస్తుంది. దీనితో ఈ సినిమా కొత్త షెడ్యూల్ ని ఈ జనవరి 27 నుంచి మొదలు పెట్టనున్నట్టుగా తెలుస్తుంది. అలాగే షూటింగ్‌ని మాత్రం పక్కా ప్లానింగ్ ప్రకారం కంప్లీట్ చెయ్యాలనే మేకర్స్ అనుకుంటున్నారట. దాదాపు ఈ ఏడాది జూలైకి పూర్తి చేసేస్తారని తెలుస్తుంది. అలాగే దాదాపు ఈ దసరా రేస్‌లో లేదా డిసెంబర్ నెలలోనే రిలీజ్ చేసేస్తారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇక ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

# రీల్

## రేపు 'తండేల్' మూడో సింగిల్ సాంగ్




అక్కినేని నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తండేల్' ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు చందు మొండేటి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ ఈ మూవీపై అంచనాలు పెంచాయి. అయితే, ఇప్పుడు ఈ సినిమా నుంచి మరో అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమాలోని మూడో సింగిల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'హైలెస్సో హైలెస్స' అంటూ సాగే ఈ పాట మెలోడీగా రానుందని మేకర్స్ వెల్లడించారు. ఈ పాటను మెలోడీ క్వీన్ శ్రేయా ఘోషల్‌తో పాటు అజీజ్ నాకాష్ ఆలపించారు. ఈ పాటను జనవరి 23న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఇక ఈ సినిమాలో అందాల భామ సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుండగా రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



## ఇది నా కొత్త ప్రయాణం

### చిలుకూరు ఆలయంలో ప్రియాంకా చోప్రా..

ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా హైదరాబాద్ నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. సంబంధిత ఫొటోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బాలాజీ ఆశీస్సులతో కొత్త ప్రయాణం మొదలు పెడుతున్నట్టు తెలిపారు. భగవంతుడి దయ అనంతం అని పేర్కొన్నారు. అష్టాక్షరి మంత్రం ఓం నమో నారాయణాయ అని క్యాప్షన్‌లో పెట్టారు. రామ్‌చరణ్ సతీమణి, అపోలో సంస్థల ఉపాధ్యక్షురాలు ఉపాసనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లవ్ ఎమోజీలు జోడించారు. ఉపాసన స్పందిస్తూ.. 'మీ కొత్త సినిమా మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహం మీకు ఉంటుంది' అని రిప్లై ఇచ్చారు.

## ఏసుబాయిగా రష్మిక

పుష్ప ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి ఛావా. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా..




ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ నేడు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠి భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠి భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.




## నాగశౌర్య కొత్త చిత్రం అప్డేట్ 'రెడీ'

యంగ్ హీరో నాగశౌర్య సినిమాలకు ఎలాంటి ఆదరణ లభిస్తుందో అందరికీ తెలిసిందే. ఆయన సినిమాలకు ప్రేక్షకులు మంచి రెస్పాన్స్‌ను అందిస్తుంటారు. అయితే, ఆయన ఇటీవల చాలా సెలెక్టివ్‌గా సినిమాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఆయన నటిస్తున్న ఓ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్‌ను మేకర్స్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. శ్రీ వైష్ణవి ఫిలింస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న సినిమాలో నాగశౌర్య హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాను రామ్ దేసిన డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలో నాగశౌర్య సరికొత్త లుక్‌తో కనిపిస్తాడని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను నేడు ఉదయం 10.08 గంటలకు రివీల్ చేయబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## లగచర్ల రైతులకు బెయిల్

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రీన్ ఫార్మ సిటీ ఏర్పాటు కోసం భూసేకరణలో భాగం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన అధికారులపై దాడికి పాల్పడ్డారనే కేసులో నలుగురు రైతులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గతంలో ఒక కేసులో బెయిల్ ఇచ్చింది. వాళ్లు విడుదలైన మరుసటి రోజునే పోలీసులు అదే ఘటనలో మరో కేసులో అరెస్టు చేసింది. ఈ కేసులో రైతుల నుంచి రూ.25 వేల పూచీకత్తు తీసుకుని విడుదల చేయాలని కందిలోని సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో అధికారులపై దాడికి సంబంధించిన కేసులో అరెస్టయిన ఎం.రమేష్, ఎం.గోపాల్ నాయక్, ఎం.మాదరయ్య, పి.మంగ్యానాయక్‌లను విడుదల చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 12కు వేసింది.

## సీనియారిటీ లేకుండా పదోన్నతులు పొందినవారిని..

# తక్షణమే తొలగించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: అర్హత లేకుండా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిని తక్షణమే, ఆ పదవుల నుంచి తొలగించి, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ,ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఒయులో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో అక్రమాల పుట్టను ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినా వారి ఆర్టికల్స్‌ను పరిశీలించి,యుజిసి కేర్ లిస్టు, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్‌లో లేవని యుజిసి నిర్ధారించిందని తెలిపారు. ఒయులో సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిలో కొంతమందికి మూడు, నాలుగు, ఐదు ఆర్టికల్ ఉన్న సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే అంశంలో ఒయు మాజీ వైస్ ఛాన్సలర్, మాజీ ఉన్నత విద్య మండలి ఛైర్మన్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సీనియర్ ప్రొఫెసర్ల అక్రమాలపై నియమించిన ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ రిపోర్ట్‌ను తక్షణమే బహిర్గతం చేయాలని,



అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొంది,ఇప్పటి వరకు అర్జించిన జీతాన్ని తిరిగి యూనివర్సిటీ రికవరీ చేయాలని కోరారు. ఇప్పటికైనా స్వచ్ఛందంగా సీనియర్ ప్రొఫైల్ షిప్‌ను వదులుకోకపోతే భవిష్యత్తులో ఒయు వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ ఒయు సహాయ కార్యదర్శి భగత్, హైదరాబాద్ సహాయ కార్యదర్శి కళ్యాణ్, నాయకులు వంశీ, అరుణ్ పాల్గొన్నారు.

## వచ్చేనెల డిఇఇటి ఆధ్వర్యంలో

# మెగా జాబ్‌మేళా

### డిఇఇటిలో ముందుగా పేర్లు నమోదు చేసుకోండి: పరిశ్రమల శాఖ డైరెక్టర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రయివేట్ సంస్థలో ఉద్యోగాలు కల్పించేందుకు వచ్చేనెల 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డిఇఇటి) ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.మల్లూరు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగానే డిఇఇటి వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పరిశ్రమలువాణిజ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడం కోసం 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డిఇఇటి)ను సిఎం రేవంత్‌రెడ్డి గత నెల4న పెద్దపల్లిలో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ వేదికలో నిరుద్యోగులు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. డిఇఇటి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా నిరుద్యోగులు ప్రాథమిక సమాచారంతో పాటు విద్యార్హతలు, నైపుణ్యాలు మొదలగు మౌలిక సమాచారంతో తమ ప్రొఫైల్ పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. పూర్తిచేసిన రిజిస్ట్రేషన్ వివరాలు ఆధారంగా వారి వ్యక్తిగత బయోడేటాను పంపించాలని సూచించారు. డిఇఇటి, శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా ఫిబ్రవరి నెలలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నాయన్నారు. హైదరాబాదు ప్రాంతంలోని శ్రీచైతన్య విద్యా సంస్థలలో లెక్చరర్స్, ట్యూటర్స్, అడ్మినిస్ట్రేషన్ మొదలగు 33 కేటగిరీలలో 500కు పైగా ఉద్యోగ ఖాళీలను ఈ మెగా జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. బోధన, అడ్మినిస్ట్రేషన్, మేనేజ్మెంట్ రంగంలో ఆసక్తి కలిగిన నిరుద్యోగులు కనీస డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనాలంటే నిరుద్యోగులు ముందుగా DEET(digital Employment Exchange of Telangana)లో నమోదు చేసుకొని ప్రొఫైల్‌ను పూర్తి చేయవలసి ఉంటుందన్నారు.

## నిధులెలావచ్చాయి?

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ పి.సి.ఘోష్ విచారించారు. మొత్తంగా 24 ప్రశ్నలను సంధించి, సమాధానాలను రాబట్టినట్లు తెలిసింది. కాగ్ నివేదిక, అఫిడవిట్ ఆధారంగా బిల్లుల చెల్లింపులు, తదితర అంశాలపై రామకృష్ణకు పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ముఖ్యంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు సంబంధించిన అంశాలు, బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా?, కాళేశ్వరం కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు, ఆదాయాన్ని ఎలా సమకూర్చుకోవాలని అనుకున్నారు? అని కమిషన్ ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనికి రామకృష్ణారావు బదులిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని, పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని ఆయన సమాధానమిచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుపైన కూడా కమిషన్ ప్రశ్నించింది. కమిషన్‌కు ఆయన ఇప్పటికే అఫిడవిట్ సమర్పించిన విషయం తెలిసిందే.



## ఎర్రజెండా గుడిసెల్లో...

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలో బాంబుల గడ్డ, కారాల్ మార్క్స్ కాలనీ, జవహర్ నగర్ లాంటి అనేక కాలనీలు ఎ ర్ర జెండా పార్టీలు ఏర్పాటులోనే కాలనీలుగా మారి ఎంతోమందికి నీడనివ్వడం జరిగింది. అందులో గత రెండు సంవత్సరాల క్రితం ఎర్ర చెరువులో వేసిన గుడిసెలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ 100 రోజుల సందర్భంగా భగత్ సింగ్ కాలనీగా నామకరణం చేసి సుమారు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడవ సంవత్సరంలోకి ప్రవేశిస్తుంది.

### ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

ఈ రెండు సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను సి పిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ కాలనీ గుడిసె సెంటర్లో ఘనంగా నిర్వహించడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఆవిర్భావ వేడుకలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు అట్లాగే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు లు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా భగత్‌సిం గ్ కాలనీలో ప్రజల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చే సిన బోరును వారు ప్రారంభిస్తారు అనంతరం జెం డా ఆవిష్కరణ అక్కడే భారీబహిరంగ సభ ఉంటుం ది. కాలనీలో ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన పనులపై పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యారు.

### మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ప్రజాస్వామ్య దేశంలో ప్రతి మనిషికి విద్య, వైద్యం, కూడు, గుడ్డ నీడ జీవించ డానికి కావలసిన మౌలిక వసతులు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అలాంటి తరుణంలో సిపిఐ పార్టీ ప్రజల పక్షాన ఉండి ఎంతోమందికి ఉండడానికి ఎర్రజెండా పక్షాన నీడను ఏర్పాటు చేసింది. అయితే ఈ కాలనీలో కావలసిన మౌలిక వసతులు కరెంటు రోడ్లు మంచినీటి సౌకర్యం కల్పించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వాలపై ఉంది. గత ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోవడంతో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలం చెందాయి. అయితే ఈ తరుణంలో ఎన్నికలు రావడం ప్రజలు మళ్లీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని కోరుకున్నారు. సిపిఐ పొత్తులో భాగంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా ఈ ప్రజా ప్రభుత్వంలో భగత్ సింగ్ కాలనీకి పట్టాలతో పాటు మౌలిక వసతులు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

### ఎల్లుండే 'రెండేళ్ల' సభ

ఎర్ర చెరువులో ఉన్న భగత్ సింగ్ కాలనీ రెండు సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచిన గండ్ర సత్యనారాయణ రావు ఈ వేడుకలు సిపిఐ ఆహ్వానం మేరకు భగత్ సింగ్ కాలనీకి హాజరు కానున్నారు. కాలనీలో నెలకొన్న మౌలిక వసతులు మంచినీటి సౌకర్యంతో పాటు కరెంటు, పట్టాలకు సంబంధించిన అనేక విషయాలపై కాలనీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సత్యనారాయణరావు హామీ ఇస్తారన్న ఆశతో కాలనీవాసులు ఎంతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే కాలనీ అభివృద్ధి కోసం హామీ ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## 71 శాతం వాటా ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఈఎన్‌సి అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సి వెంకటేశ్వరరావు, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఎపిల మధ్య నీటి వాటా, బోర్డు నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. టెలిమెట్రిక్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరు రాష్ట్రాల అభ్యంతరాలు సైతం సమావేశంలో చర్చకు వచ్చాయి.

తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉందని, ఆ మేరకు నీటి వాటా రావాల్సిందేనని కృష్ణా నది యాజమాన్య బోర్డుకు వివరించామని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ చెప్పారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 66:34 చొప్పున వాటాలను అప్పట్లో ఒక్క ఏడాది కోసం మాత్రమే ఒప్పుకున్నారని, 71:29 వాటాలను కేటాయించాలనేది తెలంగాణ హక్కు అని తేల్చి చెప్పామని ఆయన వెల్లడించారు. ''కృష్ణా జలాల్లో 66:34 నిష్పత్తిపై నిరసన తెలిపామని ఆయన చెప్పారు. తెలంగాణకు 71 శాతం ఖరారు చేసే వరకు చెరి సగం వాటా ఇవ్వాలని కోరామని తెలిపారు. ప్రస్తుతం 66:34 నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తామని, పరిస్థితులను బట్టి వాటా పెంచే ప్రయత్నం చేస్తామని బోర్డు ఛైర్మన్ తెలిపారని రాహుల్ బొజ్జా చెప్పారు. జలాల మళ్లింపు విషయాన్ని సమావేశంలో ప్రస్తావించామని, 11ప్రాంతాల్లో టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరగా, టెలిమెట్రీల ఏర్పాటుపై వారంలో స్పందిస్తామని ఎపి ఈఎన్‌సి తెలిపారన్నారు. తెలంగాణ ఈఎన్‌సి అనిల్ కుమార్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉపసంహరించుకోవాలని కోరినట్లు చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని ప్రస్తావించామని, డ్యామ్ స్లూయిజ్‌కు మరమ్మతులు చేయిస్తామని బోర్డు ఛైర్మన్ చెప్పినట్లు ఆయన వెల్లడించారు.

### 50:50 నిష్పత్తిని అంగీకరించం: ఎపి ఈఎన్‌సి వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ''తెలంగాణ అడిగిన 50:50 నిష్పత్తిని అంగీకరించబోమని బోర్డుకు చెప్పామన్నారు. 66:34 నిష్పత్తి ప్రకారమే కొనసాగించాలని బోర్డు ఛైర్మన్‌ను కోరగా అదే నిష్పత్తి కొనసాగిస్తూ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఎపికి తరలించాలని కోరినట్లు వెంకటేశ్వరరావు వెల్లడించారు. టెలిమెట్రీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదిత వివరాలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థతో మోడల్ స్టడీస్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఫలితాలు వచ్చేవరకు వచ్చే సీజన్‌కు అవసరమయ్యే అత్యవసర మరమ్మతులు చేపడతాం'' అని వెంకటేశ్వరరావు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com